# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 3 డిసెంబరు 2025 వెల : రూ.15

డిసెంబరు నెల నేర్పుతున్న రాజకీయ పాఠాలు

ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా ?

రక్తపాతం లేకుండా రాజకీయ నరమేధమే ఓటర్ల తొలగింపు !

నామినేటెడ్ గవర్నర్ల 'నిష్పాక్షికత'

ఎన్నికల సంఘం 'నో' అనగలదా ?

ఆర్థికవేత్తగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మతతత్వంపై రాజీపడని అంబేద్కర్

అట్టడుగు వర్గాల ఆశా'జ్యోతి'

మానవీయ పునర్వికాసమే దేశభక్తి

అద్భుత ప్రతిభాశాలి ఆచార్య పోకల లక్ష్మీనరసు

24న 'ఎవల్యూషన్ డే'ని జరుపుకుందాం!

చరిత్రను విస్మరించిన వందేమాతరం వివాదం!

కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే కొత్త లేబర్ కోడ్‌లు

భారత్‌లోనే ఆదాయ అసమానతలు ఎక్కువ

సమతా శక్తుల కూటమి కోసం విధాన పత్రం

నవంబరు 26 ప్రజల రాజ్యాంగ దినోత్సవం

సమైక్యతా లోపంతో ఫలించని గోర్ఖాలాండ్ ఉద్యమ నేపథ్య నవల 'విఫల'

మద గజాన్ని నిలువరిస్తున్న గడ్డిపోచలు

భూసేకరణ చట్టం : ఏపీ, తెలంగాణలు ఎలా మార్చేశాయి?

డిసెంబరు - 2025 పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 3


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. డిసెంబరు నెల నేర్పుతున్న రాజకీయ పాఠాలు - సంపాదకీయం 3
2. ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా ? - రాహుల్‌కుమార్ 4
3. రక్తపాతం లేకుండా రాజకీయ నరమేధమే ఓటర్ల తొలగింపు ! - రాఘవ 6
4. నామినేటెడ్ గవర్నర్ల 'నిష్పాక్షికత' - ఎం.ఎ. బేబీ 8
5. ఎన్నికల సంఘం 'నో' అనగలదా ? - ఎస్.వై.ఖురేషి 10
6. ఆర్థికవేత్తగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ - నిశాంత్ చంద్రవంశీ 12
7. మతతత్వంపై రాజీపడని అంబేద్కర్ - పి.ప్రసాద్ 13
8. అట్టడుగు వర్గాల ఆశా'జ్యోతి' - టీ.ఆర్. 14
9. మానవీయ పునర్వికాసమే దేశభక్తి - తెలకపల్లి రవి 16
10. అద్భుత ప్రతిభాశాలి ఆచార్య పోకల లక్ష్మీనరసు - ఏబీ సాయిప్రసాద్ 18
11. 24న 'ఎవల్యూషన్ డే'ని జరుపుకుందాం! - డాక్టర్ దేవరాజు మహారాజు 22
12. చరిత్రను విస్మరించిన వందేమాతరం వివాదం! - సుబ్రత ముఖర్జీ 24
13. కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే కొత్త లేబర్ కోడ్‌లు - అనిసెట్టి శాయికుమార్ 26
14. భారత్‌లోనే ఆదాయ అసమానతలు ఎక్కువ 30
15. సమతా శక్తుల కూటమి కోసం విధాన పత్రం 31
16. నవంబరు 26 ప్రజల రాజ్యాంగ దినోత్సవం - డి వి వి యస్ వర్మ 33
17. సమైక్యతా లోపంతో ఫలించని గోర్ఖాలాండ్ ఉద్యమ నేపథ్య నవల 'విఫల' - శిరంశెట్టి కాంతారావు 35
18. మద గజాన్ని నిలువరిస్తున్న గడ్డిపోచలు - అశోక్ కుంబము 36
19. భూసేకరణ చట్టం : ఏపీ, తెలంగాణాలు ఎలా మార్చేశాయి? - పృథ్వీరాజ్ 40
20. కార్టూన్లు 43
21. కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# డిసెంబరు నెల నేర్పుతున్న రాజకీయ పాఠాలు

డిసెంబరు 6 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి. 'నేను హిందువుగా మరణించను' అని ప్రకటించి బౌద్ధం స్వీకరించి మరణించారు. హిందూ మతంలో అమానుషమైన అంటరానితనం వుంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థవుంది. అందుకే హిందూ మతాన్ని అప్రజాస్వామికమైనదిగా ప్రకటించి 'హిందూ రాష్ట్ర' రాజ్యం భావనని వ్యతిరేకించారు. రాజ్యాంగ ముసాయిదా రచనా కమిటీకి సారధిగా భారతదేశం మతాలకు అతీతంగా అందరిదీ అని, అందరూ సమానులని ప్రకటించే లౌకిక రాజ్యభావనను రూపొందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. సరిగ్గా అంబేద్కర్ వర్థంతి రోజునే డిసెంబరు 6న బాబ్రీ మసీదును కూలగొట్టే ముహూర్తాన్ని సంఘ పరివార శక్తులు తల పెట్టాయి. ఇది బాబ్రీ మసీదును కూల్చడం కాదు. మన రాజ్యాంగ లౌకిక పునాదులను కూల్చే ప్రయత్నంలో భాగం. 'హిందూ రాష్ట్ర' కోసం మత విద్వేష రాజకీయం రాజ్యాంగానికి విసిరిన సవాలును మనం తిప్పికొట్టాలి.

డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం. ఇతర అంతర్జాతీయ దినోత్సవాలను ఆడంబరంగా నిర్వహించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబరు 9న మౌనం పాటిస్తున్నాయి. ఎందుకంటే పాలక పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయి. అవినీతిపై మోదీ ప్రగల్భాలు అందరికీ తెలిసినవే. విదేశాలలో మూలుగుతున్న అవినీతి మూటలు తెచ్చిందీ లేదు, ప్రజలకు పంచిందీ లేదు. దేశంలో నల్లధనాన్ని పెద్దనోట్ల రద్దుతో రాబట్టిందీ లేదు. పైగా ఎలక్షన్ బాండ్ల పేరుతో అవినీతికి మోదీ చట్టబద్ధత కల్పించారు. ఈ పాలకులు అవినీతిని అంతం చేసేవారు కాదు. ప్రజలే తమ ఓటుతో వారిని పాలనకు దూరం పెట్టాలి.

డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం. నిత్యం మానవ హక్కులను పాలకులే హరిస్తున్నారు. దేశంలో మైనారిటీ మతస్థులపైనా, ప్రశ్నించే గొంతుకల పైనా 'ఉపా'లాంటి పలు చట్టాలను ప్రయోగిస్తూ ప్రభుత్వాలు మానవ హక్కుల హననం చేస్తున్నాయి. దీనికితోడు గోరక్షక దళాల దాడులు. 'బుల్డోజరు' సంస్కృతిని అమలు చేస్తున్నారు. పౌరహక్కుల సంఘాలకే పరిమితమైన మానవ హక్కుల దినోత్సవం విస్తరించకపోతే అది ఏదో ఒకనాడు మనల్ని హరిస్తుంది.

మరొకటి డిసెంబరు 26–ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన రోజు. ఇప్పుడు శత వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. దీని పుట్టుక తేదీల వివాదం పక్కన పెడితే 1964 వరకు దేశంలో ఒకే కమ్యూనిస్టు పార్టీ వుంది. స్వాతంత్ర్యోద్యమంలో, ప్రజా ఉద్యమాలలో ముందుంది. 1952 ఎన్నికలలో దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. 1964లో జరిగిన ఒక చీలికతో ఆగకుండా వరుస చీలికలతో అనేక పార్టీలు ఏర్పడ్డాయి. ప్రస్తుత విపత్కర దేశ రాజకీయ పరిస్థితులలో అన్ని వామపక్ష శక్తులు, ఇతర విపక్ష తరగతుల సంస్థలు ఐక్య కార్యాచరణ ప్రారంభించాలి. ఈ శక్తులన్నీ మోదీ విద్వేష రాజకీయాన్ని, కార్పొరేట్ దోపిడీని తీవ్రంగానే విమర్శిస్తున్నాయి. మోదీ భావజాలాన్ని ఓడించడానికి మతాన్ని, మత రాజకీయాల్ని వేరు చేసే నినాదం కావాలి. దాని ఆధారంగా ఒక రాజకీయ సాంస్కృతిక ఉద్యమం సాగాలి. హిందూత్వ శక్తులతో జతకట్టిన కార్పొరేట్ శక్తుల మీద ప్రత్యక్షంగా ఉద్యమించాలి. వారి దగ్గర పోగు పడ్డ 'సంపద పున:పంపిణీ' నినాదం కావాలి. ఈ నినాదం చుట్టూ శ్రమజీవులను , రైతులను , నిరుద్యోగ యువతను సంఘటితం చెయ్యాలి.

ఒక నినాదాన్ని ప్రజా ఉద్యమం చేయడానికి తగిన పద్ధతిని అనుసరించాలి. 1 నినాదం అందరినీ సులభంగా ఆకర్షించేదిగా వుండాలి. ఉదా : 'శ్రమజీవులకు సంపద పునః పంపిణీ'. 2.ఈ నినాదం సాధ్యమేనని నమ్మకం కలగాలి. 10 శాతంగా వున్న కార్పొరేట్లు, కుబేరుల మీద తగిన విధంగా సంపద పన్ను–వారసత్వ పన్ను – ఆదాయ పన్ను వగైరాలతో ఎలా సాధ్యం అవుతుందో చెప్పాలి. 3.ఇలా సేకరించిన 'ప్రత్యేక సంక్షేమ నిధి' ఎలా శ్రమజీవులకు పంపిణీ జరుగుతుందో తెలియ చెప్పాలి. ఈ మూడూ జత కలిసినప్పుడు ఒక నినాదం జనాకర్షణ గల ప్రజా ఉద్యమ రూపం ధరిస్తుంది. సంపద పున: పంపిణీ ద్వారా పేదలకు, రైతులకు, యువతకు ఆత్మ గౌరవంతో తలెత్తుకు తిరిగే స్వతంత్ర జీవనం అనే కొత్త ఆకాంక్ష వారిని రాజకీయ ఉద్యమం దారి పట్టిస్తుంది. హిందూత్వ–కార్పొరేట్ శక్తుల పాలనను ఓడిస్తుంది. అన్ని వామపక్ష శక్తులు, విపక్ష తరగతుల సంస్థలు సరికొత్త నినాదాలతో తగిన కార్యాచరణకు పూనుకుంటాయని ఆశిస్తున్నాం.

**– డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**


# ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా ?



- రాహుల్‌కుమార్

మూడున్నర దశాబ్దాల చరిత్రను ఒక్క మాటలో చెప్పుకోవటం కష్టం. కానీ ఆ ఒక్కమాట చుట్టూనే ఎన్నో వివాదాలూ విమర్శలు విరామం లేకుండా చెలరేగుతూనే ఉన్నాయి. అందరూ వింటున్న పదమే అది. తేలికగా అర్థమైనట్లు అనిపిస్తుంది. అందరి అనుభవంలోనూ ఉన్నట్లూ కన్పిస్తుంది. కానీ హాస్యం వెనకాల లోతైన గాంభీర్యం దాక్కొన్నట్లుగా ఆ పదం సూచించే పరిణామం ఆషామాషీ అయినది కాదు. గ్లోబలైజేషన్‌గా మనందరమూ పిలిచే ఆ పదం 1990ల నుంచి విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చినా, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రపంచ పరిణామాలన్నీ దాని కేంద్రంగానే జరుగుతూనే ఉన్నా.. ఆ పదం విస్తృతార్థంలోకి వెళ్లగలిగితే వెనుకటి యుగాలు కనపడతాయి. 1990ల్లో బలం పుంజుకుని 2000 నుంచి రాటు తేలిన గ్లోబలైజేషన్‌తో మనకు తెలిసేది ఒక యుగం చరిత్రే. ప్రపంచం చూసిన అనేక గ్లోబలైజేషన్లలో అది ఒకటి మాత్రమే.

మన అనుభవంలోని గ్లోబలైజేషన్ ఎంతో ప్రగాఢమైంది. కాదనలేం. అన్ని సంస్కృతులనూ అది రోడ్డు రోలర్‌లాగా సమం చేసేస్తోంది. అలవాట్లలో, ఆకాంక్షల్లో, కట్టూ బొట్టులో, వేషభాషల్లో, విశ్వసించే విలువల్లో ఏకత దిశగా మనుషులను పరుగులు పెట్టిస్తోంది. సొంత సంస్కృతులను కోల్పోతున్న వారిలో ఒక పట్టాన అర్థం కాని అశాంతికీ, అభద్రతకూ కారణమూ అవుతోంది. ఒక మార్పునకు అనుగుణంగా మనుషులు కుదురుకునే లోపలే మరో మార్పును గ్లోబలైజేషన్ వారి నెత్తి మీదకు తీసుకువస్తోంది. ఇవ్వాళ్టి ఉద్యోగం రేపు ఉంటుందో ఊడుతుందో తెలియదు. ఈ ఏడాది టెక్నాలజీ వచ్చే ఏడు బతికి బట్టకట్టగలదా ? లేదా ? అన్నది ఎవరూ చెప్పలేరు. వ్యక్తులూ, కంపెనీలతోపాటు దేశాలూ ఎగుడు దిగుడులకు గురవుతున్నాయి. అందుకే డీగ్లోబలైజేషన్ కావాలంటూ దాన్ని వ్యతిరేకించే ధోరణులూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య వాణిజ్యానికి అడ్డుగోడలు కట్టాలనే వాదనలూ ఎక్కువ అవుతున్నాయి. మనుషుల రాకపోకలపై కట్టడులూ మొదలవుతున్నాయి. ఇప్పటి గ్లోబలైజేషన్ అర్థం కావాలంటే దీనికంటే ముందు మనుషులను ప్రభావితం చేసిన ఆరు గ్లోబలైజేషన్ల వ్యవహారాలను తెలుసుకోవాలి. మొత్తంగా సప్త ప్రపంచీకరణల మంచి చెడులను స్థూలంగా అర్థం చేసుకుంటేనే భవిష్యత్తు రూపురేఖలు బోధపడతాయి. వర్తమానంలో ఏ అడుగులు వేయాలో తెలుసుకోగలం. కొందరు గాఢంగా కోరుకుంటున్నట్లుగా ప్రపంచీకరణ రథచక్రాన్ని వెనక్కి మళ్లించటం సాధ్యమో, అసాధ్యమో తేలిపోతుంది.




భౌగోళికంగా విడివిడిగా ఉన్న సమాజాల మధ్య వస్తువులూ, భావాలూ, సాంకేతిక పరిజ్ఞానాల మార్పిడులూ, మనుషుల రాకపోకలూ చరిత్ర పొడవునా ఏదో ఒక స్థాయిలో జరుగుతూనే ఉన్నాయి. అందుకే వస్తు, భావాల మార్పిడితో, మనుషుల రాకపోకలతో జన సమూహాల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడటమే గ్లోబలైజేషన్ అని స్థూలంగా చెప్పుకోవచ్చు. అయితే అది అన్ని సందర్భాల్లోనూ ప్రశాంతంగా జరగలేదు. ఇచ్చిపుచ్చుకునే రీతిలో మొదలవ్వలేదు. యుద్ధాలు, ఆధిపత్యాలు, అణచివేతలు, కిరాతకాలతో గ్లోబలైజేషన్లు ముడిపడిపోయాయి. రక్తాలూ, కన్నీళ్లతోనే దాని చరిత్ర తడిసింది. సుదీర్ఘ దృష్టితో చూస్తే మానవ సమాజాలన్నీ కాలక్రమంలో ప్రగతి మెట్లు ఎక్కినట్లు కనపడతాయి. కానీ ప్రతి ప్రగతి మెట్టు కిందా కొందరు నలిగి పోయారు. విజేతలూ, పరాజితులూ లేకుండా గ్లోబలైజేషన్ లేదు. సప్త ప్రపంచీకరణల్లో ఈ రెండు సమూహాలూ ఉన్నాయి. వేల సంవత్సరాల చరిత్రలో ప్రపంచీకరణలు అనదగిన పరిణామాలను విడివిడిగా వివరించే రచనలు బోలెడు ఉన్నాయి. వాటికి భిన్నంగా ప్రపంచీకరణను ఏడు యుగాలుగా (ద ఏజెస్ ఆఫ్ గ్లోబలైజేషన్) వర్గీకరించి బాగా ప్రాచుర్యం లోకి తీసుకువచ్చింది ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త జఫరీ డి.శాక్స్ అనే చెప్పుకోవాలి.

ఏడు గ్లోబలైజేషన్లలో మొదటిది పాతరాతి యుగం, రెండోది కొత్తరాతి యుగం.. మూడోది గుర్రాల యుగం. నాలుగోది సంప్రదాయ(క్లాసికల్) యుగం. అయిదోది సముద్రాన్వేషణ యుగం. ఆరోది

పారిశ్రామిక యుగం. ఏడోది డిజిటల్ యుగం.

పాత రాతి యుగంలో మానవ సమూహాలు ఆహార అన్వేషణ కోసం ఒకచోట నుంచి ఇంకోచోటికి వెళ్లటం చాలా సాధారణం. ఆ క్రమంలోనే కొత్త వాతావరణ పరిస్థితులనూ, కొత్త జంతు ప్రపంచాన్నీ, కొత్త సూక్ష్మ క్రిములనూ, కొత్త వైరస్‌ల లోకాన్నీ ఎదుర్కొన్నారు. వాటి ప్రభావానికీ గురయ్యారు. వారికి తారసపడ్డ నియాండర్తల్, డెనిసోవన్స్ లాంటి పురాతన మానవ జాతులు కొన్ని అంతరించిపోయాయి. కొత్త వారితో యుద్ధాలూ, కొట్లాటలూ జరిగాయి. బతికిబట్టకట్టిన వారితో క్రమేపీ సాంస్కృతిక, శారీరక సంపర్కాలూ జరిగాయి. క్రీస్తు పూర్వం 70 వేల సంవత్సరాల నుంచి 10,000 సంవత్సరాల వరకూ అంటే 60 వేల ఏళ్లు మనుషులు రాతి ఆయుధాలతో కొత్త ప్రాంతాలకు సంచరిస్తూనే ఉన్నారు. అప్పుడే ఒక విచిత్రం జరిగింది. మానవ ప్రమేయం లేకుండానే జరిగిన ఒక పరిణామం రెండో గ్లోబలైజేషన్‌కు కారణమైంది. క్రీస్తు పూర్వం 10,000 ఏళ్ల నాటికి మంచుయుగం ముగిసింది. వాతావరణం వేడెక్కింది. వ్యవసాయానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. జంతువులను మచ్చిక చేసుకోవటం మొదలైంది. ఆహార అన్వేషణ పోయి ఆహార ఉత్పత్తి మొదలైంది. స్థిర నివాసం కోసం గ్రామాలు ఏర్పడ్డాయి. శ్రమ విభజన సర్వ సామాన్యమైంది. దీన్నే కొత్తరాతి యుగంగా పిలిచారు. ఇది ఏడు వేల ఏళ్లు (క్రీస్తుపూర్వం 10,000 నుంచి 3,000 వరకూ) కొనసాగింది. సుదూర ప్రాంతాలతో వ్యాపారాలు మొదలయ్యాయి. గ్రామాల మధ్య వస్తు మార్పిడులూ సాధారణమయ్యాయి. వ్యవసాయ గ్రామాలు విస్తరిస్తున్న కొద్దీ ఆదిమ తెగలతో యుద్ధాలూ మొదలయ్యాయి. మార్పును అంగీకరించకుండా పాత జీవితాన్ని అంటిపెట్టుకున్న తెగలు ఆ యుద్ధాల్లో అంతరించటమో, దూర ప్రాంతాలకు తరలి వెళ్లటమో జరిగింది. కొత్త జీవితాన్ని అంగీకరించిన తెగలు వ్యవసాయాన్ని నేర్చుకుని గ్రామాల్లో కుదురుకున్నాయి.

రాగి, కాంస్యం వంటి లోహాల వాడకంతో సమాజం కొత్త మలుపు తిరిగిందని మనందరమూ భావిస్తాం. కానీ వాటి కంటే గుర్రాలను మచ్చిక చేసుకోవటంతోనే ప్రపంచీకరణ మూడో యుగం మొదలైందని శాక్స్ కొత్త ప్రతిపాదన చేశారు. ఆ అశ్వయుగం క్రీస్తు పూర్వం 3000–1000 వరకూ అంటే రెండు వేల ఏళ్లు కొనసాగింది. దీని అర్థం తదనంతర కాలంలో గుర్రాల పాత్ర తగ్గిందని కాదు. వేరే ఇతర పరిణామాలకు ప్రాధాన్యం లభించింది. అశ్వయుగంతో రథాలు వాడుకలోకి వచ్చాయి. గుర్రాలపై సవారీ మొదలైంది. సుదూర ప్రాంతాల మధ్య సమాచార సౌకర్యాలు మెరుగుపడ్డాయి. నేలను దున్నటంలో గుర్రాలు కీలక పాత్రను పోషించాయి. ఇక గుర్రాల ప్రవేశంతో యుద్ధరీతులే మారిపోయాయి. తెగల పెద్దల పెద్దరికం స్థానంలో రాజులు వచ్చి రాజ్యాలు ఏర్పడటంలో గుర్రాలు కీలకపాత్రను పోషించాయి. మంచి గుర్రాలు అందుబాటులో ఉన్న రాజ్యాలు ఇతర ప్రాంతాల మీద ఆధిపత్యాన్ని సంపాదించాయి. గుర్రాలతోనే గ్రామాలపై ప్రభుత్వాలు అదుపు ఆజ్ఞలను సాధించగలిగాయి.

క్రీస్తుపూర్వం 1000 ఏళ్ల నుంచి క్రీస్తు శకం 1500 దాకా కొనసాగిన సంప్రదాయ యుగంలో రాజ్యాలూ సామ్రాజ్యాలూ విజృంభించాయి. ఇప్పుడు ప్రపంచంలో ప్రబలంగా ఉన్న మతాలన్నీ ఈ యుగంలో పుట్టి, బలపడి, విస్తరించినవే. తత్వ శాస్త్రాలు, రాజకీయ సిద్ధాంతాలు అప్పుడే తలెత్తాయి. రాజరికాలు నిలదొక్కుకునేందుకు అవి ఎంతగానో తోడ్పడ్డాయి. రాజులు దైవాంశసంభూతులనే భావాలకు ప్రాచుర్యం అలాగే వచ్చింది. సామ్రాజ్యాలతో విడివిడి సమాజాల మధ్య సంబంధాలు బలపడి సంస్కృతులు విపరీతంగా ప్రభావితం అయ్యాయి. మధ్య ప్రాచ్యంలో పుట్టిన క్రైస్తవం యూరప్ అంతటా విస్తరించటమూ అందులో భాగమే. ఇస్లాం ఆసియా, ఆఫ్రికాలకు శరవేగంగా పాకింది. బౌద్ధం భారత్‌ను దాటి తూర్పు, ఆగ్నేయాసియాలను విపరీతంగా ప్రభావితం చేసింది. సముద్రయాన యుగంలో (1500–1800) యూరప్ దేశాలు అమెరికా ఖండాన్ని కనుగొనటమే కాదు ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధిపత్యాన్ని సాధించాయి. బానిసలుగా లక్షలాది ఆఫ్రికన్లను అమెరికాకు తరలించారు. ఖండాతర యుద్ధాలు మొదలయ్యాయి. యూరోపియన్లు అంటించిన జబ్బులతో, చేసిన యుద్ధాలతో అమెరికా ఖండంలో స్థానిక జాతులన్నీ అంతర్థానమైపోయాయి. బలవంతపు వ్యాపార లావాదేవీలు అన్నిచోట్లా మొదలయ్యాయి. చైనా, భారత్ వంటి సుదీర్ఘ నాగరికత గల దేశాల ప్రాబల్యం క్షీణించింది. తుపాకీ, మర ఫిరంగులు, శతఘ్నుల ధాటికి ఆసియా, ఆఫ్రికాలు కకావికలం అయ్యాయి. పారిశ్రామిక యుగంతో(1800–2000) ప్రపంచమే కుగ్రామంగా మారిపోయింది. బొగ్గు వినియోగంతో మొదలైన పారిశ్రామిక విప్లవం ఆవిరి యంత్రంతో వడివడిగా అడుగులు వేసి.. మోటారు వాహనాలు, కరెంటు, రైళ్లు, విమానాలు, టెలిఫోన్లు, అత్యాధునిక యుద్ధ ఆయుధాల వినియోగంతో ప్రపంచ చిత్రాన్నే మార్చి వేసింది. రెండు వందల ఏళ్ల చరిత్రలో రెండు దేశాలకు (బ్రిటన్, అమెరికా) అది ప్రపంచ ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు తలెత్తాయి. వలస పాలనలు అంతమయ్యాయి. ఆ రెండు వందల ఏళ్లలోనే ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగింది. దేశాల మధ్య అసమానతలు గతంలో ఎన్నడూ లేనంతగా తలెత్తాయి. పర్యావరణ విధ్వంసమూ పతాకస్థాయికి చేరింది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఉన్నది డిజటల్ యుగం. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, మొబైల్స్, కృత్రిమమేధతో దేశాల మధ్యా, దేశాల **(మిగతా 15వ పేజీలో)**

# రక్తపాతం లేకుండా రాజకీయ నరమేధమే ఓటర్ల తొలగింపు !

**పౌర చైతన్య వేదిక రాష్ట్ర సదస్సులో డాక్టర్ పరకాల ప్రభాకర్**

- రాఘవ



"ఓటర్ల జాబితా నుంచి పౌరులను తొలగించడమంటే వారిని చంపేయడమే! ఇది రక్తపాతం లేకుండా చేసే రాజకీయ నరమేధమే ! ప్రజాస్వామ్యాన్ని ఒక్కసారిగా నరికి వేయడమే! నెమ్మదిగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీసేయడమే కదా!" అని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వచ్చిన ముప్పుకు వ్యతిరేకంగా పోరాడకపోతే, భవిష్యత్తులో మనం పోరాడడానికి ఏమీ ఉండదు. ఇవాళ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పొచ్చింది. రెండు చేతులతో వాటిని కాపాడకపోతే మనకు భవిష్యత్తు లేదు" అని ఆయన హెచ్చరించారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతిలోని టౌన్ క్లబ్ హాల్‌లో పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ అధ్యక్షత జరిగిన పౌరచైతన్య వేదిక ప్రథమ రాష్ట్ర సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. సదస్సులో పరకాల ప్రభాకర్ ప్రసంగం వారి మాటల్లోనే.

"స్వాతంత్ర్య పోరాటం సుదీర్ఘ కాలం సాగింది. కొంత మంది సత్యాగ్రహ మార్గాన్ని ఎంచుకుంటే, మరికొంత మంది సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఇసుమంత పాత్ర లేని వారు దేశ భక్తులుగా చెలామణి అవుతున్నారు. దాన్ని మార్కెటింగ్ చేసుకుంటున్నారు. దీన్ని చాలా మంది నమ్ముతున్నారు. ఇంతకంటే విడ్డూరం ఏముంటుంది? రెండేళ్లుగా మణిపూర్ మండుతోంది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గుడారాల్లో తలదాచుకుంటున్నారు. గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి ! మనమేమైనా పట్టించుకుంటున్నామా? సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైన చెప్పు విసిరారు. మనకు 150 కోట్ల జనాభా ఉంది. ఈ జనాభాలో రిటైర్డ్ జడ్జిలు, లాయర్లు, మేధావులు ఎంతో మంది ఉన్నారు. మనలో ఒక్కరైనా రోడ్డెక్కారా!? సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైన చెప్పు విసిరితే హోం మంత్రికి కానీ, న్యాయ శాఖ మంత్రికి కానీ అసలు పట్టిందా? డాలరు ధర బ్యాంకుల్లో 90 రూపాయలైంది. పెట్రోల్ ధర, గ్యాస్ ధర పెరిగింది. ఎంత పెంచినా కిక్కురుమనకుండా వాడేస్తున్నాం. ఎవరైనా అడిగారా? ఇన్ని సమస్యలుంటే, వీటిపైన మాట్లాడకుండా వందేమాతరంపై మన పార్లమెంటులో పది గంటలు చర్చించారు. ఆశ్చర్యపోయాను. ఇవ్వన్నీ మానవ హక్కులకు సంబంధించిన రాజకీయాలు కావా?

ఐక్యరాజ్య సమితి వెలువరించిన మానవ హక్కుల ప్రకటనలో 'ఆల్ మెన్ ఆర్ ఈక్వల్' అని ఉంది. "ఆల్ మెన్ ఆర్ ఈక్వల్ కాదు, ఆల్ హ్యూమన్ బీయింగ్స్ ఆర్ ఈక్వల్" అని భారతదేశానికి చెందిన మహిళ హన్స్ జీవరాజ్ మెహతా ఐక్యరాజ్యసమితిలో నిలదీస్తే, అప్పుడు మాత్రమే 'ఆల్ హ్యూమన్ బీయింగ్స్ ఆర్ ఈక్వల్' అని మార్చారు. ఇదొక విప్లవాత్మక చర్య. ఒక భారతీయ మహిళ ఈ విషయం ప్రతిపాదించింది కదా! మహిళా దినోత్సవం నాడైనా ఎవరైనా ఆమెను గుర్తు చేసుకుంటున్నామా!? మణిపూర్‌ను కానీ, డాలర్ విలువను కానీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైన చెప్పు విసరడాన్ని కానీ ఎవరైనా గుర్తు చేసుకుంటున్నామా!?

ప్రభుత్వ ఓటర్లుగా ఎవరుండాలి? ఎవరుండకూడదు? వీటినిప్పుడు నిర్ణయించేదాని పేరు ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్). ఓటర్లను ఎస్ఐఆర్ ఎట్లా గుర్తుపట్టాలి ? బట్టలను బట్టి గుర్తుపట్టాలి. మస్తానమ్మ చీర కట్టుకుంది కాబట్టి ఆమె ఓటరుగా ఉంచుదామా? ఆమె పేరును బట్టి ఆమెను ఓటరుగా తీసెయ్. పోనీ శ్రీధర్ గారిని ఓటరుగా గర్తు ఉంచుదామా ? ఆయన హక్కుల గురించి మాట్లాడతారు కనుక ఆయన్ని తీసెయ్. పోనీ రాఘవశర్మ పేరు మనకు చాలా బాగుంది.






ఓటరుగా ఉంచుదామంటే, ఆయన వరవరరావు లాంటి వాళ్ళను ఇంటర్వ్యూ చేస్తారు. అబ్బే అస్సలు కుదరదు. తీసెయ్. ఇలా ఉందండి ఎస్ఐఆర్ వ్యవహారం. అసలు ఎవరు పౌరులో ఎవరు పౌరులు కాదో తేల్చే హక్కు ఎన్నికల కమిషన్‌కు ఎవరిచ్చారు?

మనకు ఓటు వేస్తారు పరవాలేదు అనుకున్న వారినందరినీ ఉంచేసి, ఓటు వేయని కొందరిని తీసేస్తే, ప్రతిపక్షానికి కూడా కొన్ని ఓట్లు పడ్డాయి. అంటే బీజేపీ, ఎన్‌డీఏకి నూకలు చెల్లిపోతున్నట్టే కదా! మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఎలా వంచిస్తున్నారో, రాజ్యాంగాన్ని ఎలా వంచిస్తున్నారో చెప్పుకోవాలి.

మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎవరు పౌరులు, ఎవరు పౌరులు కాదు అన్న చర్చ జరిగింది. చాలా దేశాల్లో తోలును బట్టి, భాషను బట్టి, మతాన్ని బట్టి, నైసర్గికతను బట్టి పౌరసత్వం లభిస్తుంది. ఇవి కానటువంటి వాళ్ళు ఏమైపోవాలి ? గెటౌట్ ! లేదా వెంటనే చంపేయాలి ! కొన్ని దేశాల్లో వారిని గెంటివేశారు, వారిని చంపేశారు. కానీ అందుకు భిన్నంగా ఈ దేశంలో ఉన్న వారంతా ఈ దేశ పౌరులే అని తొలిసారిగా నిర్ణయించిన దేశం భారతదేశం. చర్మపు రంగు, మతం, సంస్కృతి, భాషలనే తేడా లేకుండా అందరినీ అంటిపెట్టుకున్నది భారతదేశం. 'అందరిదీ ఒక దారైతే ఉలిపి కట్టెది ఒక దారి' అనే నానుడి ఉంది కదా. అసలు ఉలిపి కట్టె అంటే ఏమిటి? ఈ దేశం హిందువులది అనే వాళ్లే ఆ ఉలిపి కట్టెలు. 'ఈ దేశంలో అందరూ ఉండాలి. ఈ దేశంలో ఉండే వారందరూ ఈ దేశ పౌరులే. అందరూ ఈ దేశంలో భాగస్వాములే' అన్న మన నాయకులు, మన రాజ్యాంగం ఉత్కృష్టమైంది. చదువు ఉన్నా, లేకున్నా, ఆస్తి ఉన్నా లేకున్నా, ఏ మతమైనా, ఏ కులమైనా ప్రతి మనిషికీ ఓటు ఉంటుందని చెప్పారు. అది సూత్రం. ఎవరికీ ఓటు హక్కు తీసేయలేదు. ఎప్పుడూ ఓటరు నమోదుకు అప్లికేషన్ ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పేర్లను నమోదు చేసి, 'హౌ టు బ్రింగ్ ది పీపుల్' అన్నారే కానీ 'హౌటు ఎలిమినేట్ పీపుల్' అనలేదు. చనిపోయిన వారిని తీసేయడానికి అభ్యంతరం లేదు. ఎస్ఐఆర్ తరువాత ఎన్నికల కమిషన్ తయారు చేసిన జాబితా ఎలా ఉందంటే, ఒక ఇంట్లో 500 మంది ఓటర్లున్నారు. చాలామంది పౌరులను ఓటర్లుగా తీసేశారు. అంటే పౌరులను చంపేయడమే కదా! అంటే రక్తపాతం లేకుండా చేసే రాజకీయ నరమేధమే కదా ఇది! ప్రజాస్వామ్యాన్ని ఒక్కసారిగా నరికి వేయడమే కదా! నెమ్మది నెమ్మదిగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీసేయడమే కదా! చాలా మంది తమకేమీ పట్టనట్టు గిరిగీసుకుని కూర్చున్నారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వచ్చిన ముప్పుకు వ్యతిరేకంగా పోరాడకపోతే, భవిష్యత్తులో మనం పోరాడడానికి ఏమీ ఉండదు. ఇవాళ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పొచ్చింది. రెండు చేతులతో వాటిని కాపాడకపోతే మనకు భవిష్యత్తు ఉండదు. ఇలా మాట్లాడే అవకాశం ఎప్పటికీ ఇలాగే ఉంటుందన్న నమ్మకం నాకు లేదు. నేను ఏ క్షణమైనా లోపలికి (జైల్లోకి) వెళ్లిపోవచ్చు. ఈ సభకు వచ్చినందుకు మీలో కూడా చాలా మంది లోపలికి వెళ్లిపోవచ్చు. దేశంలో జరుగుతున్న రాజకీయాలను మనం వినోదంగా చూడడం కాదు. కార్యరంగం లోకి దిగాలి. ఎన్నికలు నిష్పక్షపాతంగా ఉండాలి. బీజేపీకి మహిళా మోర్చా, యువ మోర్చా, మైనారిటీ మోర్చా, విద్యార్థి మోర్చాలాగానే దానికి ఎన్నికల మోర్చా ఉంది. ఇది వరకు ఓటు హక్కు ఎలా ఉందో, అలా ఉంటేనే ఎన్నికలకు వెళతామని పౌరులంతా అడగాలి. ఉదాశీనత వదిలేయండి. స్పెక్టేటర్‌గా గేమ్ చూడడం ఆపేయండి" అంటూ ముగించారు.

పౌరసత్వానికి, ఎలక్షన్ కమిషన్‌కు సంబంధం ఏమిటి? ప్రొఫెసర్ కుంచె శ్రీధర్ చొరబాటుదారులను ఏరి వేయడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఏర్పాటు చేశామని చెపుతున్న ఎలక్షన్ కమిషన్‌కు ఎవరు పౌరులో, ఎవరు పౌరులు కాదో తేల్చే బాధ్యత దానిక ఎవరిచ్చారు ? అని 'సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమాక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం (సీపీడీఆర్ ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఈ సదస్సులో ప్రసంగిస్తూ ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్ తప్పులపైన తప్పులు చేస్తోందని బిహార్ ఎన్నికలకు ముందే సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. బిహార్ ఓటర్ల జాబితాలో 65 లక్షల మంది పేర్లను తొలగించారని, దీనిపై సుప్రీంకోర్టు ప్రశ్నిస్తే తీసేసిన జాబితాను 50 లక్షలకు కుదించా రన్నారు. యాభై లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తీసివేస్తే, ఎందుకు తీసేశారో కారణం చెప్పాలి కదా అని అడిగారు. చదువుకున్న వారే ఓటరు నమోదు ఫారం నింపలేకపోతుంటే, చదువుకోని వారు ఎలా నింపగలుగుతారని ప్రశ్నించారు.

బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటింటికీ వెళ్లి కొత్త వారిని ఓటర్లుగా చేర్చుకోవాలి, మరణించిన వారి పేర్లను తొలగించాలి. వలసదారులు వుంటే, పిర్యాదు చేస్తే, ఆ విషయం పోలీసులు చూసుకోవాలి కానీ, ఎలక్షన్ కమిషన్ కేం పని ? అని ప్రశ్నించారు. ముస్లింలను, మైనారిటీలను, దళితులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికే ఎస్ఐఆర్ ఏర్పాటు చేశారని వ్యాఖ్యానించారు. వలసదారులనే సాకుతో ఓటర్లను తొలగించి, ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నదని బీజేపీని విమర్శించారు. మానవ హక్కు అనేది అత్యవసరమైందని అన్నారు. ఎస్ఐఆర్ అంటే ఫాసిజానికి బాట వేసే వారని వ్యాఖ్యానించారు.

ఈ సదస్సులో పౌర చైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఆవిర్భావం గురించి వివరించారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఏర్పడిన ఐక్యరాజ్య సమితి 1948లో ప్రపంచ శాంతి కోసం, **(మిగతా 15వ పేజీలో)**

# నామినేటెడ్ గవర్నర్ల 'నిష్పాక్షికత'



- ఎం.ఎ. బేబీ

గవర్నర్లు అధికార జోక్యానికి పాల్పడతారనేది ముందుగా ఊహించలేకపోయారు. గవర్నర్ల పాత్ర మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, తదనంతరం ఆ తీర్పు మీద రాష్ట్రపతి సలహా కోరుతూ సుప్రీంకోర్టుకు నివేదించడం, దరిమిలా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన సలహా వంటి పరిణామాలన్నీ మరోసారి రాజ్యాంగ స్ఫూర్తి మీద చర్చకు దారితీశాయి. రాజ్యాంగ అసెంబ్లీ రాజ్యాంగ తుది ప్రతిని ఆమోదించే సందర్భంలో జరిగిన చర్చల స్ఫూర్తి అక్షర రూపంలో మన రాజ్యాంగంలో ప్రతిఫలించింది. మన రాజ్యాంగం 1949 నవంబరు 26న ఆమోదం పొందగా.. తాజాగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు అదే రోజున వెలువడడం యాదృచ్ఛికంగా జరిగిందని భావించాలి.

గవర్నర్ల పాత్ర మీద రాజ్యాంగ అసెంబ్లీలో నాణ్యమైన, విలువైన చర్చలు జరిగాయి. స్వతంత్ర భారతదేశంలో గవర్నర్లకు ఉండే అధికారాలు, వారు పోషించాల్సిన పాత్ర మీద అనేక ప్రశ్నలు తలెత్తాయి. ప్రతి సందర్భంలోనూ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ జోక్యం చేసుకుని.. రాజ్యాంగ డ్రాఫ్ట్ కమిటీ అనేక జాగ్రత్తలు తీసుకుని ఏ దృష్టితో గవర్నర్ల అధికారాలు, పాత్రను రూపొందించిందో వివరణలు ఇచ్చారు. తుది ముసాయిదాలో వాటికి చోటు కల్పించామని స్పష్టం చేశారు.

నామినేటెడ్ గవర్నర్ల నిష్పాక్షికత గురించి రాజ్యాంగసభ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా నామినేట్ అయ్యే గవర్నర్లు కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఈ వ్యవహారం అంతా 1935 నాటి చట్టం ద్వారా నియమించబడిన ప్రాదేశిక గవర్నర్ల వ్యవస్థకన్నా ఏ మాత్రం భిన్నంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ల వ్యవస్థ 'వైస్రాయి నామినీ'లకు నకలుగా మారకుండా చూడాలని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నరు పదవి చేపట్టేవారు సందేహాలు, అనుమానాలకు అతీతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.

### అచ్చమైన రాజ్యాంగ గవర్నర్

రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు 1947లోను 1949లో రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఉద్దేశించిన సదస్సులోను వెలిబుచ్చిన సందేహాలకు డాక్టర్ అంబేద్కర్ సమాధానం ఇస్తూ 'గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది తప్ప ఇందులో రాష్ట్రాలకు ఏ పాత్ర లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. కానీ గవర్నర్లు రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకే నడుచుకోవాలని నేను నిస్సందేహంగా చెప్పగలను. గవర్నరు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి మినహా మరొకటి కాదు' అని వివరించారు. 'రాజ్యాంగపరంగా నియమించబడే ఈ గవర్నర్లు అచ్చంగా రాజ్యాంగ నిర్వహణకు మాత్రమే పరిమితమని నేను నొక్కి చెప్పదలిచాను. వారు పార్లమెంటరీ వ్యవస్థ సజావుగా నడిచేలా చూడాలే తప్ప ఎన్నికయిన మంత్రి మండలికి శత్రువుల్లా వ్యవహరించకూడదు' అని స్పష్టం చేశారు.

రాజ్యాంగ అసెంబ్లీలో తీవ్రమైన చర్చ జరిగిన మరో అంశం గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాల గురించి. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు అనేకమంది ఈ అధికారాల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇది 1935 నాటి చట్టంకన్నా భిన్నంగా లేదని ఎత్తి చూపారు. మరోసారి డాక్టర్ అంబేద్కర్ ఈ సందేహాలను నివృత్తి చేశారు. గవర్నర్ల విచక్షణాధికారాల పేరిట తిరిగి 1935 నాటి భూతానికి ప్రాణం పోస్తున్నాం అన్న భావన పొరపాటు అవగాహన. ఆ నాటి చట్టం గవర్నర్లకు దేనినయినా తోసిపుచ్చే విశేషాధికారాలు కల్పించింది. కానీ మన రాజ్యాంగం అలాంటి అధికారాలు కల్పించలేదు' అని స్పష్టం చేశారు. కానీ సభ్యులు పదే పదే అవే అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో 'సభ్యులు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలకు మించి ఆలోచించ వద్ద'ని నిష్కర్షగా చెప్పారు అంబేద్కర్. 'గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు లేవు. గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాలూ పరిమితమయినవే' అని వివరించారు.

'పరిమిత విచక్షణ' అంటే ఎన్నికల అనంతరం మెజారిటీ శాసనసభాపక్షం నాయకుడిని ఎన్నుకుంటే ఆ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని కోరడం, నూతన ప్రభుత్వంతో ప్రమాణ స్వీకారం చేయించడం వంటి రాజ్యాంగంలో పొందుపరిచిన నిర్దిష్టమయిన విధులే తప్ప మరొకటి కాదు' అని కూడా అంబేద్కర్ పేర్కొన్నారు. అయితే ఇవాళ ప్రతిపక్ష రాజకీయ పార్టీల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ఏ స్థాయిలో అధికార జోక్యానికి పాల్పడుతున్నారో చూస్తే ఆనాడు డాక్టర్ అంబేద్కర్ ఇదంతా ఊహించి ఉండరని తేటతెల్లం అవుతున్నది.

### ప్రాసంగిక చర్చ

శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆమోదముద్ర వెయ్యకుండా సతాయిస్తున్న గవర్నర్ల అధికారాల గురించి మరోసారి చర్చ మొదలవ్వడం స్వాగతించాల్సిన అంశమే. ఇవాళ మరోసారి రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు 1935 నాటి చట్టాన్ని ఉదహరిస్తూ లేవనెత్తిన ప్రశ్నలు ప్రాసంగికమైనవే. 'ఎన్నికయిన శాసనవ్యవస్థ ఆమోదించిన బిల్లు నామినేట్ చెయ్యబడిన గవర్నరు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండకూడదు. ఇది చాలా ప్రమాదకరం. ఇది గవర్నర్‌కు పరోక్షంగా విచక్షణాధికారాలు కట్టబెట్టడమే' అని రైతు నాయకుడు యన్.జి.రంగా అభ్యంతరం లేవనెత్తారు. రోహిణి కుమార్‌చౌదరి గొంతు కలుపుతూ 'అయ్యా! రాష్ట్రపతి ఆమోదం కోసం ఒక బిల్లు పంపాలా వద్దా అని నిర్ణయించే అధికారం గవర్నరుకు దఖలు చెయ్యడం అంటే ఇది ఎన్నికయిన శాసన వ్యవస్థ మీద దాడిగా పరిగణించాలి. ఇది ఒకప్పటి వైస్రాయ్ నియమిత ఏజెంట్లుగా వ్యవహరించిన బ్రిటిష్ గవర్నర్ల వ్యవస్థ అవశేషం తప్ప వేరొకటి కాదు. గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు ఉండకూడదని మనం అనేకసార్లు చర్చించాం. మీరు గవర్నర్లకు ఆ అధికారాలు ఇస్తే వాళ్లు బ్రిటీష్ గవర్నర్ల వలె తయారవుతారు' అని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ అభ్యంతరాలను, భయసందేహాలను నివృత్తి చేస్తూ డాక్టర్ అంబేద్కర్ ఇలా చెప్పుకొచ్చారు. 'ఈ అధికార స్వభావం గురించి సభ్యులలో పొరబాటు అవగాహన నెలకొన్నదని తెలియ వస్తున్నది. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాల్సిన బిల్లులను రిజర్వ్ చేసి ఉంచేందుకు గవర్నర్లకు స్వయంగా విచక్షణాధికారాలు వున్నట్లు కాదు. గవర్నర్‌కు అలా తోసిపుచ్చే సర్వసాధారణ అధికారం ఉన్నదని భావించడం శుద్ధ పొరపాటు. గవర్నర్‌కు అలాంటి అధికారాలు లేవు. ఏదైనా బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘించేదిగా ఉన్నా లేక కేంద్రం అధికారానికి ప్రమాదకరంగా పరిణమించేలా ఉంటే తప్ప గవర్నర్‌కు బిల్లులను రిజర్వ్ చేసే అధికారం లేదు' అని స్పష్టం చేశారు.

అంతే కాదు, 'శాసనసభ ఆమోదించిన బిల్లు మీద గవర్నరు తీర్పరిగా వ్యవహరించడానికి ఆ కుర్చీలో కూర్చోలేదని రాజ్యాంగ అసెంబ్లీకి నేను స్పష్టంగా అభయమిస్తున్నా. గవర్నర్ల విధులు అతి సాధారణమైనవి. మన రాజ్యాంగం ఏం చెబుతుంది ? మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవాలనే కదా. కాబట్టి ఆయన మంత్రివర్గ సలహాను పాటించాలి. అలాగే గవర్నరు తన విచక్షణాధికారాన్ని ఏయే సందర్భాలలో వినియోగించవచ్చో రాజ్యాంగంలో పేర్కొన్నాం. కాబట్టి విచక్షణాధికారాల వినియోగం ఆ సందర్భాలకే పరిమితమై ఉంటుంది. రాజ్యాంగాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అన్వయించుకోవాలి. రాజ్యాంగంలో నిర్దిష్టంగా పేర్కొంటే తప్ప (గవర్నర్‌కు) ఎలాంటి విచక్షణాధికారానికి తావు లేదు' అని విశదీకరించి మరీ చెప్పారు. 'గవర్నర్ ప్రత్యర్థి అధికార కేంద్రంగా వ్యవహరిస్తారని ఆందోళన చెందడానికి అర్థమే లేదు' అని మరింత స్పష్టంగా పేర్కొన్నారు.

డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో రాజ్యాంగ పరిధిలో గవర్నర్‌కు ఎలాంటి ప్రత్యేక అధికారాలూ ఉండవు. అది అత్యయిక పరిస్థితి అయినా సరే గవర్నర్ మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవాలి. గవర్నర్లకు ఉండే పరిమిత పాత్ర పట్ల డాక్టర్ అంబేద్కర్‌కు గట్టి విశ్వాసం ఉన్నది. 'గవర్నర్‌కు ఉండే అధికారాలు చాలా పరిమితం, అతి స్వల్పం. గవర్నర్ పదవి అలంకార ప్రాయం. గవర్నర్ ఎంపిక కోసం ముందుకు వచ్చేవాళ్ళు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారు' అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ల అధికారాలు, రాష్ట్ర పరిపాలనలో వారి ప్రాత్ర గురించి రాజ్యాంగ నిర్ణేతల అవగాహన అంత స్పష్టంగా ఉన్నది. దేశ వాస్తవిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి వారిది. కొద్దిమంది స్వార్థపూరిత పక్షపాత ధోరణులుగల వ్యక్తులు రాజ్యాంగపరమైన అత్యున్నత స్థానాన్ని అధిరోహిస్తారని బహుశా వాళ్ళే ఊహించి కూడా వుండరు. డాక్టర్ అంబేద్కర్ ఆశావహ దృక్పథం దారి తప్పిందని రుజువు చెయ్యడానికి కృతనిశ్చయంతో వున్నట్లున్నారు ఇవాళ గద్దెనెక్కిన కొందరు గవర్నర్లు. మన దేశ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా నాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ్ మన రాజ్యాంగం విఫలమైందా లేక మనమే రాజ్యాంగాన్ని విఫలం చేశమా' అంటూ లేవనెత్తిన ప్రశ్నను గుర్తుకు తెచ్చుకోవడం సమయోచితం అని నేను భావిస్తున్నాను.

**తప్పిదాలను సరిదిద్దాలి**

ప్రస్తుతం గవర్నర్ల పాత్ర మీద జరుగుతున్న చర్చలో మనం గుర్తించాల్సిన అంశం ఏమిటంటే ఇప్పుడు కొద్దిమంది వ్యక్తులు రాజ్యాంగాన్ని విఫలం చేస్తున్నారు అని. గవర్నర్లు తమ నిర్ణయాన్ని 'సాధ్యమైనంత త్వరగా' వెలువరించాలి అని రాజ్యాంగంలో పొందుపరచిన పదాన్ని సరిగ్గా అపసవ్య దిశలో వినియోగిస్తున్నారు. నిర్ణయాలను సాధ్యమైనంత ఆలస్యం చేస్తున్నారు. అందుకే న్యాయస్థానాల జోక్యం అవసరమైంది. రాజ్యాంగ స్ఫూర్తిని సక్రమంగా అన్వయించి ఆ పదాలకు ఉన్న భావార్థాన్ని అర్థవంతంగా నిర్ణయించి చెప్పాల్సి ఉన్నది. అయితే దురదృష్టవశాత్తు న్యాయస్థానాలు కూడా డాక్టర్ అంబేద్కర్ పరిశీలనలను పరిగణలోనికి తీసుకున్నట్లు కనిపించడం లేదు. 'నూతన రాజ్యాంగం మూలంగా ఏమన్నా పొరబాట్లు జరిగితే అవి మానవీయ తప్పిదాలే' అని డాక్టర్ అంబేద్కర్ స్పష్టంగా ప్రకటించారు. ఈ తప్పిదాలను సరిదిద్దకపోతే న్యాయస్థానాలు రాజ్యాంగపరమైన విధులు సక్రమంగా నిర్వహించడంలో విఫలమైనట్లే. ❑ **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# ఎన్నికల సంఘం 'నో' అనగలదా ?



- ఎస్.వై.ఖురేషి

**భా**రత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. అంతకు రెండు నెలల ముందు 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఈ రాజ్యాంగానికి ఆమోదం లభించింది. అయితే, పూర్తి రాజ్యాంగం అమల్లోకి వచ్చే వరకూ వేచి ఉండకుండా అదే రోజున అందులోని 324 నుంచి 329 వరకు ఉన్న అధికరణాలను అమల్లోకి తెచ్చారు. అవే భారత ఎన్నికల సంఘానికి ప్రాణం పోశాయి. ఈ అధికరణాలను ముందే అమల్లోకి తేవడం వెనుక సాంకేతికపరమైన అంశాలేమీ లేవు. ఇది లోతుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక, దాని అధికార పరిధికి లోబడి ఒక ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడి తీరాలి. రాజ్యాంగ నిర్మాతలకు ఈ విషయం తెలుసు. అందుకే గణతంత్రం పుట్టకముందే భారత ఎన్నికల సంఘాన్ని మనుగడలోకి తెచ్చారు. ఫలితంగా, కార్య నిర్వాహక వ్యవస్థ ద్వారా కాకుండా, రాజ్యాంగపరంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ నిర్ణేత (ఎన్నికల సంఘం) పర్యవేక్షణలో తొలి ప్రభుత్వం చట్టబద్ధత పొందుతుంది.

## ఎందుకు సర్వ స్వతంత్రం?

అంతే ముఖ్యమైన మరో అంశం నాడు రాజ్యాంగ నిర్మాతల ముందు నిలిచింది. సమాఖ్య వ్యవస్థలో, ప్రతి రాష్ట్రం తన సొంత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించుకోవలసి ఉంటుంది. వాటికి ఆ అధికారం ఇవ్వడం సహజమే కదా అనిపిస్తుంది! చాలా సమాఖ్య దేశాల్లో అలా జరిగింది కూడా! అయితే, రాజ్యాంగ నిర్మాతలు ఆ నమూనాను తిరస్కరించారు. అందుకు కారణం ఉంది. రాష్ట్రాలు తమ ఎన్నికలను తిమ్మిని బమ్మిని చేయగలవని వారు భయపడ్డారు. పనుల కోసం, చదువుల కోసం, లేదా రాజకీయ కార్యకలాపాల కోసం వలస పోయే 'వెలుపలి వారి'ని ఓటర్ల జాబితాల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు తొలగిస్తాయనీ, తద్వారా ఎన్నికలను ప్రభావితం చేస్తాయనీ సందేహించారు. రాష్ట్రాలు నడిపే ఈ వ్యవస్థ ప్రాదేశికవాదానికి పని ముట్టుగా మారుతుందని రాజ్యాంగ సభలోని పలువురు సభ్యులు హెచ్చరించారు. కాబట్టి, ప్రతి భారతీయుడికీ తాను ఎక్కడ నివసించినా సరే సమానత్వం ప్రాతిపదికగా వివక్ష లేకుండా ఓటర్ల జాబితాలో స్థానం లభిస్తుందన్న గ్యారంటీ ఇచ్చేందుకు ఒక ఏకైక సర్వ స్వతంత్ర జాతీయ అధికారిక వ్యవస్థ అవసరమైంది.




ఓటర్ల జాబితాలు, పార్లమెంటు, శాసనసభల ఎన్నికలు, అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవుల ఎన్నికలపై ఆర్టికల్ 324 కింద భారత ఎన్నికల సంఘానికి 'పర్యవేక్షణ, మార్గనిర్దేశం, నియంత్రణ' అధికారాలు దఖలు పడ్డాయి. పౌరులందరికీ ఒకే విధమైన ఓటర్ల జాబితా, వివక్ష రహితమైన సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఉండేలా 325, 326 అధికరణాలు పూచీ పడుతున్నాయి. ఈ రాజ్యాంగ నిబంధనలు కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం రూపొందినవి కావు. గణతంత్ర పునాదులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా వీటిని పొందుపరచారు. సమగ్రత, సమన్యాయం, స్వతంత్రత అనే విలువల ప్రాతిపదికగానే ఎన్నికల వ్యవస్థ నిర్మాణం జరిగింది.

## కమిషన్‌ను బలపరిచిన తీర్పులు

దేశ అత్యున్నత న్యాయస్థానం దశాబ్దాల తరబడిగా ఈ రాజ్యాంగ దృక్పథాన్ని విస్తరించి, పరిరక్షించింది. స్వచ్ఛమైన ఎన్ని కల నిర్వహణ కోసం 'చట్టం ప్రవేశించని చోట' స్వతంత్రించి చర్యలు తీసుకునేందుకు ఎన్నికల సంఘానికి లభించిన సంపూర్ణ అధికారంగా మొహిందర్ సింగ్ గిల్ (1978) కేసులో జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ ఈ 324వ అధికరణాన్ని అభివర్ణించారు. కమిషన్ అధికారాలు న్యాయ చట్టాలకు పరిపూర్ణత కల్పించేవిగానే ఉంటా యనీ, అవి వాటిని పడగొట్టేవి కావనీ ఏసీ జోస్ (1984) కేసులో కోర్టు స్పష్టం చేసింది. దీని సారాంశం : ఎక్కడ చట్టం మౌనం వహి స్తోందో,



అక్కడ కమిషన్ క్రియాశీలం అయితీరాలి. ఎక్కడ చట్టం మాట్లాడుతుందో, అక్కడ ఎన్నికల సంఘం ఆ మాటకు లోబడి నడచుకోవాలి. స్వేచ్ఛాయుత, న్యాయబద్ధ ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని టి.ఎన్. శేషన్ (1995) కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావం ఏమాత్రం పడకుండా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఓటరుకు ఉన్న తెలుసుకునే హక్కును, 'నోటా'ను ఎంపిక చేసుకునే హక్కును బలోపేతం చేస్తూ ఏడీఆర్ (2002), పీయూసీఎల్ (2013) వంటి తర్వాతి తీర్పులు యావత్ ప్రక్రియలో పౌరుడిని కేంద్రబిందువు చేశాయి.

తరచూ విస్మరించే ఒక చిన్న తేడా గురించి ఇక్కడ నొక్కి చెప్పాలి. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికల కోసం వీవీప్యాట్ పేపర్ ట్రయల్ అనేది 'తప్పనిసరి అవసరం'గా సుబ్రమణియన్ స్వామి వర్సెస్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (2013) కేసు విచారణలో సుప్రీంకోర్టు గుర్తించింది. అయితే తక్షణం దేశవ్యాప్తంగా దీన్ని ప్రవేశపెట్టాలంటూ ఉత్తర్వులు ఇవ్వ లేదు. దశల వారీగా చేపడతామంటూ చేసిన ప్రతిపాద నను అమోదిస్తూ ఈ దిశగా కమిషన్ తీసుకుంటున్న చొరవను ప్రశంసించింది. అందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది వ్యవస్థల నడుమ వెల్లివిరిసిన సరైన రాజ్యాంగ సమతు ల్యతను ప్రతిబింబించింది.

### విశ్వసనీయతను నిలబెట్టుకునేదెలా ?

ఎన్నికల సంఘానికి ఉన్న అధికారం రాజ్యాంగం ద్వారా సంక్ర మించింది. అయితే దాని విశ్వసనీయత మాత్రం అసాధారణమైన నిశిత సమీక్షకు లోనయ్యే సాధారణ అధికారుల మీద ఆధారపడి ఉంది. వారు తీసుకునే లక్షలాది చర్యలతో కూడిన ఆచరణలో అది నిగ్గు తేలాల్సి ఉంటుంది. 18వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ రాజ్యాంగ వ్యవస్థకు సరికొత్త ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఆడిట్స్, డాష్‌బోర్డులు అన్నీ కలిసి ఓట్ల నిరూపణీయతకు హామీ ఇస్తున్నాయి. అయితే నియమ నిబంధనల పరంగా స్వతంత్రత కలిగి ఉండటం కీలకం. నియామక ప్రక్రియలు, పదవీకాల భద్రతలు విశేష అధికారాలు కావు. అవి తటస్థ వ్యవహార శైలికి వ్యవస్థాగత అవసరాలు మాత్రమే. తను నియంత్రించే కార్యనిర్వాహక వ్యవస్థ మీదే న్యాయనిర్ణేత ఆధారపడే పరిస్థితి ఉండకూడదు. పార్లమెంటు ఆమోదించే ఏ సంస్కరణ నమూనా అయినా సరే ఒకే ఒక్క పరీక్షకు నిలబడి తీరాలి. రాజకీయ అధికారానికి ఎన్నికల కమిషన్ 'నో' చెప్పగలదని సగటు ఓటరు నమ్ముతున్నాడా అనే ప్రశ్నే ఆ పరీక్ష. సమ్మిళితం అనేది ఇప్పటికీ నెరవేరని వ్యవహారం. వలస కార్మి కులు, వికలాంగులు, తొలిసారి ఓటర్లు, మహిళలు, పోలింగ్ కేంద్రా లకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వయోవృద్ధులు హర్షించే దిగా ఎన్నికల ప్రక్రియ ఉండాలి. విషాదం ఏమిటంటే, ఖైదీలు పోటీ చేయొచ్చు కాని వారు ఓటేయలేరు. వారికి ఆ అవకాశం కూడా ఉండాలి. ప్రజాస్వామ్య సక్రమత గెలిచినవారి మీదే కాదు, ఎవర్ని అనుమతిస్తున్నామనే దానిమీద ఆధారపడి ఉంటుంది.

గణతంత్ర ఆవిర్భావానికి ముందే రాజ్యాంగపు 15వ ప్రకర ణాన్ని మన ప్రజాస్వామ్య వ్యవస్థాపకులు ఎందుకు అమలులోకి తెచ్చారనే విషయాన్ని మనం ఒకసారి గుర్తు చేసుకోవాలి. భారత ప్రజలు తొట్టతొలిసారి ఓటేసేప్పుడు... ఏ ప్రభుత్వం ఏర్పాటు అయ్యేందుకు తాను సహాయపడుతుందో ఆ ప్రభుత్వంపై ఆధార పడకుండా స్వతంత్రంగా ఉండే వ్యవస్థ పర్యవేక్షణలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ధ్యేయంతో వారా చర్య తీసు కున్నారు. న్యాయనిర్ణేత నమ్మదగిన వాడైతేనే ఆ ప్రజాస్వామ్యం సఫలీకృతం అవుతుంది. ఎన్నికల కమిషన్ దేశ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి తీరాలి. ❑ **('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)**

# ఆర్థికవేత్తగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్

- నిశాంత్ చంద్రవంశీ

డిసెంబరు 6వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహా పరినిర్వాణ దినోత్సవం. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన అసమానమైన కృషికి ఆయనను ఎక్కువగా గుర్తుంచుకుంటారు. కానీ ఆయన గురించి చాలా అరుదుగా ప్రస్తావించబడిన ఒక అంశం ఏమిటంటే ఆయన ఆర్థికవేత్త కూడా. ఆర్థిక శాస్త్రంలో అధికారిక ఉన్నత విద్యను పొందిన తొలి భారతీయులలో డాక్టర్ అంబేద్కర్ ఒకరు. ఆయన 1917లో కొలంబియా విశ్వ విద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. తర్వాత 1921లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఆర్థికశాస్త్రంలో డీఎస్సీ పట్టా పొందారు. డాక్టర్ అంబేద్కర్ 1915లో తన ఎంఏ డిగ్రీ కోసం కొలంబియా విశ్వ విద్యాలయానికి 42 పేజీల డెజర్ట్‌ను సమర్పించారు. 'ఈస్ట్ ఇండియా కంపెనీ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్' పేరుతో రాసిన ఈ పరిశోధన పత్రంలో, ఈస్ట్ ఇండియా కంపెనీ ఆర్థిక పద్ధతులు సాధారణ భారతీయ పౌరుల ప్రయోజనాలకు ఎలా విరుద్ధంగా ఉన్నాయో ఆయన వివరించారు.

### ఆర్థిక సమస్యలపై బాబాసాహెబ్ అవగాహన

బాబాసాహెబ్ ద్రవ్య వ్యవస్థపై ఆయనకున్న అవగాహన ఆయన DSc పరిశోధనలో భాగంగా రాసిన "ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ : ఇట్స్ ఆరిజిన్ అండ్ సొల్యూషన్" అనే పుస్తకం నుండి స్పష్టంగా తెలుస్తుంది. బ్రిటిష్ వలస ప్రభుత్వానికి మరియు భారతీయ వ్యాపార ప్రయోజనాలకు మధ్య సంఘర్షణ ఉన్న సమయంలో భారత కరెన్సీ సమస్యను ఈ పుస్తకం విశ్లేషిస్తుంది. నిజానికి, ఈ పుస్తకం కింద, అతను మారకపు రేట్లు మరియు ధరలలో స్థిరత్వం కోసం వాదించాడు. అతను హిల్టన్ యంగ్ కమిషన్ ముందు కూడా తన వాదనలను సమర్పించాడు. వీటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సృష్టించేటప్పుడు పరిగణనలోకి తీసుకున్నారు. డాక్టర్ అంబేద్కర్ ప్రభుత్వ ఆర్థిక రంగంలో మార్గదర్శక కృషి చేశారు. ఆయన వివరణాత్మక, నిష్పాక్షిక విశ్లేషణ కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై అంతర్దృష్టిని అందించింది. ఆయన అధ్యయనాలు కేంద్ర, రాష్ట్రాల మధ్య, స్వతంత్ర భారతదేశంలో చాలా సంవత్సరాలుగా ఆధునిక సంబంధాలకు ఒక ఆధారాన్ని అందించాయి. ఆర్థిక కమిషన్లకు ఒక అంతర్నిర్మిత గైడ్ ఉంది. అధిక ఉత్పత్తి పన్ను, భూమి రెవెన్యూ పన్ను, ఎక్సైజ్ సుంకం ఉండటం వల్ల భారత పన్ను వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని మరియు ఇది వివిధ తరగతుల మధ్య వివక్ష, అసమానత సూత్రంపై ఆధారపడి ఉందని ఆయన వాదించారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రానికి సహకారం 19వ శతాబ్దం ప్రారంభంలో భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తక్కువ ఉత్పాదకత. 1917లో ఒక కమిటీని నియమించి, భూమి కమతాలను ఏకీకృతం చేయాలని సూచించింది. అంబేద్కర్ తన "భారతదేశంలో చిన్న కమతాలు మరియు వాటి నివారణలు" (1918) అనే పత్రంలో ఏకీకృత భూమి ప్రభుత్వ యాజమాన్యంలో ఉండాలని మరియు ఎటువంటి వివక్షత లేకుండా స్థానిక రైతులకు సమానంగా పంపిణీ చేయాలని వాదించారు. 1936లో స్వతంత్ర మజ్దూర్ పార్టీ మ్యానిఫెస్టోలో పన్నులపై తన అభిప్రాయాలను డాక్టర్ అంబేద్కర్ వ్యక్తం చేశారు. ప్రధానంగా సమాజంలోని పేద వర్గాలపై భారం పడినందున వారు భూ రెవెన్యూ వ్యవస్థ, ఇతర పన్నులను వ్యతిరేకించారు. పన్నుల సూత్రాలు ఆదాయంపై కాకుండా చెల్లింపుదారుల సామర్థ్యంపై ఆధారపడి ఉండాలని అన్నారు. డాక్టర్ అంబేద్కర్ కార్మిక, నీటిపారుదల, విద్యుత్ శాఖల క్యాబినెట్ మంత్రిగా ఉన్నప్పుడు గొప్ప విధాన చొరవ తీసుకున్నారు. ఇది ప్రస్తుత నీటి భాగస్వామ్య వివాదాన్ని సెంట్రల్ వాటర్ కమిషన్ (భారత కేంద్ర ప్రభుత్వంలో ఒక అత్యున్నత సంస్థ) ద్వారా పరిష్కరించింది. దానికి నాయకత్వం వహించింది. రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఈ విధానానికి చట్టపరమైన విధానాన్ని ఆయన వివరించారు. తరువాత, అతను దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్ (బిహార్, పశ్చిమ బెంగాల్‌లో) స్థాపనకు దారితీసిన విధాన చట్రం ప్రకారం పనిని అమలు చేశాడు. 1949లో రాజ్యాంగ ముసాయిదాలో పన్నుల అంశంపై అంబేద్కర్ ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు.

భారత రాజ్యాంగంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నియామకానికి సంబంధించిన నిబంధన యొక్క సమర్థనను వివరిస్తూ, ఆయన ఇలా అన్నారు. "ప్రభుత్వాలు నియమాలు, చట్టాలు మరియు నిబంధనలను అనుసరించి ప్రజల నుంచి సేకరించిన డబ్బును ఉపయోగించడమే కాకుండా, ప్రభుత్వ అధికారులు డబ్బు ఖర్చులో విశ్వసనీయత, తెలివితేటలు, పొదుపును వినియోగించే లా చూసుకోవాలి. డాక్టర్ అంబేద్కర్ పారిశ్రామికీకరణ, పట్టణీకరణకు అనుకూలంగా మాట్లాడినప్పటికీ, పెట్టుబడిదారీ విధానం యొక్క దుష్ప్రభావాలను

హెచ్చరించారు, నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అణచివేత, దోపిడీ శక్తిగా మారుతుందని వాదించారు. ఆర్థిక విధానాలు, ప్రణాళికలపై ఆచరణాత్మకమైన, ప్రజా ప్రయోజనకరమైన విధానం ఉన్న కొద్దిమంది ఆర్థిక సిద్ధాంతకర్తలలో ఆయన ఒకరు. అందువల్ల, అంబేద్కర్ ఆర్థిక విషయాలపై లేదా ద్రవ్య సూత్రాలపై రాసినా, ఆయన ప్రాథమిక లక్ష్యం ఆచరణాత్మకమైన, ప్రజా ప్రయోజనకరమైన తీర్మానాలను చేరుకోవడమే. ❑



# మతతత్వంపై రాజీపడని అంబేద్కర్

\- పి.ప్రసాద్



బాబ్రీ మసీదును సంఘ్ పరివార్ సంస్థలు విధ్వంసం చేయడంలో విషాదకర మైన మరో కోణం ఏమంటే డిసెంబరు 6 అంబేద్కర్ వర్ధంతి రోజు కావడం. ఈ దేశానికి లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడి వర్ధంతి రోజునే ఆ దురంతానికి పాల్పడడం సంఘ్ పరివార్ వాస్తవ రూపాన్ని తెలిపే మరో సందర్భం. ఈ ముప్పై ఏండ్ల చరిత్రను తేరిపార చూసేప్పుడు అంబేద్కర్‌ను స్మరించుకోవడం, మతతత్వ రాజకీయాలపై ఆయన నిశిత విమర్శలను గుర్తు చేసుకోవడం అవసరం. జీవితమంతా సామాజిక న్యాయం కోసం పరితపించిన అంబేద్కర్ హిందూత్వ రాజకీయాలను, హిందూరాజ్ ఏర్పాటు చేయాలనే పిలుపులను నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. వాస్తవానికి అది అగ్రవర్ణాల భావజాలమని, వర్ణ వ్యవస్థ ద్వారా అత్యధిక ప్రజానీకాన్ని అణచివేసి దోపిడీ పీడన సాగించినట్టే అల్ప సంఖ్యాక మతాల విషయంలోనూ చేయడం వారి స్వభావమని ఆయన స్పష్టీకరించారు. ఆయన అధికార వాణిగా పరిగణించబడిన జనతా పత్రికలో తరచూ ఈ అభిప్రాయాలు ప్రకటిస్తూ వచ్చారు. బహిష్కృత్ భారత్, ప్రబుద్ధ భారత్‌లలోనూ అనేకసార్లు ఈ విషయాలు రాశారు. 1934లో ఆర్ఎస్ఎస్ విషయంలో తన విమర్శ వెలువరించారు. 1940లో పాకిస్థాన్ ఆర్ పార్టిషన్ ఆఫ్ ఇండియా అన్న పుస్తకం రాస్తూ హిందూ రాష్ట్ర భావనను తోసిపుచ్చారు. హిందూత్వ రాష్ట్ర ప్రాతిపదికన దేశమే ఏర్పడేట్టయితే అంతకంటే విపత్తు మరొకటి ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఎట్టి పరిస్థితులలోనూ హిందూత్వ ప్రాతిపదికన ఏర్పడే రాజ్యాన్ని నిరోధించాల్సిందేనని హెచ్చరించారు. వీరసావర్కార్, మహ్మదాలీ జిన్నా ఒకే నాణేనికి బొమ్మ బొరుసు వంటి వారని తేల్చి చెప్పారు. ఇద్దరూ మరో మతం అస్తిత్వాన్ని, హక్కును గుర్తిస్తామంటూనే దేశాన్ని రెండు చేయాలని పట్టుపట్టడం ఇందుకు నిదర్శనమన్నారు. 1950లో అంబేద్కర్ న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడానికి ఈ హిందూత్వ శక్తులే కారణం. హిందూ కోడ్ బిల్లు మతానికి హాని చేస్తుందని వారు గగ్గోలు పెట్టడాన్ని ఆయన ఆమోదించ లేదు. ఆ సమయంలో జన సంఘ్ వ్యవస్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ వంటి వారు పనికట్టుకుని దాడి చేశారు. 1956లో బౌద్ధాన్ని స్వీకరించడంలోనే అంబేద్కర్ కుల దొంతరలతో కూడిన హిందూ వర్ణ వ్యవస్థను తిరస్కరిస్తూ బయటకు నడిచారు. అది ఆయన ఎంచుకున్న మార్గమైనప్పటికీ ఆయన అభిప్రాయాలు మరింత విస్తృతమైనవని గుర్తించాల్సి ఉంది. మతతత్వాన్ని నిష్కర్షగా ఖండించిన వ్యక్తి ఆయన.


విచిత్రమేమంటే ఇదే అంబేద్కర్‌ను హిందూత్వ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలు ఆర్ఎస్ఎస్ 1980లోనే ప్రారంభించింది. సంఘ్ స్థాపకులైన గోల్వార్కర్, సావర్కార్ వంటి వారితో ఆయనకు చాలా సాన్నిహిత్యముందనే పాటెత్తుకుంది. ఆయన చేపట్టిన బౌద్ధం హిందూ మతంలో శాఖ తప్ప మరోటి కాదని ప్రచారం మొదలుపెట్టింది. 2014లో మోదీ వచ్చిన కొద్ది రోజుల్లోనే అంబేద్కర్ ఆశయాల ప్రకారమే తాము నడుస్తున్నామనే రాతలు ప్రారంభించారు. 2017లో మోదీ ఢిల్లీలో అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రం ప్రారంభించారు. అలాంటివి తర్వాత చాలా వచ్చాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలలో భారీ స్మారక చిహ్నాలు నిర్మిస్తున్నారు. వీటిని 2023కు పూర్తి చేస్తే ఎన్నికలకు ఉపయోగపడుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. రామ్‌నాథ్‌కోవింద్‌ను రాష్ట్రపతి చేయడమూ అందుకోసమేనని అన్నారు. అసలు ఆర్ఎస్ఎస్ మరింతగా విస్తరిస్తేనే హిందూ సమాజం ఐక్యత పెరుగుతుందని అంబేద్కర్ తనతో చెప్పినట్టు దత్తోపత్ తెంగ్డే రాసుకున్నారని కొందరు విమర్శిస్తుంటారు. అంబేద్కర్ భావనలకు ఆయన రూపొందించిన రాజ్యాంగ విలువలకూ పూర్తి వ్యతిరేకంగా బాబ్రీ విధ్వంసానికి మత కలహాలకూ కారణమైన వారే ఆయనను తమకు అనుకూలుడిగా చిత్రించుకోవడం చారిత్రక వైపరీత్యం. అటూ ఇటూ కూడా దెబ్బ తీసే చక్రబంధం వక్రవ్యూహం. దీనిపై ప్రత్యేకంగా అనేక పుస్తకాలు వెలువడ్డాయి. మతతత్వ రాజకీయాలపై పోరాటానికి ప్రతినబూనే సందర్భంలో మహనీయుడు అంబేద్కర్ నిజమైన బోధనలను అధ్యయనం చేయడం, విస్తృతంగా ప్రచారంలో పెట్టడం మరింత అవసరమవుతుంది. ❑

# అట్టడుగు వర్గాల ఆశా'జ్యోతి'

- టీ.ఆర్.

మనిషిని మిగిలిన జంతువుల నుంచి వేరుచేసి చూపించేది జ్ఞానం. ఆ జ్ఞానానికి ప్రధానమైన వనరు చదువు. అట్లాంటి విద్య ఈనాడు అందరికీ అందుబాటులో ఉంది. దీనికి కారణం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహాశయుడు రాసిన రాజ్యాంగం. అయితే భారత రాజ్యాంగం అమలులోకి రావటానికి ముందు ఈ దేశంలో అధిక సంఖ్యాకులైన ప్రజానీకానికి చదువుకునే హక్కు లేదు. ఆ ప్రజలందరూ కింది కులాలకే చెందినవారు కావటం యాదృచ్ఛికమేం కాదు. కావాలనే ఒక వర్గం మరొక వర్గాన్ని జ్ఞానానికి దూరం చేసింది. తద్వారా వీరిని అన్ని రకాలుగా దోపిడీ చేయగలిగింది. ఈ దోపిడీ ప్రక్రియ దాదాపు రెండు వేల ఏండ్ల కిందట మొదలై రాజ్యాంగం అమలులోకి వచ్చేంత వరకు నిరాఘాటంగా కొనసాగింది. ఈ క్రమాన్నంత ఆధునిక భారతదేశంలో మొట్ట మొదటసారిగా శాస్త్రీయంగా పరిశీలించిన వాడు పూలే. ఆయన 1827 ఏప్రిల్ 11న జన్మించి, 1890 నవంబర్ 28న మరణించాడు. నిజానికి ఆ కాలంనాటికి ఇంకా శాస్త్ర సాంకేతికత అందుబాటులోకి రాలేదు. కింది వర్గాల చరిత్రను గానీ వారి సమాచారాన్ని గాని నమోదుచేసిన వాళ్లెవరూ లేరు. కింది వర్గాల వారి సాహిత్యమూ లేదు. పూలే కాలం నాటికి శూద్ర, అతిశూద్రులుగా పిలవబడుతున్న కింది వర్గాల వారి జీవితాల్లో ఉన్నదంతా చీకటే. వాళ్ల ముందున్నది ఏ దారీ తెలియని కీకారణ్యమే. ఆ చీకట్లోనే, ఆ అడవిలోనే చేతిలో విద్య అనే జ్యోతిని పెట్టుకుని భవిష్యత్తరాల కోసం కొత్తదారిని నిర్మించాడు పూలే. తరువాత అంబేద్కర్ అదే దారిలో నడిచాడు. పూలే ఆశయాలను రాజ్యాంగబద్ధం చేసి ఈ దేశంలో తరతరాలుగా అణిచివేతలో ఉన్న ప్రజలకు అన్ని రకాల హక్కులను ప్రసాదించగలిగాడు. పూలేను తన ముగ్గురు గురువుల్లో ఒకరిగా భావించి తన "శూద్రులెవరు?" అన్న ప్రసిద్ధ గ్రంథాన్ని అంకితమిచ్చాడు. ఇన్ని రకాల చట్టాలు, రాజ్యాంగ రక్షణలు ఉన్న ఈ అత్యాధునిక కాలంలోనే స్త్రీలు హింసనూ, వివక్షను అనుభవిస్తుంటే పూలే కాలంనాటికి వాళ్ల పరిస్థితి ఎంతగా దిగజారిపోయి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. స్త్రీలు చదువుకోవటాన్ని ధర్మశాస్త్రాలు ఒప్పుకోవని, వారు చదువుకుంటే సమాజానికి కీడు దాపురిస్తుందని ఆనాటి పండితులు ప్రచారం చేసేవారు. అమాయకులైన ప్రజలు నమ్మేవారు.

స్త్రీలతోపాటు శూద్రులు, అతిశూద్రుల పరిస్థితి కూడా ఇదే.



చదువు లేకపోవటం వల్లనే పైన ఉన్న వర్గాలు ఈ ప్రజలను మోసం చేస్తున్నాయన్న సంగతిని తన జీవితానుభవాల ద్వారా పూలే గుర్తించాడు. అందుకే వారికి చదువు చెప్పి వాళ్లను చైతన్యం చేయాలనుకున్నాడు. ఈ దేశంలో చదువొక్కటే జీవితాలను మారుస్తుందని నమ్మిన మొట్టమొదటి సంస్కర్త మహాత్మా పూలే. చదువుకు, జ్ఞానానికి ఉన్న సంబంధాన్ని ఆయన గుర్తించాడు. అందరితోపాటు తన చదువు విషయం లోనూ బ్రాహ్మణవర్గం ఎట్లా కుట్రలు చేసిందో ఆయనకు తెలుసు. అందుకే బ్రాహ్మణ వర్గం ఒకటే ఉన్నతంగా జీవిస్తూ మిగిలిన వర్గాలు అణగారిపోవటానికి దారితీస్తున్న ఇతర కారణాల గురించి ఆలోచించాడు. మత సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేశాడు. ఈ క్రమంలోనే "స్త్రీలను అణిచివేయాలనే దృక్పథంతోనే దుర్మార్గులు, స్వార్థపరులైన స్మృతికారులు అన్యాయమైన, అసంబద్ధమైన విషయాలను చేర్చి ధర్మశాస్త్రాలు రాశారు" అనే విలువైన పరిశీలన చేశాడు.

కుటుంబం మారాలంటే స్త్రీ చదువుకోవాలని భావించిన పూలే 1848లో మొట్ట మొదటి అతి శూద్ర బాలికల పాఠశాల ప్రారంభించాడు. ఆ రోజుల్లో ఆడవాళ్లు చదువుకోవడం నిషిద్ధం కాబట్టి మహిళా ఉపాధ్యాయులు అందుబాటులో లేరు. ఈ కారణంగా మొదట తన భార్య సావిత్రిభాయికి చదువు నేర్పి ఆమెతో ఆడపిల్లలకు చదువు చెప్పించాడు. ఆ రకంగా ఈ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రీభాయి పూలే నిలిచింది. నిజానికి ఉపాధ్యాయ దినోత్సవం సావిత్రి భాయి పేరు మీద జరగాలి. కానీ, అగ్రవర్ణ భావజాలం గల మన నాయకులు ఆమె సేవలను గుర్తించలేదు. ఇలాంటి కుట్రలు స్వయంగా ఆమె కార్యరంగంలో ఉన్నప్పుడు చేశారు. ఆమె చదువుచెప్పటానికి పాఠశాలకు వెళ్తుంటే ఓర్వలేని

పండితులు ఆమె మీద పేడ నీళ్లు చల్లేవారు, తిట్టేవారు, చంపుతామని బెదిరించేవారు. పూలే తండ్రి మీద ఒత్తిడి తెచ్చి జ్యోతిరావు దంపతులను ఇంట్లో నుంచి గెంటి వేయించారు. ఇవేవీ లెక్క చేయని పూలే శూద్ర, అతిశూద్ర బాలికల కోసం మరిన్ని పాఠశాలలు తెరిచాడు. ఒకపక్క తాను స్వయంగా పాఠశాలలు నడుపుతూనే మరోపక్క కింది వర్గాల ప్రజల చదువు కోసం బ్రిటీష్ ప్రభుత్వం శ్రద్ధ వహించవల్సిందిగా కోరుతూ అనేక విజ్ఞాపన పత్రాలను సమర్పించేవాడు. రైతులు, కార్మికుల గురించి ఆనాటికి చాలా ముందుచూపుతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచేవాడు. ఈ క్రమంలోనే హంటర్ కమిషన్‌కు తాను అందజేసిన మెమోరాండంలో ప్రాథమిక విద్యా ప్రాధాన్యాన్ని అద్భుతంగా వివరించాడు. "మహార్లు, మాంగులు ఇతర వెనుకబడిన వర్గాలుగా ఉన్న బహుజనులు తమ కోసం ప్రత్యేక పాఠశాలలు స్థాపించుకోవాలని నేను కోరుతున్నాను. ఎందుకంటే మిమ్మల్ని కులతత్వంతో నిండిన వాళ్ల పాఠశాలల్లోకి రానివ్వరు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఆయన కాలంలో సాంఘిక సంస్కర్తలమని చెప్పుకుని తిరుగుతున్న చాలామంది చేయలేని ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు జ్యోతిరావు పూలే ఒంటి చేతితో తన భార్య సావిత్రీ పూలే సహకారంతో చేశాడు.

ప్రజల్లో చైతన్యం తేవడానికి ఆనాటి అసమాన సాంఘిక నిర్మాణం మీద దాని నేపథ్యం మీద పరిశోధనాత్మక రచనలు చేశాడు. తన ఆదర్శాలను కేవలం తన రచనల్లోనే చెప్పి ఊరుకోలేదాయన. వాటిని తన జీవితంలో చేసి చూపించాడు. అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా నిలిచాడు. అందుకే అంబేద్కర్ అంతటి మహా మేధావికే గురుస్థానంలో నిలవగలిగాడు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందరికీ చదువుకునే హక్కును ప్రసాదించటం పూలే ఆచరణకు కొనసాగింపుగానే చూడాలి. రాజ్యాంగంలో మానవతా దృష్టితో పొందుపరిచిన అనేక చట్టాల వెనుక ఆనాడు పూలే సాగించిన ఉద్యమ ప్రభావం కచ్చితంగా ఉంటుంది. పూలే కృషి తదనంతరకాలంలో అంబేద్కర్ రూపంలో చాలా సమర్థవంతంగా కొనసాగింది. ఆ స్ఫూర్తి ఆనాడే కాదు, ఈనాటికీ కొనసాగుతూనే ఉంటుంది. ❑

# ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా ?

**(5వ పేజీ తరువాయి)**

లోపలా సంబంధాలు, పరస్పర ఆధారితాలు పెరిగిపోయాయి. బొగ్గు స్థానంలో సౌర, పవన విద్యుత్తు ప్రాధాన్యం పెరుగుతోంది. ఏ దేశమూ మరో దేశంపై ఆధారపడకుండా మనగలిగే పరిస్థితి వచ్చేసింది. ఏక దేశ ఆధిపత్యానికీ కాలం చెల్లుతోంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల మీద గుత్తాధిపత్యం కొనసాగించే పరిస్థితి కనపడటం లేదు. అమెరికాను అన్నింటా సవాల్ చేస్తున్న చైనా పురోగతే దీనికి నిదర్శనం. ప్రపంచంపై ఆధిపత్యాన్ని చెలాయించిన అమెరికా, బ్రిటన్‌లకు ఉన్న అనుకూల పరిస్థితులు చైనాకు ఎన్నడూ లేవు. దోపిడీ చేయటానికి బ్రిటన్‌లాగా వలస రాజ్యాల్లేవు. అమెరికాకు లభించిన ఆఫ్రికా బానిసల శ్రమ చైనాకు లేదు. విలువైన వనరులు వున్న సువిశాల భూభాగాన్ని స్థానిక జాతుల నుంచి అమెరికాలాగా దక్కించుకునే అవకాశమూ రాలేదు. అయినా చైనా అమెరికాను అన్నింటా దాటిపోయే పరిస్థితే కనిపిస్తోంది.

ఏడో ప్రపంచీకరణ యుగం అంతులేని సంపదను సృష్టిస్తోంది. అదే సమయంలో ఆదాయంలో తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం, అణ్వస్త్ర యుద్ధభూతం అనేవి తీవ్ర అస్థిరతకు కారణం అవుతున్నాయి. ప్రపంచాన్ని ప్రమాదం అంచున నిలబెడుతున్నాయి. వీటిని పరిష్కరించగలిగిన స్థాయిలో సామాజిక, వైజ్ఞానిక అవగాహన సంపద మనకుంది. ధనిక వర్గాల మితిమీరిన స్వార్థం, లాభకాంక్షలు ఆ సంపదను ఉపేక్షిస్తే భవిష్యత్తు అగమ్య గోచరమే ! ప్రపంచీకరణ రథాన్ని వెనక్కి తిప్పలేం. కానీ నిర్లక్ష్యం వహించి, యథాతథ స్థితిని కొనసాగిస్తే దాని రథచక్రాల కింద అందరమూ నలిగిపోయే ప్రమాదాన్నీ కొట్టేయలేం! ❑ **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# రక్తపాతం లేకుండా రాజకీయ నరమేధమే ఓటర్ల తొలగింపు !

**(7వ పేజీ తరువాయి)**

దేశాల మధ్య భద్రత కోసం, దేశాల మధ్య సహకారం కోసం డిసెంబరు 10న మానవ హక్కుల ప్రకటనను చేసిందని గుర్తుచేశారు. ఆ ప్రకటన వెలువడిన రోజునే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. పౌర చైతన్య వేదిక లక్ష్యాలను, కర్తవ్యాలను వివరించారు. పౌర చైతన్య వేదిక తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షులు రాఘవ ఆహ్వానం పలికిన ఈ సభలో ముగ్గురు మూడు తీర్మానాలను ప్రవేశపెట్టారు. పౌరచైతన్య వేదిక విశాఖ పట్నం జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ కోల వెన్నుచాంద్ ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, వేదిక కర్నూలు అధ్యక్షులు ఓంకార్ వివాదాస్పదమైన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, తిరుపతి జిల్లా కార్యదర్శి ఏ.ఎన్.పరమేశ్వరరావు పెగాసెస్ వైరస్‌ను పోలిన సంచార సాథి యాప్‌ను వ్యతిరేకిస్తూ పెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో ఆరుగురు వెలిబుచ్చిన సందేహాలకు పరకాల ప్రభాకర్ వివరించి చెప్పారు. మధ్యాహ్నం పౌరచైతన్య వేదిక ప్రతినిధుల సమావేశం జరిగింది. ❑

# మానవీయ పునర్వికాసమే దేశభక్తి




- తెలకపల్లి రవి

దేశమంటే మట్టికాదని దేశమంటే మనుషులేనని గొప్ప సత్యాన్ని తెలుగు వారికి తెలియజెప్పిన మహా వైతాళికుడు గురజాడ అప్పారావు. 110వ వర్ధంతి ఆయన మహత్తర జీవితాన్ని ఆశయాలనూ మరోసారి మన ముందు నిలుపుతున్నది. బ్రిటిష్ పాలనలో మెకాలే మనపై రుద్దిన వలసవాద వారసత్వం నుంచి బయటకు రావాలని ఈ మధ్య ప్రధాని మోదీ పార్లమెంటులో పిలుపునిచ్చారు. దానికి రెండు రోజుల ముందు మోదీగారే అయోధ్యలో రామమందిరంపై కాషాయధ్వజం ఎగరేస్తూ రామధర్మం పునఃప్రతిష్ఠించాలని ప్రవచించారు. మెకాలేకు విరుగుడు భారతీయులు సర్వతో ముఖాభివృద్ధికి సాగిపోవడం తప్ప మనుధర్మం పునరుద్ధరణ కాదు. చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్తులందరు నడవాలని, అన్నదమ్ముల్లా జాతులూ మతాలు మెలగాలని గురజాడ వారసత్వం మనకు చెబుతుంది.

1862లో పుట్టి 1915లో మరణించిన గురజాడ అప్పారావు షష్టి పూర్తి అయినా చేసుకోలేదు. కాని జాతికి అందించిన స్ఫూర్తి మాత్రం చిరస్మరణీయమైనది. మలిన వృత్తులు మాలవారని/ కులము నేర్చిన బలియురొక/దేశమున/ కొందరు/ వెలికితోసిరి/ /కులము లేదట ఒక్క వేటున / పసరములు హింసించు వారికి/ కులము కలదట నరుల ద్రేచెడి/ క్రూర కర్ములకున్/మలిన దేహులు మాలలనుచును/ మలిన చిత్తుల కధిక కులముల/ నెలవొసంగిన వర్ణ ధర్మమ/ధర్మంబె!/మంచి చెడ్డలు మనుజులందున/ యెంచి చూడగ రెండె కులములు/మంచి యన్నది మాలయైతే/ మాల నేనగుదున్ అని ప్రకటించాడు. దళితులపై లైంగికదాడులు నిరంతర సమస్యగా వున్న దేశంలో- నూట పదిహేనేండ్ల కిందట ఇలాంటి మాటలనడానికి ఎంత సాహసం కావాలి ? అందుకే ఆయన ఎప్పుడూ గుర్తుకు వస్తారు. పదేండ్ల కిందట నరేంద్ర మోదీ అమరావతి శంకుస్థాపన కార్యక్రమంలో మట్టి తీసుకువచ్చిన సందర్భంలో 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ పంక్తులు అందరిలో తలుచుకున్నారంటే ఆయన ముద్ర ఎంత సజీవంగా వుందో తెలుస్తుంది. విశ్వగురువు వంటి పెద్ద పెద్ద కితాబులు విన్నప్పుడల్లా 'వట్టిమాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్' అనే చురక తగులుతుంది.

అభినవ అగ్నిహోత్రావధాన్లను గ్లోబల్ గిరీశాలను కట్టడి చేయాలంటే మందగించక ముందుకడుగు వేయాల్సిందే తప్ప



వినాయకుడిలో ప్లాస్టిక్ సర్జరీని చూసే వెనకచూపు పనికి రాదంటుంది. వలస భావజాలం నుంచి బయటకు రావడమంటే నూతన చైతన్యంతో ముందుకుపోవడం తప్ప వలస పాలన కన్నా ముందున్న సనాతనత్వంకేసి పరుగులు పెట్టడం కాదనీ, 'వెనకచూపిన కార్యం లేదని, మందగించక ముందుకడు గేయాలని' పిలుస్తున్నది. మతాల వారి మంటలు పెట్టే కుటిల శక్తుల కుట్రలు వమ్ము చేస్తూ చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్తులం దరు నడువవలెనో అంటుంది. మంచి గతమున కొంచెమేనోయ్ అన్నమాట గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్ అన్న మహాభారత భావనకు పూర్తి విరుద్ధమైన యుగసందేశం. గురజాడ భావాలకు సంస్కరణలకూ ఇప్పుడు గతం కన్నా ప్రాధాన్యత పెరిగిందంటే అందుకు దేశంలో వచ్చిన రాజకీయ సామాజిక దుష్పరిణామాలు ప్రధాన కారణం. ప్రపంచీకరణలో భాగంగా మత మార్కెట్ తత్వాలు విజృంభించిన నేపథ్యం ఇందుకు ప్రధాన భూమిక. ఎప్పుడో తిరస్కరించిన చాందసాలు, మూఢ విశ్వాసాలు కొత్తగా ఊపిరి పోసుకుంటున్నాయి. కావాలని పోస్తున్నారు. అన్నీ వేదాల్లో వున్నాయనే అగ్ని హోత్రావధాన్లు కంప్యూటర్లలో నుంచే పుట్టుకొస్తున్నారు.

**పునరుద్ధరణా, పునర్వికాసమా ?**

జాతీయోద్యమంలోనూ ఒక భాగం పునరుద్ధరణవాదం వైపు చూస్తున్న తరుణంలో దాని నుంచి విడగొట్టుకున్న ఆధునికత

ఇది. గురజాడ ఎలాంటి శషభిషలు లేకుండా చాందసాన్ని తిరస్కరించాడు. వ్యావహారిక భాషా వాదంలో ఆయన సూటిగానే బ్రాహ్మణీయ భావజాలాన్ని ఛేదించవలసిన అవసరం చెప్పాడు. ఆ వాదానికి అంతటి వ్యతిరేకత తెలిపిన వారంతా మౌలికంగా సనాతన భావజాలం నుంచి బయటపడని వారే. ఎందుకంటే మొదట్లో వ్యవహార భాషను ఆమోదించని కందుకూరి వీరేశలింగం, తాపీ ధర్మారావు వంటి వారు ఉత్తరోత్తర వ్యావహారిక భాషావాదులైనారు. కాని కొందరు ఇప్పటికీ దానిని వదిలి పెట్టలేకపోతున్నారు. ప్రజాకవుల, ప్రజాకళల మాట అటుంచి సినిమాల్లో ఆత్రేయ తదితరుల సులభశైలిని వదలిపెట్టి సంస్కృత పద గుంఫనం పున: ప్రవేశ పెట్టడం, ఉద్వేగం తీసుకురావాలంటే సంస్కృత శ్లోకాలను ఆలపించడం చూస్తున్నదే. గురజాడ పేరిట పురస్కారాలను పురాణ ప్రవచనకర్తలకు ఇవ్వడం మనం చూశాం. చాందసత్వంపై పిడుగులు కురిపించిన కన్యాశుల్కం నాటకాన్ని కేవలం హాస్య ప్రధానంగా మార్చి, ఆయన అపహాస్యం కోసం సృష్టించిన గిరీశాన్నే నాయకుడిని చేసిన కుతంత్రం విస్మరించకూడదు. సనాతన ఆచారాల ప్రకారం గురు శిష్య పరంపరలు ఎలా వుండాలో, ఎవరు ఎన్నిసార్లు స్నానం చేయాలో, స్త్రీలు ఎలా అస్వతంత్రులుగా భయభక్తులతో మెలగాలో రోజూ ఏకరువు పెట్టే పెద్ద మనుషులను విద్యార్థులకు సలహాదారులుగా నియ మించడం చూస్తున్నాం. ఇలాంటి తరుణంలో తన కాలాన్ని మించిన దార్శనికతను ప్రదర్శించిన గురజాడ నిజమైన విజనరీ అని గుర్తించాల్సి వుంటుంది. నరుల చెమటను తడిసిమూలం ధనం పంటలు పండవలెనోయ్ అంటూ కార్మిక కర్షకుల శ్రమ ను చూశాడు గురజాడ. అటు కార్మికుల పనిగంటలు పెంచుతూ ఇటు రైతుల పంటలను కొల్లగొడుతూ కార్పొరేట్లకు కట్టబెట్టడం నేటి పాలకుల వ్యూహం. సంపద శ్రమజీవులు సృష్టిస్తారు గానీ వట్టిమాటలతో కాదు, ఆ సంపదను మరెవరి దోపిడీకో కట్టబెడితే ప్రజలకు ఎలా లభిస్తుందని విశాఖ ఉక్కు ప్రశ్నిస్తున్నప్పుడు మనకు గురజాడే కనిపిస్తారు.

## ప్రజల భాష కోసం

వలస పాలన కాలంలో తెలుగు వికాసం కోసం, అందునా ప్రజల భాష కోసం పోరాడిన యోధులు గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి. ఇంగ్లీషు భాషలో వచ్చిన నూతన విజ్ఞానాన్ని ఆహ్వానిస్తూనే సామాన్య ప్రజలకు తెలిసే తెలుగు కావాలని కోరుకున్నారు. ఆనాటి చాలా మంది పండితులకు సంస్కృతం తప్ప తెలుగు నుడికారం తెలియదు. కింది కులాలు చదువుకోరాదని శాసించిన ఫలితంగానే సంస్కృతంలో బోధన జరిగిందని, గ్రాంధికం నడిచిందనీ ఆయన స్పష్టం చేశాడు. కేవలం కొన్ని వర్గాలు మాత్రమే చదువుకునే రోజుల మొదట్లో సంస్కృతం వల్ల, తర్వాత ఇంగ్లీషు వల్ల విద్య అందరికీ అందకుండా పోయింది. కనుకనే ప్రజల భాషగా తెలుగును పెంపొందించుకోవలసిన అగత్యమేర్పడింది. నాటి నిజాం రాజ్యంలో ఈ రెంటికీ తోడు ఉర్దూ భాషాధిపత్యం. ఇవన్నీ ప్రభావం చూపించాయి.

ఆ నాటికి తెలుగు వారికి ఒక మహానగరం లేనందువల్లనే సమగ్రమైన వ్యావహారిక భాష పెంపొందలేదని గురజాడ మద్రాసును ఉదాహరణగా తీసుకుని విశ్లేషించి చెప్పారు. ఇప్పుడు మనం విద్యలో మీడియాలో తెలుగును ఉపయోగించుతున్నామంటే గురజాడ గిడుగు పాత్ర కీలకమైంది. అది చాలా కాలం పట్టింది. 1960ల వరకూ విశ్వ విద్యాలయాలు వ్యవహారిక గ్రాంధిక భాషలో వుంటేనే పరిశోధనలు ఆమోదించేవి కావు. 1970లలో గాని తెలుగు మీడియంలో ఉన్నత స్థాయి బోధన రాలేదు. తర్వాత ఒకటి రెండు దశాబ్దాలు గడిచాయో లేదో ప్రపంచీకరణ దెబ్బతో పూర్తిగా ఇంగ్లీషు మీడియం కమ్మేసింది. ఇంగ్లీషు వద్దని ఎవరూ చెప్పరు. కాని మాతృభాషలో ప్రాథమిక విద్య నేర్పితే పసిపిల్లలకు తేలిగ్గా పట్టుపడుతుందనేది విద్యావేత్తలు భాషావేత్తలు నిరూపించిన సత్యం. కనీసం రెండు మీడియంలు ఉండాలి. గత ప్రస్తుత ప్రభుత్వాలు అధికారికంగానే తెలుగులో బోధనను అటకెక్కించాయి. ఇంగ్లీషు మీడియం విప్లవాత్మకమైనట్టు ప్రచారం భ్రమపెట్టాయి. మొదటి కవిత, నాటకం ఇంగ్లీషులోనే రాసిన గురజాడకు తెలుగు సెంటిమెంటేమీ కాదు. కానీ రాజకీయాల్లో వయోజన ఓటింగు హక్కులాగే వచ్చిన బాషలో చదవుకోవడం ప్రజల హక్కు. తర్వాత వారు ఎన్నిభాషలైనా నేర్చుకోవచ్చు. ప్రజాస్వామ్యం పరిపూర్ణం కావాలంటే భాషా సాహిత్యాల్లోనూ ప్రజాస్వామీకరణ జరగాలని గురజాడ చెప్పాడు. ఈ రెంటికీ వున్న అవినాభావ సంబంధం ఆయన గుర్తించారు. ఇప్పుడు తెలుగు భాష పేరిట చాలా హడావుడి చేసేవారు విద్యారంగంలో వాస్తవ సమస్యలను గుర్తించడమో లేక శాస్త్రీయ విద్యా విధానం రూపొందించడమో చేయరు. కేవలం ఉపన్యాసాలతో సరిపెడుతుంటారు. ఇందుకు భిన్నంగా గురజాడ వ్యవహార భాషలో కన్యాశుల్కం వంటి సాటిలేని నాటకం రాశారు. తద్వారా సంఘ సంస్కరణ మహిళోద్ధరణ అటు చాందసులు, ఇటు డంబాచారులు, మరోవైపు పెద్ద పెద్ద మాటలతో బురిడీ కొట్టించే గిరీశాలను స్త్రీలను వేశ్యలుగా మార్చిన కపటత్వాన్ని చీల్చి చెండాడారు. మధురవాణిని నాయికను చేసి వీరందరికీ పాఠం నేర్పించారు. ఆధునిక మహిళ కొత్త చరిత్ర సృష్టించాలని నిర్దేశించారు.

## నిజమైన వారసులు


సాహిత్యంలో నూతన ధోరణులను తొక్కిపట్టడం చాందసులకూ, పాలకులకూ పరిపాటి. సిపి బ్రౌన్ బయట పెట్టే వరకూ చాందసులు వేమన **(మిగతా 21వ పేజీలో)**


# అద్భుత ప్రతిభాశాలి
# ఆచార్య పోకల లక్ష్మీనరసు

- డాక్టర్ ఏ.బీ.సాయిప్రసాద్



ఆధునిక రచయిత శ్రీదేవదత్త పట్నాయక్ ప్రకారం "మతం జ్ఞాని అయిన ఒక వ్యక్తి ద్వారా ప్రారంభం అవుతుంది. అతని నిర్యాణం తరువాత వ్యక్తి స్థానాన్ని ఒక సంస్థ (Institution) భర్తీ చేస్తుంది. క్షీణదశలో ఉన్న బౌద్ధమతాన్ని దక్షిణ భారతదేశంతోపాటు ఆసియా, ఆఫ్రికా ఖండాలలో 16వ శతాబ్దపు బుద్ధగుప్తనాథుడు పునరుద్ధరించాడు. కొనఊపిరితో వున్న బౌద్ధాన్ని 19వ శతాబ్దంలో జన్మించి (1861) 20వ శతాబ్దపు మూడవ దశకం తొలిభాగం (1934)లో తనువు చాలించిన ఆచార్య పోకల లక్ష్మీనరసు మన దేశంలో ముఖ్యంగా మద్రాసు ప్రెసిడెన్సీలో పునరుజ్జీవింపజేశాడు. మనదేశపు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహాశయుడు ఆచార్య పోకల లక్ష్మీనరసును 19వ శతాబ్దపు ప్రాడిజి(Prodigy)గా అభివర్ణించాడు. అగ్రవర్ణాల వారి అణచివేతకు గురైన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ హిందూ మతానికి ప్రత్యామ్నాయ మతం అన్వేషణలో ఉన్నాడు. అప్పుడు ఆచార్య పోకల లక్ష్మీనరసు రచించిన 'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' (The Essence of Buddhism) అనే గ్రంథాన్ని చదివాడు. ఇది అంబేద్కర్‌ను ప్రభావితం చేసింది. ఆ పుస్తకం రచయిత ఒక తెలుగు వాడైన కారణంగా అతనిని గురించి తెలుసుకొనేందుకు కాంగ్రెసు నాయకుడైన పట్టాభి సీతారామయ్యను సంప్రదించాడు. వివరాలు తెలుసుకున్న అంబేద్కర్ ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి తనలో జీర్ణించుకున్నాడు. 1907లో తొలిసారిగా ముద్రింపబడిన ఆ పుస్తకం ప్రతులు దొరకక పోవడం వల్ల, 1948లో ఆ పుస్తకం మూడవ కూర్పును ప్రచురించి దానికి ముందుమాట రాస్తూ "భారతదేశపు పలు ప్రాంతాల నుంచి, ఇటీవల చాలా చాలా మంది బౌద్ధానికి సంబంధించిన మంచి పుస్తకాన్ని గురించి తెలియజేయండని నన్ను అడుగుతున్నారు. వారి కోరిక ప్రకారం నేను ఆచార్య పోకల లక్ష్మీనరసు ద్వారా రచించబడిన "ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం"ను ఏ మాత్రం సంకోచం లేకుండా సూచిస్తున్నా. బౌద్ధంపైన ఇంత వరకు ప్రచురింపబడిన పుస్తకాలలో ఇది అతి ఉత్తమమైన పుస్తకమని నేను భావిస్తున్నాను." అని అభిప్రాయపడ్డారు.



ఆచార్య పోకల లక్ష్మీనరసు తండ్రి పేరు పోకలచెల్లం నారాయణగురు. ఇతడు ఒక న్యాయవాది. వీరి స్వస్థలం గుంటూరు. అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని హైకోర్టులో ప్రాక్టీసు కోసం పోకల చెల్లం నారాయణగురు తమ మకామును మద్రాసు (చెన్నై)కు మార్చా రు. వీరిది సంపన్న కాపుకుటుంబం. లక్ష్మీనరసు తల్లి వైష్ణవ సంప్రదాయానికి చెందిన వారు. ఈ దంపతులకు లక్ష్మీనరసు 1861లో జన్మించాడు. లక్ష్మీనరసుకు ముగ్గురు సోదరులు, ఒక సోదరి. సోదరి పేరు ఆండాల్ అమ్మాళ్. తల్లి సంప్రదాయక వైష్ణవానికి చెందిన వ్యక్తికావడం వల్ల కావచ్చు పిల్లలందరికి అసలు సిసలైన వైష్ణవ పేర్లను పెట్టడం జరిగింది. లక్ష్మీనరసుకు ముగ్గురు సోదరులు. వారి పేర్లు : కృష్ణస్వామి, రామానుజం, భాష్యం. నరసు అన్నది నరసింహానికి పొట్టి పేరుగా భావించాలి. లక్ష్మీనరసుకు ఇద్దరు సోదరులైన రామానుజం, భాష్యం ఒక రైలు దుర్ఘటనలో

మరణించారు. లక్ష్మీనరసు రుక్మిణి అమ్మాళ్‌ను పెండ్లి చేసుకొన్నాడు. వీరికి కలిగిన పది మంది సంతానంలో ఇద్దరు మాత్రమే మిగిలారు. కూతురు పేరు వీరలక్ష్మి. కొడుకు వెంకట్ పారిస్‌లో విద్యనభ్యసిస్తున్నప్పుడు చనిపోయాడు. పుత్ర శోకాన్ని తట్టుకోలేక ఆ తరువాత రుక్మిణీ అమ్మాళ్ చనిపోయింది. రుక్మిణీ అమ్మాళ్ సంఘ సేవకురాలుగా రాణించింది. కూతురు వీర లక్ష్మికి సంబంధించిన విషయాలు ప్రస్తుతం తెలిసి రావడం లేదు. భవిష్యత్తులో పరిశోధకులు తెలుసుకోగలరని ఆశిద్దాం.

1925లో చెన్నై పెరంబూర్‌లోని బౌద్ధ ఆరామమంలో రామరత్నం అమ్మాళ్‌ను నరసు పెండ్లి చేసుకున్నాడు. ఆచార్య లక్ష్మీనరసు పేరు చివర నాయుడు అన్న మాట ఉండేది. కుల వ్యవస్థకు వ్యతిరేకి కావడం వల్ల తన పేరు నుండి 'నాయుడు'ను తొలగించుకున్నాడు. మద్రాసు విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న మద్రాసు క్రిస్టియన్ కళాశాల నుండి భౌతిక శాస్త్రం(Physics)లో బి.ఎ. పట్టాను పొందాడు. అప్పుడు ఆయన వయసు 20 సంవత్సరాలు. తన బి.ఎ. పట్టాతో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితుడయ్యాడు. భౌతికశాస్త్రంతో పాటు రసాయనశాస్త్రాన్ని బోధించేవాడు. ఇంత పిన్న వయసులో బి.ఎ. పట్టాను పొందడం అన్నది అప్పట్లో కనివిని ఎరుగని విషయం. తన హేతువాద (Radical) భావజాలం కారణంగా మతపరమైన మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో కొనసాగలేక పోయాడు. ఆ తరువాత కొంత కాలంపాటు తిరుచిరాపల్లి బిషప్ హేబర్ కళాశాలలో పనిచేశాడు. అది సరిపోక సామాన్య హిందువుల కోసం అప్పటికే ఏర్పడిన పచ్చియప్ప కళాశాలలోని భౌతికశాస్త్ర శాఖలో పనిచేశాడు. 16 సంవత్సరాల సుదీర్ఘ సేవ తరువాత 1925లో పదవీ విరమణ చేశాడు.

లక్ష్మీనరసు 1892-94వ సంవత్సరపు జాగీర్‌దార్ ఆఫ్ ఆరణి బంగారు పతకాన్ని సంయుక్తంగా పొందాడు. ఖచ్చితమైన శాస్త్రాలను (Exact Sciences) ఇతడు ఎక్కువగా ఇష్టపడే వాడు. భౌతిక శాస్త్రానికి సంబంధించిన ఇతడి పరిశోధక వ్యాసాలు ప్రపంచంలోని అన్ని సైన్స్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యేవి. యూరోప్, బ్రిటన్‌కు చెందిన అనేక విద్వాంసులను శాస్త్రపరమైన చర్చలలో ఇతడు సులభంగా ఓడించాడు. రసాయన శాస్త్రంపై ఇతడు రచించిన పాఠ్యపుస్తకం ప్రాథమిక విజ్ఞానం (Elementary Science)ను గురించి ప్రముఖ మానవ హక్కుల సక్రియ కార్యకర్త శ్రీ మంగేష్ దహీవాలా ఇలా ప్రశంసిస్తున్నారు. "ఇటీవల నేను ఆచార్య లక్ష్మీనరసు ద్వారా రాయబడ్డ పాఠ్యపుస్తకం 'ప్రాథమిక శాస్త్రం'ను కనుగొన్నాను. ఇదొక అద్భుతమైన పాఠ్య పుస్తకం. రసాయన శాస్త్రాన్ని దానికి తగ్గ ప్రయోగాలతో అరటిపండు వొలిచినంత సులభంగా విశ్లేషించారు. విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు తప్పక చదవ

## ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం పుస్తకంలోని ఏరిన ముత్యాలు

- బౌద్ధాన్ని ఒక మతంగా కాకుండా తత్త్వశాస్త్రపు పద్ధతిగా, ఆచరణీయమైన నీతిశాస్త్రంగా పరిగణించాలి.
- బౌద్ధంలో జ్ఞాన జన్యం కాని నమ్మకాలు లేవు.
- నిన్ను నీవు విశ్వసించకు. నీవు పూర్తిగా నాపైనే ఆధారపడి ఉండాలని బుద్ధుడు ఉపదేశించలేదు.
- దుఃఖము, బాధ నుంచి విముక్తి పొందాలన్నదే బౌద్ధ మతపు లక్ష్యం.
- తీక్షణమైన మద్యపానం నుంచి జనులు దూరం జరగాలని ఆదేశించిన తొలి మతము బౌద్ధం.
- మైత్రి విశ్వ ప్రేమలే బౌద్ధపు ప్రాథమిక భావనలు.
- మనిషి స్వభావ సిద్ధంగా దుష్కర్ముడని బౌద్ధం బోధించదు.
- బంగారం, భస్మంల మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఈ విధమైన తేడా బ్రాహ్మణుడు, చండాలుడి మధ్యలేదు.
- బౌద్ధులలో జాతి భేదం లేదు.
- కులం, జాతి శ్రేష్టత్వం అన్నది కేవలం కల్పన మాత్రమే.
- కులం అనే అడ్డు గోడను కూలద్రోసి మానవత్వ సమానతను బౌద్ధం బోధించింది.
- బౌద్ధం వైయక్తిక స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించే మతం.
- ఏ విధమైన నైరాశ్య భావనకు బౌద్ధంలో చోటు లేదు.
- మనిషిని హేయనీయమైన వ్యక్తిగా కాకుండా తనదైన స్వతంత్ర వ్యక్తిత్వమున్న మనిషిగా తీర్చిదిద్దేది అసలు సిసలైన మతం. అదే బౌద్ధమతం.
- బౌద్ధులకు జీవితం అటు ఆకర్షణీయమైన రోజా కాదు. ఇటు మురికి నారబట్ట కాదు.

వలసిన పాఠ్య పుస్తకం' అని పేర్కొన్నాడు.

తన హేతువాద భావ జాలం కారణంగా, అప్పట్లో ప్రారంభదశలో ఉన్న వితంతు టెలిగ్రాఫీ(Wireless Telegraphy) గురించి తెలుసుకోవాలన్న తపన కారణంగా గతిశాస్త్రం (Dynamics)లో అతనికున్న పరిజ్ఞానం కారణంగా అతడు ఆకాలంలో ఉన్న మేధావులలో ఒకడుగా గుర్తింపబడ్డాడు. విజ్ఞాన శాస్త్రంతోపాటు సమాజము, కళలు, చరిత్ర, సంస్కృతి, మతము, తత్త్వశాస్త్రం ఇత్యాదులలో అతడికి అభిరుచి మెండుగా ఉండేది. ఆంగ్లం, ఫ్రెంచ్, తమిళం, తెలుగు, సంస్కృతం, జపనీసు, పాలీ భాషలపై అతడికి మంచి పట్టు ఉండేది. అతడి సుప్రసిద్ధ రచన 'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం'

(The Essence of Buddhism) బౌద్ధం పట్ల అతనికున్న అభినివేశానికి అద్దం పడుతుంది. శ్రీయుతులు వి.పి.యస్. మోనియర్, పెరుంబాయి మానిక్కమ్‌లతో కలసి తమిళంలో పుస్తకాలు రాసాడని నిధిశోభన (NIDHIN SOBHANA) మహాశయుడు తెలియజేస్తున్నాడు.

'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' పుస్తకానికి ముందుమాట రాస్తూ, శ్రీ అనగారిక హెచ్.ధర్మపాల (ANAGARIKA DHARMA-PALA) పోకల లక్ష్మీనరసు ప్రతిభను ఇలా పొగిడారు "ఈ పుస్తకం రచయిత ఒక విజ్ఞాన శాస్త్రవేత్త అయినందుకు మన దృష్టిని ఆకర్షిస్తాడు. ఆచార్య లక్ష్మీనరసు పాశ్చాత్య సంస్కృతి పరమైన ఉత్పత్తి (a product of western culture). ఇతడు ప్రాచీన ద్రవిడ పరివారానికి చెందిన వారసుడు (SCION). యూరోపియన్ గురువుల పర్యవేక్షణలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన వ్యక్తి. ప్రస్తుతం మద్రాసు మహానగరంలోని మొదటి శ్రేణిదైన పచ్చియప్ప కళాశాలలో ఆచార్యుడుగా పనిచేస్తున్నాడు. శాస్త్రీయపరమైన సత్యాలతో మతంలోని మూఢ నమ్మకాలను చక్కటి తర్కంతో ఖండించిన వ్యక్తి (Mahabodhi H.D. Isipatana, Saranath, Benaras, Apri1 28, 1907) మన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ లక్ష్మీనరసు గుణగణాలను పొగడుతూ "ఆచార్య పోకల లక్ష్మీనరసు యూరోపియన్ల అహం కారాన్ని తన దేశ భక్తి భావాలతో తూలనాడాడు. సనాతన హిందుత్వ భావాలను వీరోచితంగా ఎదిరించాడు. జాతీయ దృక్పథంతో కపట పూరితమైన బ్రాహ్మణతత్వాన్ని, బుద్ధి కుశలత తో దూకుడుతనంతో కూడిన క్రైస్తవమతాన్ని తీవ్రంగా విమర్శిం చాడు. బుద్ధుడి బోధనలతో ప్రేరణ పొంది కష్ట సాధ్యమైన పను లను చేశాడు. (ఆచార్య లక్ష్మీనరసు రచించిన 'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' మూడవ ముద్రణకు, 1948లో రాసిన ముందుమాట) ఈ పుస్తకం జపానులో మంచి ప్రజాదరణను పొందింది. చెకోస్లోవియా (Czechoslovia) విదేశాంగ మంత్రి జీన్ మాసరిక్ (Jean Masaric) 1916లో ఈ పుస్తకాన్ని అనువదించి ఆ దేశపు దారిదీపంగా దాన్ని పేర్కొన్నాడు. 1907 మొదలు 2019 వరకు ఈ పుస్తకం 53 ముద్రణలను పొందిందంటే అది ఎంతటి గొప్ప రచనో మనకు తెలుస్తుంది.

ఆచార్య పోకల లక్ష్మీనరసు ఆ కాలం నాటి విశ్వవిద్యాలయ ఆచార్యులలాగా సమాజానికి, తన చుట్టూ ఉన్న ఆర్థిక సామాజిక పరిస్థితులకు దూరంగా ఉంటూ 'ఏకాంత వాసాన్ని ఎప్పుడూ కోరుకోలేదని రౌండ్ టేబుల్ కామ్‌కు చెందిన నిధిన్ శోభన తెలియజేస్తున్నాడు. 20వ శతాబ్దపు తొలి చరణంలో ఉధృతంగా సాగిన జాతి, కుల వ్యతిరేక పోరాటంలో ఆచార్య లక్ష్మీనరసు చురుకుగా పాల్గొన్నాడు. బౌద్ధమతం ప్రచారం కోసం నడుము కట్టుకొన్నాడు. చెన్నైలోని పెరంబూర్‌లో ఉన్న దక్షిణ భారత దేశపు బౌద్ధ సంస్థ స్థాపనకు దాని పురోభివృద్ధికి పాటుబడ్డాడు. దక్షిణ భారతదేశానికి చెందిన అనేక సంస్థలతో – సోషియల్ రిఫార్మ్ అసోసియేషన్, మద్రాసు మహా జనసభ, నేషనల్ ఫండ్ అండ్ ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లతో లక్ష్మీనరసుకు ప్రత్యక్ష సంబంధం ఉండేది. బౌద్ధం ఆనాటి బ్రాహ్మణత్వాన్ని ఎదిరించి విజయం సాధించిన మతం అని లక్ష్మీనరసు త్రికరణ శుద్ధిగా నమ్మాడు. ఇదే అవగాహన అంబేద్కర్‌కు కూడా ఉండేదని నిధిన్ శోభన భావిస్తున్నాడు. మిత్రులు టి.సింగారవేలు, అయోథిదాసర్ లతో కలిసి దక్షిణ భారతదేశపు బౌద్ధ అసోసియేషన్‌ను స్థాపించి దాని ప్రారంభోత్సవానికి సారనాథ్‌కు చెందిన అనగారిక ధర్మపాల గారిని ఆహ్వానించాడు.

ఆచార్య లక్ష్మీనరసు బౌద్ధుల జనగణనను చేపట్టాడు. అతని జనగణన ద్వారా అప్పుడు మద్రాసులో సుమారు 18,000 మంది బౌద్ధులు నివసించే వారని తేల్చాడు. అతడు తన జీవిత కాలంలో బౌద్ధుల నాలుగు మహాసభలను నిర్వహించాడు. మొదటి మహాసభ 1917లో మద్రాసులోని మూరే పెవలియన్, పీపుల్స్ పార్క్(MoorPavilion, People Park), రెండవ మహాసభను 1920లో బెంగళూరులో, 1928లో మూడవ సభను మద్రాసులో, నాల్గవ మహాసభ కోలారు గోల్డ్‌ఫీల్డ్ లోని తిరుపత్తూరు (Tirupathur)లో జరిపాడు. ఇతడు శ్రీలంకను సందర్శించాడు. అక్కడే బహిరంగంగా బౌద్ధాన్ని స్వీకరించాడు. 1934 జూలై నెల 14వ తేదీన గుండె సంబంధమైన సమస్య కారణంగా తుది శ్వాసను మద్రాసులో తీసుకున్నాడు. మద్రాసు మైలాపూర్‌లోని స్మశాన వాటికలో బౌద్ధ సంప్రదాయం ప్రకారం అగ్ని సంస్కారం జరిగింది.

ఆచార్య పోకల లక్ష్మీనరసు పి.యల్.యన్‌గా పిలవబడేవాడు. బౌద్ధానికి సంబంధించిన నాలుగు పుస్తకాలను ఇతడు రచించాడు. బహుళ ప్రచారం పొందిన 'దిఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' పుస్తకం 1907లో ప్రచురింపబడింది. 'వాట్‌ఈజ్ బుద్ధిజం' (What is Buddhism) 1916లో అచ్చయ్యింది. రాజకీయంగా, విద్యా రంగంలో లబ్ధ ప్రతిష్ఠితులుగా వెలుగుతున్న తరుణంలో 'దిస్టడీ ఆఫ్ కాస్ట్' (The Study of Caste) ముద్రించబడింది. చనిపోవడానికి 12 ఏండ్ల ముందు అతడి ఈ పుస్తకం వెలుగుచూసింది. అప్పుడు ఆచార్య పోకల వయసు 61 సంవత్సరాలు. ఆ పుస్తకానికి రాసిన ముందుమాటలో This book is based on articles originally contributed to social reform. Caste organization crushes the individual under its dead weight and hinders progress by killing all consciousness of liberty. 367 mint street - PLN Narasu.

2nd January1922. అని ఉంది. (Printed at the Vavilla Press, Madras, 1922) నరసు లేవనెత్తిన అంశాల ఋజువును మనం ఈ.ఏ.హెచ్ బ్లంట్ (EAH Blunt) పుస్తకం The caste System of North Indiaలో చూడ వచ్చు. ఈ పుస్తకం మొదటిసారి 1931లో ప్రచురితమైంది. తన పుస్తకంలో ఆచార్య పోకల ఈ క్రింది విషయాలను చర్చించాడు. "బ్రాహ్మణులు అన్ని వృత్తులలోనూ పాల్గొన్నారు. వారికి ఏ వృత్తి నిషేధం కాదు. వేద పారాయణంతోపాటు వారు రాజులుగా పట్టాభిషిక్తులయ్యారు. వారిలో వ్యాపారస్తులు, సైనికులు, వ్యవ సాయదారులు ఉన్నారు.

ఇరాన్ వారి అవేస్టా (AVESTA), వేదాల భాషలో సామ్యం ఉంది. మనకున్న వర్ణ వ్యవస్థ ఇరాన్ లో కూడా ఉంది. వారిని అధర్వాలు (పురోహితులు) యుద్ధవీరు లు, వ్యవసాయదారులు (Husbandmen) చేతి పనివారలు (Artisan)గా విభజించారు. యజ్ఞోపవీతం వారికి, వారి ఆచా రాలలో అతి ముఖ్యమైనది. "ఆచార్య పోకల వారి ఈ పుస్తకం కూడా 12కు పైగా ముద్రణలకు నోచుకుంది. ఇది భారతదేశపు ఆధునిక బౌద్ధపు అతి విలువైన (Apriceless Product of the Modern Buddhism in India) పుస్తకంగా గుర్తింపు పొందింది. ఆచార్య పోకల నాల్గవ పుస్తకం పేరు 'ది రిలిజన్ ఆఫ్ మాడర్న్ బుద్ధిస్ట్' (The Religion of Modern Buddhist). ఈ పుస్తకం వ్రాతప్రతి (manuscript) అంబేద్కర్ దగ్గరుండేది. దక్షిణ భారతదేశపు బౌద్ధానికి చెందిన ఆధునిక ప్రచారకుడైన జి.అలైసియస్(G.Aloysius) ఈ వ్రాత ప్రతిని సంపాదించాడు. ఈ వ్రాతప్రతి నకలు వసంత్ మూన్(Vasanth Moon) వారి వద్ద ఉండేది. జి.అలైసియస్ ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించి 2002లో దీన్ని ప్రచురించారు. వర్డ్స్ స్మిత్(Word- Smith) వారు దీన్ని ప్రచురించారు. 318 పేజీలున్నాయి.

"ఇటీవల కాలంలో నేను ఆచార్య పోకల లక్ష్మీనరసు ద్వారా రాయబడిన రెండు ముఖ్య వ్యాసాలను చూడడం జరిగింది. ఈ వ్యాసాలు ఆచార్య పోకల చనిపోవడానికి ఒక సంవత్సరం ముందు రాశాడు. ఈ వ్యాసాలు తంద్రై రామస్వామి నాయకర్ పెరియార్ ద్వారా, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంతో సంబంధం ఉన్న ఆంగ్ల వార పత్రిక రేషనలిస్ట్ (Rationalist) పత్రికలో ప్రచురితమయ్యాయి. మొదటివ్యాసం ఇండివిజ్యులిజమ్ (Individualism) 1933 అక్టోబర్ 21వ సంచికలో ప్రచురిత మైంది. రెండవ వ్యాసం అదే పత్రిక 1935 అక్టోబర్ 28, సంచికలో అచ్చైయింది. ఈ వ్యాసం శీర్షిక ఫ్రీ ఎన్క్వయిరీ (Free Enquiry) ఈ పత్రిక సంపాదకుడి పేరు యస్. రామనాథన్. ఈ పత్రిక ప్రతి శనివారం వెలువడేది.

అప్పట్లో దాని ధర ఒక అణా (డాక్టర్ బీ.ఆర్.అంబేదర్కర్ కారవాన్ పోస్ట్, 30 డిసెంబర్, 2012) "ఆచార్య పోకల లక్ష్మీనరసు దక్షిణ భారతదేశపు అనుభవజ్ఞుడైన హేతువాది. ఉత్తమమైన విద్యావేత్త. స్వతంత్ర ఆలోచనలను ప్రోత్సహించిన వ్యక్తి. ఏ మాత్రం రాజీపడకుండా మతాన్ని వ్యతిరేకించిన సమరయోధుడు" అని ది రేషనలిస్ట్ వారపత్రిక (అక్టోబరు 21, 1933 సంపాదకుడు. యస్. రామనాథన్ అభివర్ణించాడు. ఆచార్య పోకల లక్ష్మీనరసు మన తెలుగుతేజం. తెలుగువారు గర్వించవలసిన జ్ఞాని. ఇతని ప్రతిభను గుర్తించి ప్రభుత్వం తప్పక గౌరవించాలి. ❑

# మానవీయ పునర్వికాసమే దేశభక్తి

**(17వ పేజీ తరువాయి)**

పద్యాలను వెలికి రానివ్వలేదు. స్వయంగా గురజాడ కుమారుడు రామదాసు పేర్కొన్నట్టు ఆనాడు కమ్యూనిస్టులు ఒక బాధ్యతగా తీసుకుని ఆయన సాహిత్యాన్ని వెలికి తీసి ప్రచురించారు. మాకినేని బసవపున్నయ్య, పులుపుల శివయ్య తదితరులు ప్రత్యేకంగా వారి కుటుంబాలను కలిసి పాత రికార్డులు తీయించి పుస్తకాలుగా ప్రచురించారు. అవసరాల సూర్యారావు శారీరక లోపం వున్నప్పటికీ శ్రమపడి గురజాడ రచనలను పరిష్కరించి ప్రచురించారు. ఆనాటి ప్రజాశక్తి, తర్వాత విశాలాంధ్ర ప్రచురణాలయాలు ఆయన సంపుటాలు తీసుకొచ్చాయి. యువజన సంఘాలు గ్రామాల్లో దేశభక్తి గీతాన్ని పాడటం, పూర్ణమ్మ కథను బుర్రకథగా మలిచి ఊరూరా చెప్పడం గొప్ప ప్రభావం చూపించాయి.

నాజర్ పూర్ణమ్మ ఖండికను బుర్రకథగా మలచారు. కమ్యూనిస్టులు ఇవన్నీ హైజాక్ చేస్తున్నారంటూ 'కామ్రేడ్ గురజాడ' అని పాలకవర్గాలు ఎగతాళి చేయడమే కాదు. ప్రముఖ సంపాదకులైన నార్ల వెంకటేశ్వరరావు వంటివారు కూడా 1955 ఎన్నికల వేళ నాటి పత్రికల్లోనే రాశారు. వీటన్నిటినీ అధిగమించి గురజాడ వారసత్వాన్ని ముందుకు నడిపిన ప్రగతిశీల శక్తులే ఇప్పుడూ ఆయన సందేశాన్ని చాటు తున్నాయి. ఎవరి కోసం తన ఉద్యమాన్ని వదులుకోనని ప్రకటించిన ఉక్కు సంకల్పం ఆయన స్వంతం. దేశభక్తితో పాటు ప్రజాస్వామ్యం. ఆధునిక కవిత్వం, ప్రేమ, స్త్రీ సమానత, సంఘ సంస్కరణ వంటి ఎన్నో ఉదాత్త వినూత్న భావాలను నిర్వచించి నిర్వహించి వెళ్లిన గురజాడ ఒక వెలుగు జాడ. ❑

# నవంబర్ 24న 'ఎవల్యూషన్ డే'ని జరుపుకుందాం!



- డాక్టర్ దేవరాజు మహారాజు

ఇంగ్లీష్ నేచురలిస్ట్ ఛార్లెస్ డార్విన్ తన జీవపరిణామ సిద్ధాంతాన్ని (ON THE ORIGIN OF SPECIES) ప్రకటించిన రోజు 24 నవంబర్ 1859 – ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబరును 'ఎవల్యూషన్ డే'గా ప్రపంచ దేశాలన్ని జరుపు కుంటున్నాయి. దీన్ని పెద్దఎత్తున మన దేశంలో జరపడం చాలా అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలపడాలని చెప్పిన భారత తొలి ప్రధాని నెహ్రూ స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్న – ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యల్ని తిప్పికొట్టడానికి సామాన్య ప్రజలు వివేకవంతులై ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి ! జీవ పరిణామ సిద్ధాంతం (THEORY OF EVOLUTION) పనికి రానిదని ప్రభుత్వం–సిలబస్ నుండి తొలగించింది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశ పెడతామంటోంది. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.

1909లో డార్విన్ శత జయంతి, అర్ధ శత వర్ధంతి సందర్భంగా నూట అరవై ఏడు దేశాల నుండి నాలుగు వందల మంది ప్రముఖ శాస్త్రవేత్తలందరూ కేంబ్రిడ్జిలో సమావేశమై పెద్ద ఎత్తున డార్విన్‌కు నివాళులర్పించారు. ఆయన జీవశాస్త్రంలో చేసిన కృషిని శ్లాఘించారు. సామాన్య జనంలో డార్విన్ గూర్చి అవగాహన పెరగడానికి, ఆయన పరిణామ సిద్ధాంతాన్ని వారికి పరిచయం చేశారు.

న్యూయార్క్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ – అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీలోనూ, రాయల్ సొసైటీ ఆఫ్ న్యూజిలాండ్ లోనూ, జరిపిన కార్యక్రమాలకు అనూహ్యంగా పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో నవంబరు 24–28 మధ్య డార్విన్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు. 2009లో 'బిబిసి డార్విన్ సీజన్' శీర్షికతో బిబిసి టెలివిజన్/ రేడియో కార్యక్రమాలు నిర్వహించింది. ఎందుకంటే అది డార్విన్ ద్విశత జయంతి. పైగా, డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడి 150 ఏండ్లయింది. ఇలా ప్రపంచ దేశాల్లో జరిగిన, జరుగుతున్న కార్యక్రమాలు చాలానే ఉన్నాయి. ఇలాంటివి మన దేశంలో ఎన్ని జరిగాయి? అనేది ఆలోచించుకోవాలి !

ఈ విషయాల్లో మన దేశ పరిస్థితులు మరీ దిగదుడుపుగా ఉన్నాయి. మతపరమైన పండుగలకు స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు సెలవులిస్తూ అర్థరహితమైన పండుగల్ని ప్రభుత్వాలు ప్రమోట్ చేస్తున్నాయి. కుటుంబాలలో జరిగే పూజలు, పునస్కారాలు, ఆచారాలు, సంప్రదాయాల వల్ల యువతరం మెదళ్లు కలుషితం అవుతున్నాయి. దేవుళ్ల శోభాయాత్రల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం దొరుకుతోంది. వివేక వంతమైన, అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యా సంస్థల్లోగాని, పౌర సమాజాల్లో గానీ, కుటుంబాల్లో గానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా ? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్సు కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతులైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని–దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికి వారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. వట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి.

విద్యా సంస్థల్లో పని చేసే వారిపై బాధ్యత మరింతగా ఉంది. విద్యార్థులకు జీవపరిణామంపై, డార్విన్‌పై, సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన/ ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. భావి భారత పౌరులు వారే గనక, మనం వారి మీదే శ్రద్ధ పెట్టాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి. మానవవాదులుగా తీర్చిదిద్దుకోవాలి. చేస్తున్న కార్యక్రమాలతో మనం మరొకరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి ! సైన్స్ డే (28, ఫిబ్రవరి), పర్యావరణ పరిరక్షణ దినం (5 జూన్), డార్విన్ డే(12 ఫిబ్రవరి), ఎవల్యూషన్ డే (24 నవంబర్), క్రైండ్ నెస్ డే(13 నవంబర్) – హ్యూమనిస్ట్ డే (21 జూన్), ఎర్త్ డే (24 ఏప్రిల్), సైంటిఫిక్ టెంపర్ డే (20 ఆగస్టు)–ఫిలాసఫీ డే (నవంబరులో మూడో గురువారం), ఉమెన్స్ డే (8 మార్చి), చిల్డ్రన్స్ డే (14 నవంబరు) వంటివి విద్యా సంస్థల్లో తప్పక నిర్వహిస్తూ ఉండాలి. విద్యార్థుల అవగాహన స్థాయి పెంచడానికి ఆయా విషయాలు ఇతివృత్తంగా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేయాలి. వీటితోపాటు సంవిధాన్ దివస్ (Constitution Day 26 నవంబరు) కూడా తప్పక జరుపుతూ ఉండాలి. ప్రస్తుతం మతాలకున్న ప్రాముఖ్యాన్ని తగ్గించి వైజ్ఞానిక దృక్పథం,

హేతువాదం, మానవవాదం నిత్యజీవితంలో భాగమైపోయేట్లుగా చేస్తూ ఉండాలి.

ఎవరి వ్యక్తిగత విశ్వాసాలనో దెబ్బ తీయాలని మనం అనుకోవడం లేదు. అవి వాటి పరిధిలో ఉంటే సంతోషిద్దాం– అంతే! మత విశ్వాసాలెప్పుడూ వ్యక్తిగత స్థాయిలో ఉండాలి. అంతేగాని, వికృతంగా సమాజ స్వరూపాన్ని మార్చేంత దుర్మార్గంగా ఉండకూడదు. అయితే, మత విశ్వాసకులతో ప్రపంచం ప్రగతి పథాన నడవలేదని మాత్రం కచ్చితంగా చెబుదాం! మనుషులంతా ఒక్కటి అని తెలుసుకున్న వాళ్లం గనుక, విశ్వాసకుల్ని, అవిశ్వాసకుల్ని అందరిని సమానంగా గౌరవిస్తాం. అయితే విశ్వాసకులు తమ అంధ విశ్వాసాల్ని వదిలేసి మానవవాదులుగా మారితే వారిని మరింతగా గౌరవిస్తాం. సైన్సు కార్యకర్తలంతా ఆ పనుల్లో అవిశ్రాంతంగా పనిచేస్తూనే ఉండాలి. చంద్రయాన్–3 విజయవంతమైందని, అందుకు కారణం తనే అన్నట్టు అనవసరంగా ఆ సందర్భంగా ఆన్‌లైన్‌లో దేశ ప్రజలకు కనపడి, భారతీయ మువ్వన్నెల జెండా ఊపిన నేటి ప్రధాని మోదీ చేసిన నిర్వాకం ఈ దేశ ప్రజలు గ్రహించాలి.

ఇస్రో శాస్త్రవేత్తల జీతాల్లో కోతలు విధించడం గురించి – ఇస్రోకు ముడిసరుకు అందించిన వేల మంది సాంకేతిక నిపుణులకు, కార్మికులకు జీతాలివ్వకపోవడం గురించి – ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. వారంతా పొట్ట పోసుకోవడానికి రోడ్లమీద టీలు, టిఫిన్లు అమ్ముకోవడం, బయట మెకానిక్‌లుగా, డ్రైవర్లుగా పనిచేయడం గురించి – ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని శ్లాఘించకుండా, దాన్ని తన ఎలక్షన్ ఎజెండాలో చేర్చుకోవడం గురించి – ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. పైగా, పురాతన భారతీయ విమానయాన శాస్త్రంలో ఇవన్నీ రాసిపెట్టే ఉన్నాయని అబద్దాలు ప్రచారం చేసుకుంటూ ఉండడం గురించి – ఈ దేశ ప్రజలు తప్పక తెలుసుకోవాలి. ఇది నేటి శాస్త్రవేత్తల కృషిని, స్థాయిని తగ్గించినట్లుగా ఉందన్న విషయం తెలుసుకుని ఈ దేశ ప్రజలు కలత చెందాలి ! ఈ అంశాల గూర్చి సీరియస్‌గా ఆలోచించాలి. అర్థం చేసుకోవాలి. ఈ విషమ పరిస్థితుల్లోంచి బయటపడే మార్గాల్ని అన్వేషించుకోవాలి.

రాబోయే కాలాలలో విద్యావంతులతో, ముఖంగా వైజ్ఞానిక పిపాస గల వివేకవంతులతో ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసుకునే విధంగా చూసుకోవాలి. ఆ మధ్య కర్నాటకలో ప్రజాసంఘాలు నిర్వహించిన పాత్రను ఆదర్శంగా తీసుకుని, ఇతర రాష్ట్రాలలో కూడా ప్రజా సామాజిక–విద్య–వైజ్ఞానిక సంఘాలు చైతన్యవంతంగా కదలాలి. తప్పదు– దేశం వేల ఏండ్లు వెనక్కి వెళ్లాలంటే ఎవరూ ఏమీ చేయనక్కరలేదు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ఆ పని సజావుగా చేస్తూనే ఉంది. లేదు– దేశం ప్రగతి ప్రధాన నడవాలంటే మాత్రం దేశ పౌరులందరూ సమైక్యంగా కదలాలి. ఈ మాట నేను అంటున్నది కాదు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లే అలా చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున రోడ్ల మీదికి రావాలని చెప్పారు. అంతే కాదు, తను ప్రజల వెంటే ఉన్నానని కూడా ధైర్యం చెప్పారు. 'నిన్ను నువ్వు తెలుసుకో' అని దేవుణ్ణి ధ్యానిస్తూ కండ్లు మూసుకోవడం కాదు, నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు – అన్నది తెలుసుకుంటే – నీ కండ్లు తెరుచుకుంటాయి! ఎన్నెన్ని మానవ జాతులు ఉద్భవించి అంతరించాయి.

ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వున్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, తప్పదు జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ భగవంతుడి సృష్టిలో నీ పుటక ఒక భాగమని నువ్వింకా భావిస్తూ ఉంటే గనక, నీ మెదడులో చీకటి తొలగిపోలేదని అర్థం. చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీలేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునే వారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మతమౌఢ్యాన్ని చావు దెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం ఎవల్యూషన్ డే' జరుపుకుంటారు. ఎక్కడి పాట అక్కడ పాడటం, అధికారం కోసం నానా గడ్డి కరవడం రాజకీయ నాయకులకు అలవాటు. శాస్త్రవేత్తలు అలా చేయరు. ఒక నిబద్ధతతో, నిజాయితీగా, నిజాల్ని మాత్రమే వెల్లడిస్తారు. అలాంటి వారిలో మహోన్నతుడు చార్లెస్ డార్విన్. ఆయన మతాలకున్న విలువను తగ్గించాలనుకోలేదు. మూఢ నమ్మకాల్ని నిర్మూలించగలనని కూడా అనుకోలేదు.

ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతమే కాలక్రమంలో ఆ పనులు చేస్తూ వచ్చింది. అందుకే సంప్రదాయ వాదులకు డార్విన్ అన్నా, డార్విన్ సిద్ధాంతమన్నా పడదు. వారు సృష్టి/ దైవ సిద్ధాంతం కావాలనుకుంటారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న వారి పాలసీ కూడా అదే! సిలబస్ నుండి 'ఎవల్యూషన్' ఛాప్టర్ తొలగిస్తున్నారని తెలియగానే, హైద్రాబాదులో పెద్దపెద్ద విద్యా సంస్థల్లో జెవివి వారు ఎవల్యూషన్ మీద నా లెక్చర్స్ ఏర్పాటు చేశారు. నేను కూడా సంతోషంగా వెళ్లి ఉపన్యసించి వచ్చాను. సిలబస్ నుండి తీసివేయగానే పిల్లలు ఇక ఏ రకంగానూ నేర్చుకోలేరన్న భ్రమలో ప్రభుత్వం వారుంటే – ఉండనివ్వండి. బాధ్యత గల పౌరులుగా మన పిల్లలకు మనం, ఏం నేర్పుకోవాలో మనకు తెలుసు కదా ? ప్రభుత్వాలు తాత్కాలికం – వైజ్ఞానిక స్పృహే శాశ్వతం ! అందువల్ల మనం, వీలైనన్ని ఎక్కువగా వైజ్ఞానిక కార్యక్రమాలు అనిస్థాయిల్లో నిర్వహించు కుంటూనే ఉండాలి! ❑

# చరిత్రను విస్మరించిన వందేమాతరం వివాదం!

- సుబ్రత ముఖర్జీ

**భా**రత స్వాతంత్ర్యోద్యమ చారిత్రక చిహ్నమైన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతం విరచితమై 150 సంవత్సరాలైన సందర్భంగా కొనసాగుతున్న వివాదం నిరర్థకమైనది. చరిత్రను విస్మరించి వ్యాఖ్యలు చేయడం సరికాదు. 1937లో జరిగిన ఎన్నికలలో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల నేర్పాటు చేసింది. అయితే బెంగాల్‌లో ముస్లిం లీగ్ నాయకుడు ఎ.కె.ఫజ్లుల్ హక్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేర్చుకునేందుకు ఫజ్లుల్ హక్ సుముఖత చూపినా అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వం నెలకొనడంతో బెంగాల్‌లో హిందూ-ముస్లిం వర్గాల మధ్య రాజకీయంగానూ, సామాజికంగానూ విభేదాలు తీవ్రమయ్యాయి. జాతిని దైవిక మాతృమూర్తిగా వ్యక్తీకరించిన వందేమాతరం గీతంలోని హిందూ ప్రతీకవాదం, దుర్గామాత ప్రస్తుతికి వ్యతిరేకంగా ముస్లిం నాయకులు ఆందోళన చేస్తున్న రోజులవి. వందే మాతరంను జాతీయగీతంగా స్వీకరించకూడదనేది ముస్లింల డిమాండ్. దేశవ్యాప్తంగా మత సామరస్యాన్ని దెబ్బ తీసే అవకాశమున్నందున ఈ వివాదంలో జోక్యం చేసుకోవడం జాతీయ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి అనివార్యమైంది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) రవీంద్రనాథ్ టాగూర్‌ను సంప్రదించింది. వందేమాతరం గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయగీతంగా ఆలపించవచ్చని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ విశ్వసించే అహింసా సిద్ధాంతం, లౌకికవాద విలువలకు వందేమాతరం గీతం పూర్తిగా విరుద్ధమైనందున National Anthemగా స్వీకరించేందుకు అది యోగ్యమైనది కాదని కృష్ణ కృపలానీ (రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, టాగూర్ స్వంత మనుమడు) అక్టోబరు 1937 'విశ్వభారతి న్యూస్'లో రాసిన ఒక వ్యాసంలో వాదించారు. 1896లోనే వందేమాతరం గీతానికి స్వరరచన చేసిన రవీంద్రుడు తన 70వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆ గీతంపై ఆలోచనాత్మక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'వందేమాతరం' బదులుగా Vande Vratanam (వందే వ్రతనం)ను పాటించాలని అంటే మాతృభూమికి, మానవాళికి సేవ చేసే 'ప్రతిజ్ఞ'కు నిబద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వందేమాతరంలో దుర్గా మాతను స్తుతించే శ్లోకాలు ఉన్నందున ముస్లింలు ఆ గీతాన్ని జాతీయగీతంగా అంగీకరించేందుకు ఒప్పుకోలేదు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం ఒక విడదీయరాని భాగంగా ఉన్నందున వందేమాతరం National Anthem అయ్యేందుకు అర్హమైనది అని సదాచార హిందువులు, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నవారు విశ్వసించారు. బంకించంద్ర గేయంపై తన అభిప్రాయం చెప్పాలని రవీంద్రనాథ్ టాగూర్‌ను సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగతంగా కోరారు. 'సాహిత్య రచన అయిన 'ఆనందమఠ్' నవలలో వందేమాతరం ఉండడం సముచితమేనని, అయితే దానిని జాతీయగీతంగా స్వీకరించడం సరికాదని రవీంద్రుడు స్పష్టం చేశారు. "వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు.

ఈ విషయమై ఎటువంటి చర్చ అవసరం లేదు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూ దేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృ భూమిని ఒక హిందూ దేవతగా ఆరాధిస్తాడని భావించలేము. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. ఆ గీతాన్ని దుర్గామాత స్తుతిస్తోత్రంగా సదరు పత్రికల సంపాదకులు భావిస్తున్నారనేందుకు అదే నిదర్శనం. 'ఆనందమఠ్' సాహిత్య రచన గనుక అందులో వందేమాతరం గీతం ఉండడం సముచితమే అయినప్పటికీ సకల మతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలాపించడం సరికాదు. అందుకు సర్వజనామోదం ఉండదు' అని సుభాష్ బోస్‌కు రాసిన లేఖలో టాగూర్ పేర్కొన్నారు. సుభాష్ బోస్ ఈ వివాదంపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. వందే మాతరంపై ఆయన మౌనం ఆ గీతం మద్దతుదారులను నిరాశపరిచింది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో కలకత్తాలో సమావేశమైంది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఆచార్య జేబీ కృపలానీ మొదలైన వారందరూ ఆ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ సమావేశాలలో ఆలపించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఆ గీతంపై ముస్లిం దృక్కోణాన్ని కాంగ్రెస్ అంగీకరించిదని ఆ నిర్ణయం స్పష్టం చేసింది. కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ హిందువులకు ఆశాభంగం కలిగించిందని శరత్ బోస్ (సుభాష్ అన్నయ్య) అన్నారు. మహారాష్ట్రలో సైతం

కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. National Anthemను ఎంపిక చేసేందుకు మౌలానా ఆజాద్, నెహ్రూ, సుభాష్, ఆచార్య నరేంద్రదేవ్‌లతో కాంగ్రెస్ ఒక కమిటీని ఏర్పాటుచేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ కమిటీకి సలహాదారుడు. సుభాష్‌బోస్‌కు రవీంద్రుడు రాసిన ఒక వ్యక్తిగత లేఖలో వ్యక్తం చేసిన భావాలను ఉటంకిస్తూ జాతీయగీతంపై ఆయన ఇచ్చిన సలహాపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని జాతీయ వాద పత్రికలు విమర్శించాయి. అయితే సుభాస్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కాంగ్రెస్ నుంచి వెలివేత తరువాత కూడా బోస్ తన తొలి వైఖరికే నిబద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ సంస్థ అని, అన్ని మతాల వారి మనోభావాలను అది గౌరవించవలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. 1938లో బంకించంద్ర ఛటర్జీ శత జయంత్యుత్సవాల సందర్భంగా వందేమాతరం వివాదాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ గీతం మొత్తాన్ని జాతీయగీతంగా ప్రకటించాలనే డిమాండ్ గట్టిగా వచ్చింది. అయితే బోస్ ఈ డిమాండ్‌కు మద్దతునివ్వలేదు. కాంగ్రెస్ నిర్ణయమే ప్రభావశీలంగా ఉండిపోయింది.

జనగణమన గీతం భారతజాతిని సమ్మిళిత దృక్పథంతో దర్శించింది. ఆసేతు హిమాచలం వర్ధిల్లుతోన్న భౌగోళిక (ప్రాంతాలు, పర్వతాలు, నదులు) బహుళత్వాన్ని సూచిస్తుంది. బహుళ మత సంప్రదాయాలు, సంస్కృతుల మహత్వాన్ని వ్యక్తం చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శిస్తూ జాతీయ సమైక్యతా భావాన్ని ప్రోత్సహించే సామర్థ్యం ఉన్నందునే రవీంద్రుని

## తొలి జాతీయ గీతం 1857!

1857 నాటి స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన నానాసాహెబ్ ఆంతరంగిక కార్యదర్శి అజీమ్ ఉల్లాఖాన్. అతను వ్యవహారదక్షుడే గాక గొప్ప యుద్ధ వ్యూహకర్త కూడా. 1857 సంగ్రామ కాలంలో అజీమ్ ఉల్లాఖాన్ 'పయామ్-ఎ-ఆజాదీ' పేరుతో ఒక రహస్య పత్రికను నడిపాడు. అందులో అవధి (లక్నో) ప్రాంతానికి చెందిన సమరయోధుడు మౌల్వీ లియాఖత్ ఆలీ రాసిన గేయం ఒకటి ప్రచురితమైంది. మనం జాతీయ గీత రచయితలుగా ప్రముఖంగా చెప్పుకునే బంకించంద్ర, మహమ్మద్‌ఇక్బాల్, రవీంద్రనాథ్ టాగోర్, గురజాడ, సుబ్రహ్మణ్య భారతి తదితరులు రాసిన గీతాలన్నిటి కంటే ముందుగానే మౌల్వీ లియాఖత్ ఆలీ ఈ గీతాన్ని రాశారు కాబట్టి దీనినే తొట్ట తొలి జాతీయ గీతం అనుకోవచ్చు. గుంటూరు వాసి సయ్యద్ నశీర్ అహ్మద్ రాసిన 'స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం యోధులు' పుస్తకంలో ఈ ఉర్దూ గేయాన్ని తెలుగు అక్షరాలలో ప్రచురించారు.నేడు జాతీయ గీతాలపై చర్చ నేపథ్యంలో ఈ గీతం తెలుగులో..

హిందుస్థాను మన దేశం - దీనికి మనమే వారసులం
పవిత్రమైనది మా దేశం - స్వర్గం కంటే మహాప్రియం
సమస్త సంపద మాదేలే - హిందుస్థాను మనదేలే!
దీని వైభవం దీని ప్రాభవం
వెలుగులు చిమ్మును జగమంతా
అతి ప్రాచీనం ఎంతో ధాటి
దీనికి లేదుర ఇలలో సాటి!
హిందుస్థాను మన దేశం - దీనికి మనమే వారసులం!
గంగా యమునలు పారు నిండుగా
మా నేలల్లో బంగారు పండగ
దిగువున పరుచుకు మైదానాలు
దిగ్గున ఎగసే సంద్రపుటలలు
మంచు నిండినా ఎత్తు కొండలు
కావలి దండిగ, మాకు అండగా!
హిందుస్థాను మన దేశం - దీనికి మనమే వారసులం!
దూరం నుండి వచ్చిన దుష్టులు
చేసిరి కంతిరి మాయ చేష్టలు
ప్రియాతి ప్రియమవు దేశాన్నంత
దోచివేసిరి రెండు చేతులా!
హిందుస్థాను మన దేశం - దీనికి మనమే వారసులం!
అమరవీరులు విసిరిన సవాలు
దేశవాసులు వినరండి.. బానిస సంకెలు తెంచండి
నిప్పుల వానై కురవండి !
హిందుస్థాను మన దేశం - దీనికి మనమే వారసులం!
హిందూ, ముస్లిం, సిక్కులందరం
ప్రియాతి ప్రియమవు సోదరులం
అదిగదిగో మన స్వతంత్ర జెండా
చేస్తాం సలాము గుండెల నిండా!
చేస్తాం సలాము గుండెల నిండా!

**ఉర్దూ మూలం : మౌల్వి లియాఖత్ అలీ**
**తెలుగు అనువాదం : దివికుమార్**

విరచితమైన 'జనగణమన'ను 'నేషనల్ ఏంథెమ్'గా కాంగ్రెస్ ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని మౌలానా ఆజాద్, ఇతర జాతీయవాద ముస్లింలు బలపరిచారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం, రవీంద్రనాథ్ ఠాగూర్ 'జనగణమన' గీతాల్లో దేన్ని నేషనల్ ఏంథెమ్‌గా స్వీకరించాలనే వివాదం హిందువులు, ముస్లింలకూ సంతృప్తికరంగా, సుహృద్భావంతో పరిష్కృతమైంది. దుర్గామాత ప్రస్తావన లేని, వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను సమస్త భారతదేశానికి సమ్మతమైన 'నేషనల్ సాంగ్' రూపంలో అంగీకరించారు. కవిగా, దార్శనికుడుగా రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఉన్న మహోన్నత గౌరవ ప్రతిష్ఠలు, ఆయన తార్కిక, నిష్పాక్షిక వైఖరి అందుకు విశేషంగా దోహదం చేశాయి. బోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' (భారత జాతీయ సైన్యం) ఈ రెండింటినీ అదే హోదాలో స్వీకరించింది.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత National Anthem అవసరాన్ని గుర్తించారు. ఐక్యరాజ్యసమితిలో 'జన గణ మన'ను భారతదేశ జాతీయగీతంగా ఆలపించారు. 1948 ఆగస్టు 25న పార్లమెంటులో నెహ్రూ ఇలా అన్నారు : 'వందేమాతరం, జన గణ మన గీతాలలో దేనిని జాతీయగీతంగా స్వీకరించాలనే విషయమై అనవసరవాద ప్రతివాదాలు జరుగుతుండడం దురదృష్టకర విషయం. వందేమాతరం నిస్సందేహంగా భారతదేశ ఉత్కృష్ట చారిత్రక సంప్రదాయ గీతం. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వందేమాతర గీతానికి ఉన్న స్థానం దేనికీ లేదు. దాని చారిత్రక ప్రాధాన్యాన్ని ఎవరూ తోసిపుచ్చలేరు. వలసపాలనకు వ్యతిరేకంగా భారత ప్రజలను ఏకం చేయడంలో అది నిర్వర్తించిన పాత్ర అనుపమేయమైనది. అయితే స్వాతంత్ర్య పోరాట పరాకాష్ఠ అయిన స్వతంత్ర భారతదేశ ఆవిర్భావాన్ని, జాతి నిర్మాణంలో తదుపరి దశను ఆ గీతం సూచించదు'. రాజ్యాంగసభలో 'జన గణ మన'ను National Anthemగా నెహ్రూ ప్రకటించడాన్ని అందరూ హర్షామోదాలతో స్వాగతించారు.

జనగణమన గీత చరణాలలోని సమున్నత భావాలను, ఆ గీత స్వర రచనను ప్రశంసిస్తూ, దాన్ని నేషనల్ యాంథెమ్‌గా స్వీకరించినందుకు అభినందిస్తూ భారత ప్రభుత్వానికి సందేశాలు అందాయి. తాము విన్న చాలా జాతీయ గీతాల కంటే జన గణ మన సాహిత్యం, సంగీతం ఉత్కృష్టంగా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. రాజ్యాంగ సభ 1950 జనవరి 24న నేషనల్ ఏంథెమ్‌గా జన గణ మనను అధికారికంగా స్వీకరించింది. ఆ సందర్భంగా రాజ్యాంగసభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఇలా వ్యాఖ్యానించారు: 'జన గణ మన'గా సుప్రసిద్ధమైన సాహిత్య చరణాలు, స్వరరచన భారతదేశ National Anthem భవిష్యత్తులో సందర్భం వచ్చినప్పుడు దానిలో మార్పులు చేసే అధికారం భారత ప్రభుత్వానికి ఉన్నది. భారత స్వాతంత్ర్య సమరంలో చరిత్రాత్మక పాత్ర వహించిన బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గీతానికి కూడా జన గణ మనతో సమాన హోదా ఉంటుంది'. రాజేంద్రప్రసాద్ ఇంకా ఇలా విశదీకరించారు: 'జన గణ మనకు National Anthemగా రాజ్యాంగ అనుమతి లేదు. ఆ గీతాన్ని అలా గౌరవించడం భారత ప్రజల సమ్మతి ఉన్న ఒక సంప్రదాయం'. ఆ పరిపాటిని భారతదేశం పరిపూర్ణంగా అనుసరిస్తోంది. ❑**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

## వందే మాతరం గేయం పూర్తి పాఠం

(సంస్కృతం-బెంగాలీ భాషల మిశ్రమంగా శ్రీ బంకించంద్ర ఛటర్జీ రాశారు. మొదటి రెండు చరణాలు భారతమాత ప్రకృతి వర్ణనగా సాగింది. ఆ మేరకు జాతీయ గీతం హోదాను పొందింది. మిగిలిన చరణాలు దుర్గామాత, కాళీ మాత స్తోత్రంగా వున్నందున వాటిని జాతీయ గీతం నుండి మినహాయించబడ్డాయి.)

**వందేమాతరం సుజలాం సుఫలాం మలయజ**
**శీతలాం సస్య శ్యామలాం మాతరం ॥ వందే ॥**
**శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం పుల్లకుసుమిత**
**ద్రుమదల శోభినీం సుహాసినీం సుమధుర భాషిణీం**
**సుఖదాం వరదాం మాతరం ॥ వందే ॥**
**కోటికోటి కంఠ కలకల నినాదకరాలే కోటి కోటి**
**భుజైర్ ధృత కర కరవాలే అబలా కేయనో మా**
**ఏతో బలే బహుబల ధారిణీం నమామి తారిణీం**
**రిపుదలవారిణీం మాతరం ॥ వందే ॥**
**తిమి విద్యా తిమి ధర్మ తుమి హృది తుమి**
**మర్మత్వం హి ప్రాణాః శరీరే బాహుతే తుమి మా**
**శక్తి హృదయే తుమి మా భక్తితో మారయి ప్రతిమా**
**గడి మందిరే మందిరే ॥ వందే ॥**
**త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ కమలా**
**కమలదళ విహారిణీ వాణీ విద్యాదాయినీ నమామి**
**త్వాం నమామి కమలాం అమలాం అతులాం**
**సుజలాం సుఫలాం మాతరమ్ ॥ వందే ॥**
**శ్యామలాం సరలాం సుస్మితాం భూషితాం ధరణీం**
**భరణీం మాతరం**

# కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే కొత్త లేబర్ కోడ్‌లు



- అనిసెట్టి శాయికుమార్

భారతదేశంలో కార్మిక సంక్షేమం కోసం వివిధ సమయాల్లో రూపొందించి అమలు చేసిన చట్టాలను పూర్తిగా రద్దు చేసి, వాటి స్థానంలో పారిశ్రామిక పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా నాలుగు కొత్తచట్టాలు తెచ్చింది. 1.జీతాల చెల్లింపులకు సంబంధించిన చట్టం(2019), 2.పారిశ్రామిక సంబంధాల చట్టం 2020), 3.సామాజిక భద్రతా చట్టం(2020), 4.పని భద్రత, పరిస్థితులు, ఆరోగ్య చట్టం(2020) అనేవి. భారత రాజ్యాంగంలో కార్మిక చట్టాలకు సంబంధించిన అంశం ఉమ్మడి జాబితాలో చోటు చేసుకుంది. ఈ ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ అంశంపై చట్టాలు చేయవచ్చు. కానీ, కేంద్రం చట్టం చేసిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టం రద్దయి, కేంద్ర చట్టమే చెల్లుబాటు అవుతుంది. కాబట్టి దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు, రాష్ట్రాలు ఈ చట్టాల్ని 2025 జూన్ నాటికి నిబంధనలు తయారు చేసుకుని అమలు జరపాలని కేంద్రం కోరింది. వీటికి సంబంధించిన నిబంధలను చాలా రాష్ట్రాలు ఇంకా పూర్తిగా తయారు చేయలేదు. కాని, వీటి అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుంది. వరుసగా ఫ్యాక్టరీల చట్టంతోసహా అనేక చట్టాల నిబంధనలకు 2025 మే నెల వరకూ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులు మినహా, ఐటీ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, వ్యాపార, సేవా రంగాల్లో పనిచేసే వారు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికుల వంటి వారందరూ వీటి పరిధిలోకి వస్తారు.

ఆధునిక కాలంలో ప్రపంచీకరణ మొదలైన కాలం నుంచి, సంపద సృష్టించే శ్రామికవర్గానికి కనీస భద్రత కల్పించే చట్టాల్లో అనేక కార్మిక వ్యతిరేక మార్పులు జరిగాయి. గతంలో కార్మికులు, కార్మిక సంఘాలకు యజమానులకు మధ్య చర్చలు జరిపి, యాజమాన్యం నిరంకుశంగా ప్రవర్తించడానికి వీలు లేని విధంగా అనేక చట్టాలు అమలులో ఉండేవి. పని ప్రదేశంలో ఆరోగ్యం, రక్షణ, శుభ్రత, సరైన పరికరాలు, అత్యవసర అవసరాలు తీరే ఏర్పాట్లు, పనిగంటలు, న్యాయమైన వేతనాలు, పని భద్రత, ఆరోగ్య రక్షణ వంటి అనేక అంశాలపై చట్టాలు, వాటి అమలు, పర్యవేక్షణలకు సంప్రదింపుల ఏర్పాట్లు, కార్మిక న్యాయస్థానాల వంటి అనేక సౌకర్యాలు ఉండేవి.

గతంలో కార్మిక సంక్షేమానికి ఉద్దేశించిన పారిశ్రామిక వివాదాల చట్టం 1947, కర్మాగారాల చట్టం, కనీస వేతనాల



చట్టం, 1948, ప్రావిడెంట్ ఫండ్ చట్టం వంటి ఇరవై తొమ్మిదికి పైగా చట్టాలు అమలులో ఉండేవి. కార్మిక శ్రేయస్సు కోసం భూతలింగం కమిటీ వంటివి ఏర్పాటు చేయడం ద్వారా కనీస వేతన చట్టంలో మార్పుల వంటి అనేక కార్మిక అనుకూల చట్టాలు ఏర్పాటు చేశారు. అయితే, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ విధానాలు అవలంభించిన ఇరవయ్యవ శతాబ్దపు చివరి కాలం నుంచి కార్మిక హక్కులు కాలదన్నే అనేక చట్టాలు అమలులోకి రావడం ప్రారంభమైంది. మరీ ముఖ్యంగా బీజేపీ పాలన వచ్చిన తర్వాత వీటిని కార్మిక వ్యతిరేక అంశాలతో, మరింత కఠినతరంగా మార్చారు. వీటిలో అనేక చట్టాలు కార్మిక హక్కుల్ని హరించి వేసేవిగా ఉన్నాయి. అనేక నిబంధనలు వ్యాపార పారిశ్రామిక వర్గాలకు అనుకూలంగాను, ఉద్యోగ భద్రతను హరించి, సామాజిక రక్షణను తగ్గించి, కార్మిక సంఘాల శక్తిని నిర్వీర్యం చేసేలా ఉన్నాయి. పాత కార్మిక చట్టాలన్నీ రద్దయి, వాటి స్థానంలో 2020 సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలోని ముఖ్య అంశాల్ని పరిశీలిద్దాం.

కార్మికులను, ఉద్యోగులనూ ఎప్పుడైనా తీసుకోడానికి, ఎప్పుడైనా పని నుంచి తొలగించడానికి ఇవి వీలు కల్పిస్తున్నాయి. అంతకుముందు అమలులో ఉన్న చట్టాల ప్రకారం వంద మంది కార్మికులు ఉన్న చోట పనిగంటలు, వేతనాలకు సంబంధించి, ఉద్యోగాల నుంచి తొలగించడానికి ఉన్న అవరోధాల్ని మూడు వందల మందికి పైగా పనిచేసే సంస్థలకు మాత్రమే వర్తింపజేయడం వల్ల, ఆ పెంచిన పరిమితి సంఖ్య లోపల ఉద్యోగులు, కార్మికులు ఉన్న సంస్థలకు ఏ

రకమైన జవాబుదారీతనం లేకుండాపోయింది. ఈ ప్రకారం గతంలో ఉన్న వంద మంది కార్మికుల నిబంధనకు బదులు మూడు వందల మందికిపైగా కార్మికులు ఉన్న సంస్థలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి అవసరం. మూడు వందల మంది కంటే తక్కువ పనివారు ఉన్న సంస్థలు పని వారిని పనిలోకి తీసుకోవడానికి గానీ, తొలగించడానికి గానీ ప్రభుత్వ ప్రమేయం లేకుండా యాజమాన్యానికి పూర్తి హక్కులు ఉన్నాయి. ఏ ఉద్యోగానికైనా ఎప్పుడైనా, ఎవరినైనా తీసుకోవచ్చు. అవసరం లేదనుకుంటే, ఏ రకమైన నోటీసు లేదా పరిహారం చెల్లించకుండా ఎప్పుడైనా తొలగించవచ్చు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించడానికి కార్మిక న్యాయస్థానాల్ని ఆశ్రయించే హక్కు కూడా లేదు. ఇక ఏ రకమైన ఆధారాలూ లేకుండా దినకూలిగా పనిచేయించుకోవడం అనే సౌలభ్యం వలన యజమానులు లాభపడడానికే తప్ప, కార్మికుల కనీస హక్కులకు భద్రత లేని పరిస్థితికి దారి తీసింది. ఫలితంగా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది.

వారి కనీస హక్కులకు రక్షణ కల్పించే ఏ విధమైన అంశాలూ కొత్త చట్టంలో లేవు. రోజువారీ కూలీలకు సంబంధించి, గత చట్టాల ప్రకారం ఇరవై మందిని దినకూలీలుగా ఉపయోగించుకుంటే ఆ విషయమై ప్రభుత్వానికి తెలియజేయాల్సివచ్చేది. కొత్త కోడ్‌లో ఆ పరిమితిని యాభై మందికి పెంచారు. ఈ విధమైన వెసులుబాటును ఉపయోగించుకుని, కరోనా కాలంలో వివిధ సంస్థలు వేలాదిమంది కార్మికులను నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటడంతో వారంతా కాళ్ళకు చెప్పులు లేకుండా, పిల్లాజెల్లా, తట్టాబుట్టలతో, ఆకలి కడుపులతో, వేల కిలోమీటర్లు నడక సాగించిన దుస్థితిని చూశాం. వారికి వలస వచ్చిన చోట ఓటు హక్కు ఉండదు కాబట్టి, స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయవేత్తలు, ప్రభుత్వం వారిని అసలు పట్టించుకోని స్థితి కనబడింది. దారిలో వారికి అన్నం పెట్టడానికి, చెప్పులు అందించడానికి ప్రజా సంఘాలు, సాధారణ ప్రజల ఔదార్యమే ఉపయోగపడింది గానీ, అప్పటి వరకూ వారి శ్రమశక్తిని సొమ్ముగా మార్చుకున్న యాజమాన్యాలు గానీ, ప్రభుత్వం గానీ నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాయి. పైగా వారిని స్వస్థలాలకు పంపడానికి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయమని కోరితే, కేవలం కొన్ని లక్షల రూపాయల కర్చుకు వెనుదీసిన కేంద్ర ప్రభుత్వం వారిని పెంచిన ధరలతో టిక్కట్లు కొనుక్కోమని లేదా రాష్ట్ర ప్రభుత్వం ఆకర్చును ముందుగా భరించాలని ఆదేశించింది.

కొత్త కోడ్‌ల ప్రకారం సమ్మె హక్కు మీద పరిమితులు, నిషేధం విధించడంతో కార్మిక ప్రయోజనాల కోసం కార్మిక సంఘాలు పోరాటం చేయడానికి వీలు లేకుండా పోయింది. యాజమాన్యంతో చర్చలు జరిపి వేతనాలు, ఇతర పని పరిస్థితులపై చర్చలు జరిపేందుకు సంఘాలకున్న హక్కులు అమితంగా కుదించివేయడంతో, కార్మిక సంఘాల పాత్ర నామమాత్రంగా తయారైంది. ఇక రోజుకు పన్నెండు గంటలు పని చేయించుకోవడాన్ని చట్టబద్ధం చేశారు. అదనపు పని గంటలు పనిచేసినందుకు చెల్లించాల్సిన భత్యాన్ని గురించి చట్టంలో ఏమీ చెప్పకపోవడం వల్ల వారికి ఆర్థిక లాభం కూడా ఒనగూరని స్థితి వచ్చింది. ఇక ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల, కార్మికులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావడం వల్ల అనేక మానసిక, కుటుంబ సమస్యలకు లోనవుతున్న ప్రమాదకర పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఇది సాఫ్ట్ వేర్ కంపెనీల్లో పనిచేసే వారిపై మరింత వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తుంది. మహిళలను రాత్రి వేళల్లో పని చేయించుకోవడానికి, ప్రమాదకర పనుల్లో నియమించుకోవడానికి అనుమతించారు. ఈ చట్టం వల్ల మహిళలకు కుటుంబం, పిల్లల పెంపకం వంటి బాధ్యతల నిర్వహణ కష్టం కావడమే కాకుండా, మహిళలను రాత్రి వేళల్లో పని సమయం కేటాయించి, లైంగిక వేధింపులకు పాల్పడే అవకాశాలు పెరగడం సహజ పరిణామం. స్త్రీల మాన ప్రాణాలకు రక్షణ లేని స్థితి నెలకొంటుంది. ప్రత్యేక ఆర్థిక మండలుల పేరిట విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలు కొలువై ఉన్నచోట అసలు ఏ కార్మిక చట్టాలూ వర్తింపజేసే వీలు లేకుండా మినహాయింపు ఇచ్చారు.

బాల కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. క్వారీల్లో రాళ్ళు కొట్టడం, మందుగుండు తయారీ వంటి ప్రమాదకరమైన పనులు, లోతైన గుహల్లో ఉండే గనుల్లో తవ్వకాలవంటి పనుల్లో పద్నాలుగేళ్ల వయసున్న పిల్లల్ని నియమించుకొనేందుకు కొత్తగా వీలు కల్పించారు. దీనివల్ల అతితక్కువ కూలికే పిల్లల్ని కారు చౌకగా పనిలో నియమించుకోడానికి యాజమాన్యాలకు అవకాశం కలిగింది. కొత్తగా ప్రవేశపెట్టిన కోడ్‌ల ప్రకారం ఈ కోడ్‌లోని ఏ నిబంధనల నుంచి అయినా ఏ సంస్థకయినా మినహాయింపు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టింది.

యాజమాన్యం కొన్ని పనుల్ని కాంట్రాక్టరు ద్వారా నిర్వహించుకునేందుకు కొత్తచట్టాలు అవకాశం కల్పించాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు ఈ కోడ్‌లోని అంశాలు వర్తించవని నిబంధనల్లో పేర్కొన్నారు. ఈ చట్టం పరిధిలోకి వచ్చే వివిధ సంస్థల్లో పనిచేసే, పర్యవేక్షక విధులు నిర్వర్తించే, ఇరవై ఐదు వేల రూపాయలు, అంతకుమించి వేతనం పొందుతున్నవారికి ఈ చట్టాల ప్రకారం వర్తించే కనీస కార్మిక హక్కులు కూడా వర్తించవని స్పష్టం చేశారు.

పని గంటలు విపరీతంగా పెంచారు. అత్యధికంగా పన్నెండు గంటల పని సమయాన్ని పెంచడం ద్వారా శ్రమ దోపిడీని

ఎక్కువ చేశారు. భారతదేశంలో అసంఘటిత రంగంలో ఎక్కువ మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకులు వెళ్లదీయక తప్పని పరిస్థితులున్నాయి. వీరికి పని గంటలు విపరీతంగా పెరిగాయి. భారీ కార్పొరేట్ వైద్యశాలలు, భారీ వస్త్ర దుకాణాలు, ఇటుక బట్టీలు, చిన్నపాటి పరిశ్రమలు, వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పారిశ్రామిక పనుల్లో ఉన్న శ్రామికులు అత్యధికులుగా ఉన్నారు. వీరిని గురించి చట్టాల్లో ఏమీ లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, తమ రెక్కల కష్టంతో సమస్త సంపదను సృష్టించే వారిని దయనీయమైన స్థితికి నెట్టి, యాజమాన్యాలకు, పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా ఈ కోడ్‌లను తయారు చేశారు.

**ఇక మూడు వందల మందికి మించి పనివారు లేని సంస్థల్లో కార్మిక చట్టాలు పట్టించుకొనక్కరలేదనే కొత్త నిబంధన వల్ల లక్షలాది మంది కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. వేల కొద్దీ కార్పొరేట్ వైద్యశాలలు, కార్పొరేట్ విక్రయశాలలు, భారీ వస్త్ర దుకాణాలు, విద్యా శాలలు, వస్తూత్పత్తి పరిశ్రమల వంటి రంగాలలో పనిచేసే వారి నెల జీతం వర్తమానంలో పది వేల నుంచి మొదలై, ఎంతో కాలంగా పనిచేస్తున్న వారికి 18 వేలకు మించడం లేదు. ఈ ఆదాయంతో కడుపు కట్టుకుని బతుకుతూ, ఫీజులు కట్టి, ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల్ని చదివించుకుంటున్నారు. వీరికి ఏ విధమైన ప్రభుత్వ పథకాలూ వర్తించవనేది మరొక కఠోర వాస్తవం.**

తక్కువ ఆదాయం వల్ల పోషకాహారలోపం, తద్వారా వచ్చే ఆరోగ్య సమస్యల ఖర్చు వీరి జీవితాల్ని మరింతగా దిగజారుస్తున్నాయి. కార్పొరేట్ వైద్య శాలలు, విద్యాలయాలను పెంచి పోషించేందుకు ప్రజాధనాన్ని వారికి దోచిపెట్టే ఉచిత పథకాలకు బదులు, విద్య, వైద్య రంగాలలో ప్రయివేటు వ్యాపార పెట్టుబడులు నిషేధించి నాణ్యమైన సేవలను ప్రభుత్వ రంగంలో అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. భిన్న సమూహాలుగా విడిపోయిన కమ్యూనిస్టులు, మానవ, హేతువాద, అభ్యుదయ సంఘాల వారు ఈ అంశాన్ని కనీస ఉమ్మడి కార్యాచరణగా ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యాయి.

రాత్రింబవళ్లూ ఒళ్లు హూనమయ్యేలా గొడ్డు చాకిరీ చేయించుకోవడానికి వ్యతిరేకంగా పనిగంటల తగ్గింపుకై, అమెరికాలోని పారిశ్రామిక నగరమైన చికాగోలోని హేమార్కెట్‌లో 1886 మే నెలలో జరిగిన కార్మికుల సమ్మె ప్రదర్శనపై పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది కార్మికులు మరణించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, వారి రక్తంతో ఎరుపెక్కిన ఎర్ర జెండాను గుర్తు చేసుకుంటూ, దాన్ని ఒక సంతాప దినంగాను, పోరాటాలకు మరింత స్ఫూర్తినిచ్చే ప్రతిజ్ఞా దినంగానూ గుర్తించాలని అంతర్జాతీయ సోషలిస్టు కార్మిక సంఘాల వారు భావించారు. ఆ ప్రకారం అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య 1889లో పారిస్‌లో జరిపిన సమావేశంలో దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పాటించాలని నిర్ణయించి, అప్పటి నుంచి దీనిని పోరాటానికి స్ఫూర్తినిచ్చే ప్రతిజ్ఞాదినంగా, పిడికిళ్ళు బిగించి మరింత దీక్షతో, ఎద ఎదలో కార్మిక చైతన్య స్ఫూర్తిని రగిలించే, ఉత్తేజం నింపే దినంగా ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ పాటించడం ఆనవాయితీ. అయితే, దీన్ని ఎప్పుడో తుంగలో తొక్కి పండుగగా మార్చేశారు. ఒక హాస్యాస్పదమైన విషయమేమంటే, మన దగ్గర, బీజేపీ వారి భారతీయ మజ్దూర్ సంఘ్, ఇతర పాలకపక్ష కార్మిక సంఘాలకు చెందిన కార్మికులతోబాటు స్టేజీ మీద రికార్డు డ్యాన్స్‌లు, ముక్క చుక్కలతో విందు వినోద కార్యక్రమాలతో మునిగి తేలుతూ, వేడుక చేసుకునే ఉత్సవ కార్యక్రమంగా జరుపుకోవడం అన్నిచోట్లా సాధారణమైన విషయంగా జరిగిపోతోంది.


కనీసం కమ్యూనిస్టు పార్టీలుగా చెప్పుకుంటున్న వారి నాయకత్వం కూడా ఇదే విధానాన్ని ప్రోత్సహిస్తోంది తప్ప, కార్మిక హక్కులు, స్థితిగతుల్ని సమీక్షించుకొని, భవిష్యత్ కార్యాచరణకు పురోగమించే ప్రతిజ్ఞాదినంగా జరపడం లేదు. వీటన్నిటి ఉద్దేశం కార్మిక హక్కులను హరించడానికి వ్యతిరేకంగా ఆలోచించే దిశగా కార్మికులు ప్రయత్నం చేయకుండా నియంత్రించడమేనని స్పష్టమవుతోంది.

ఒకనాడు సమస్త కార్మిక లోకానికి ప్రాతినిధ్యం వహించిన సీపీఐ, సీపీఎం కమ్యూనిస్టు పార్టీలు వర్తమానంలో నామ మాత్రంగా మిగిలాయి. కేవలం వేతనాలు, కూలీ రేట్ల పెంపు తప్ప రాజకీయంగా కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేసే దిశగా కృషి చేయకపోవడం, భారతదేశానికి ప్రత్యేకమైన కుల వ్యవస్థను స్పష్టంగా తమ రాజకీయ సిద్ధాంతం, ఆచరణల్లో మిళితం చేయకపోవడం వంటి కారణాల వల్ల పాలకపక్ష పార్టీలతోసహా అనేక రకాల కార్మిక సంఘాలు ఏర్పడి, కార్మిక చైతన్యాన్ని తప్పు దారి పట్టించడమైంది. ఫలితంగా, బీజేపీ తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడే స్ఫూర్తిని కార్మిక సంఘాలు కోల్పోయాయన్న వాస్తవాన్ని గుర్తించి, ప్రజాపక్షంగా ఆలోచించే సంస్థలు, సంఘాలు వీటికి వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలతోబాటు ప్రచారోద్యమం నిర్వహించాల్సిన అవసరముంది. ❑

# భారత్‌లోనే ఆదాయ అసమానతలు ఎక్కువ

-

న్యూఢిల్లీ:భారతదేశంలో ఆదాయ అసమానతలు ప్రపంచ దేశాల్లోకెల్లా అత్యధికంగా వున్నాయి. కేవలం 10 శాతం మంది దేశ ఆదాయంలో 58 శాతాన్ని సముపార్జిస్తున్నారు. అదే సమయంలో కిందనున్న 50 శాతం మంది కేవలం 15 శాతం ఆదాయాన్నే సంపాదించుకోగలుగుతున్నారు. ఆర్థిక వేత్తలు లూకాస్ చాన్సెల్, రికార్డో గోమెజ్-కారెరా, రొవాడియా మోషరీఫ్, థామస్ పికెటిలు రూపొందించిన, తాజాగా విడుదలైన ప్రపంచ అసమానతల నివేదిక 2026 ఈ విషయాలను తేటతెల్లం చేసింది.




## సంపదలో అసమానతలు

భారతదేశం సంపదలో అసమానతలు మరింత ఎక్కువగా వున్నాయని నివేదిక స్పష్టం చేసింది. సంపన్నులైన కేవలం 10శాతం మందికి దేశంలోని మొత్తం సంపదలో దాదాపు 65శాతంపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఒక శాతం మంది కుబేరుల వద్ద దాదాపు 40 శాతం సంపద పోగుపడి వుంది. వరల్డ్ ఇన్ఈక్వాలిటీ ల్యాబ్ బుధవారం ఈ నివేదికను విడుదల చేసింది. సంపన్నుల వద్దే సంపద పోగుపడుతూ వుంటే నిరుపేదలు మరింతగా దారిద్ర్యంలో కునారిల్లుతున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రభుత్వాలు విధానపరమైన మార్పులు తీసుకురావాలని పేర్కొంది. విద్య, సార్వజనీన ఆరోగ్య సంరక్షణ, నగదు బదిలీలు, పెన్షన్లు వంటి పున:పంపిణీ కార్యక్రమాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని సూచించింది. ప్రగతి శీల పన్నుల విధానం, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరింది. 2022లో విడుదలైన అప్పటి ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం టాప్ 10 శాతం మంది వ్యక్తుల దగ్గర 57 శాతం మేరా జాతీయ ఆదాయం వుంది. అదే సమయంలో కింది స్థాయిలో 50 శాతం మంది వాటా 2021లో కేవలం 13 శాతంగా వుంది. సగటు వార్షిక ఆదాయం దాదాపు 6,200 యూరోలుగా వుంటే, సగటు సంపద 28 వేల యూరోలుగా వుంది. మహిళా కార్మికుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా అంటే 15.7 శాతంగా వుంది. గత దశాబ్ద కాలంలో ఎలాంటి పురోగతి లేదు. మొత్తం మీద, ఆదాయాలు, సంపద, లింగ వైవిధ్యత వంటి పలు అంశాల్లో భారతదేశంలో అసమానతలు చాలా లోతుగా పాతుకుపోయాయని, వీటివల్ల ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న వ్యవస్థాగతమైన విభేదాలను ఆ నివేదిక ప్రముఖంగా పేర్కొంది. ఆర్థికవేత్తలు జయతి ఘోష్, జోసెఫ్ స్టిగ్లిట్జ్‌లు ఈ నివేదికకు ముందుమాట రాశారు. అంతర్జాతీయంగా సంపద చారిత్రక ఎత్తులకు చేరుకుంది. కానీ అత్యంత అసమానమైన రీతిలో పంపిణీ అవుతోంది. అగ్ర స్థానంలో వున్న 0.001 శాతం మంది అంటే 60 వేలకన్నా తక్కువ మంది కోటీశ్వరులు కింది స్థాయిలోని మానవాళి వద్ద మొత్తంగా గల సంపదకన్నా మూడు రెట్లు ఎక్కువ సంపదను కలిగి వున్నారు. వారి వాటా నిలకడగా పెరుగుతూ 1995లో దాదాపు నాలుగు శాతం నుండి ఈనాడు ఆరు శాతానికి పైగా చేరుకుంది. పైగా అంతర్జాతీయ స్థాయిలో అసమానతలు పెచ్చరిల్లడం, బహుళపక్ష వాదం బలహీనపడడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ధోరణి చోటు చేసుకుందని నివేదిక పేర్కొంది.

## మహిళల వాటా కేవలం 25 శాతమే..

1980ల్లో అంతర్జాతీయంగా మధ్య తరగతి ఆదాయ గ్రూపుల్లో భారత్ సాపేక్షంగా పెద్ద వాటా కలిగి వుంది. కానీ 2025 వచ్చేసరికి, దాదాపు భారత్‌లోని జనాభా అంతా ఆదాయ పంపిణీలో కింది స్థాయిలోని 50 శాతంలో వున్నారు. అదే సమయంలో చైనా ఎగువ మధ్య తరగతి వర్గాల్లోకి చేరింది.

ఇక లింగ సమానతకు వచ్చినట్లైతే, భారతదేశంలో మహిళా కార్మికుల ప్రాతినిధ్యం అత్యంత తక్కువగా 15.7 శాతం దగ్గరే నిలిచిపోయింది. గత పదేళ్లలో ఎలాంటి మెరుగుదల లేదు. ఇక అంతర్జాతీయంగా చూసినట్లైతే, గంటకు పురుషుడు సంపాదించే దానిలో 61 శాతాన్నే మహిళలు సంపాదిస్తున్నారు. అన్‌పెయిడ్ లేబర్‌ను చేర్చినట్లైతే ఇది 32 శాతానికి పడిపోతుంది. అంతర్జాతీయంగా మొత్తం కార్మిక ఆదాయంలో మహిళల వాటా కేవలం 25 శాతంగానే వుంది. 1990 నుండి దీంట్లో ఎలాంటి మార్పు లేకుండా పోయింది. ❑

# సమతా శక్తుల కూటమి కోసం..
# విధాన పత్రం

**లక్ష్యం : వామపక్ష, సామాజిక ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల కూటమి ఏర్పడటం కోసం బౌద్ధిక, భౌతిక రంగాలలో కృషి చేయుట.**

**మొదటి భాగం : దేశ చరిత్ర, ప్రస్తుత పరిస్థితుల విహంగ వీక్షణం**

1.1. మను స్మృతిని ధిక్కరించి, మహాత్మా జ్యోతిరావు పూలే, అమ్మ సావిత్రి భాయి పూలే 'నిమ్న వర్గాల' విద్యా ఉద్యమం సాగించారు. రష్యాలో కమ్యూనిస్టు అక్టోబరు విప్లవం, ఇండియాలో కమ్యూనిస్టు నాయకత్వంలో పెద్ద ఎత్తున సాగిన ప్రజా పోరాటాలు, ఇతర వివిధ సంఘ సంస్కరణ ఉద్యమాలు, స్వాతంత్రోద్యమం ఫలితంగా రూపుదిద్దుకున్న ప్రజాస్వామిక ఆకాంక్షలు, వివక్షకు లోనైన దళితులు, ఇతర సామాజిక వర్గాల హక్కుల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాగించిన ఉద్యమాలు – వీటన్నింటి ప్రభావాల ఫలితంగా, మన సమాజంలో అనేక ధార్మిక విశ్వాసాలు గల ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నందు వల్ల భారతదేశాన్ని హిందూ రాజ్యంగా కాక లౌకిక రాజ్యంగా రాజ్యాంగ నిర్మాతలు ధృవీకరించారు.

మన సమాజంలోని కుల ఆధారిత తీవ్ర సాంఘిక ఆర్థిక విద్యా అసమానతలు, వివక్షతకు వ్యతిరేకంగా అంబేద్కర్ సాగించిన సామాజిక సాంస్కృతిక రాజకీయ కార్యాచరణ వల్ల, వాస్తవాన్ని అంగీకరించి, వాటిని తగ్గించాలనే నిర్ణయం తీసుకుని తరతరాలుగా దోపిడీ పీడనలకు గురైన SC, ST, BC సామాజిక వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ ప్రవేశపెట్టారు. పరిమిత భూసంస్కరణలు అమలు చేశారు. విద్య, వైద్యం, కీలక పరిశ్రమలు, ప్రయాణ సాధనాలు ప్రభుత్వ రంగంలోనే స్థాపించారు. వీటన్నింటి వల్ల సమాజంలో, ఉత్పత్తి విధానంలో అనేక గణనీయమైన మార్పులు సంభవించాయి. దళితులు, ఇతర 'నిమ్న' వర్గాలు, స్త్రీలు వివిధ రకాల సామాజిక క్షేత్రాల్లోకి గణనీయమైన సంఖ్యలో ప్రవేశించారు.

1.2. మరొక వైపున, భారత జాతీయ కాంగ్రెస్ లోపలే, సనాతన హిందువుల హక్కుల పరిరక్షణ కోసం, మదన్ మోహన్ మాలవ్య నాయకత్వంలో 1915లో హిందూ మహాసభ ఏర్పడింది. 1930లో దామోదర్ వినాయక సావర్కర్ నాయకత్వంలో ఆ హిందూ మహాసభ హిందుత్వ సిద్ధాంతం (దేశంలోని హిందూ యేతరులను శత్రువులుగా చిత్రిస్తూ, మనువాద అమానుష కుల వ్యవస్థను కొనసాగించే మానవ వ్యతిరేక సిద్ధాంతం) ప్రాతిపదిక రాజకీయ పార్టీగా పరిణామం చెందింది. ఆ క్రమంలో సాగిన అనేక కార్యక్రమాలు.

- 1925లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్ 'హిందుత్వ' దృక్పథంతో సమాజంలో చాప కింద నీరులాగా విస్తరించటం.
- 1975-77 ఇందిరా నిరంకుశ ఎమర్జెన్సీ తర్వాత ఏర్పడిన జనతా పార్టీలో ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం జనసంఘ్ మిళితమై రాజ్యాధికారంలో ప్రవేశించి బలపడటం..
- జనతా పార్టీ చీలికలు, ఆ పార్టీ ప్రభుత్వ పతనం, పాత జన సంఘ్ భారతీయ జనతా పార్టీ(బీజేపీ)గా అవతరించడం..
- ఇందిరాగాంధీ ప్రభుత్వపు ఆపరేషన్ బ్లూ స్టార్, ఇందిర హత్య, ఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిక్కులపై హత్యాకాండ..
- రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వంకర టింకర శ్రీలంక విధానం..
- షాబానో బేగం భరణం కేసు వ్యవహారంలో సనాతన ముస్లిం విభాగ ఒత్తిడికి లోనై సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను రద్దుపరిచే చట్టాన్ని చేయటం.. ఇవన్నీ కలిసి సంఘ్ పరివార శక్తులు బలాన్ని పుంజుకోవటానికి సువర్ణావకాశాలు ఇచ్చాయి..
- ఈ అవకాశాలను అందిపుచ్చుకుని సారనాథ్ నుంచి 'రామ జన్మ భూమి అయోధ్య'కు బీజేపీ అధ్యక్షుడు అద్వాని రథయాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత..
- సామ్రాజ్య వాద బహుళజాతి గుత్త పెట్టుబడి ప్రపంచ దేశాలన్నింటినీ తన అధీనంలోకి తీసుకోవటం..
- ఇండియాలోని పెట్టుబడి ఒక రకం గుత్త పెట్టుబడిగా అభివృద్ధి చెందటం..
- 1996-98ల్లో ఏర్పడిన బీజేపీ,కాంగ్రెసేతర మైనారిటీ ఐక్య సంఘటన ప్రభుత్వాల ఏర్పాటు పతనంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన రాజకీయ టక్కుటమారి వ్యవహారాలు..
- యూపీఏ ప్రభుత్వాల అవినీతి..
- అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమ పతనం..
- నయాఫాసిస్టు మతతత్వ భావజాలం అన్ని సవర్ణ కులాల హిందువులపై హెజిమోనీ (ఆధిపత్యం) సంపాదించటం..
- 20వ శతాబ్దం చివరి నాలుగో భాగంలో సంభవించిన ఈ అన్ని పరిణామాల వల్ల హిందుత్వ నయాఫాసిస్టు ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమయిన బీజేపీ క్రమక్రమంగా బలపడి 1990-2008 కాలంలో హిందీ ప్రాంతంలోని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, దక్షిణాన కర్నాటక, గోవా రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చింది.

నరేంద్ర మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయి, 2002లో ఆ రాష్ట్రంలో ముస్లిం నరమేథంకు నాయకత్వం వహించి ఆర్ఎస్ఎస్ అధినాయకత్వం సంపూర్ణ విశ్వాసం పొంది, మరో 13 ఏళ్లు నిరాటంకంగా గుజరాత్ ప్రభుత్వ అధినేతగా ఉండి కార్పొరేట్ ఇండియా విశ్వాసం పొందాడు. దీంతో, నరేంద్ర మోదీ నయాఫాసిస్టు కాషాయ ఆర్ఎస్ఎస్, కార్పొరేట్ మద్దతుతో 2014 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ రథసారధిగా సంపూర్ణ మెజారిటీతో కేంద్రంలో ప్రధాన మంత్రిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. గడచిన 11 ఏళ్లుగా దేశ పాలకులుగా ఉన్న RSS-BJP హిందుత్వ కాషాయ కార్పోరేట్ శక్తులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్మన్‌గా ఉన్న రాజ్యాంగ రచనా కమిటీ రూపొందించిన మరియు రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన, we the people of India ప్రతిజ్ఞ పూర్వకంగా నిర్మించాలని తలపెట్టిన the sovereign socialist secular democratic republic నిర్మాణ ప్రయత్నాలను తిరోగమనంలోకి మళ్లించడమే కాకుండా, ఆ భావాన్నే ధ్వంసం చేస్తూ ఉంది. భారత రాజ్యాంగంలోని అభివృద్ధికర అంశాలన్నింటినీ నీరు కారుతోంది. ఇందుకోసం CBI, ECI, RBI మొదలగు రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటిని కేంద్ర ప్రభుత్వం యొక్క జేబు సంస్థలుగా మార్చి వేసుకుంది. మత విద్వేషాలను విపరీతంగా రెచ్చ గొడుతున్నది. కోటాను కోట్ల సంఖ్యలో ఉన్న మైనారిటీ మతస్థ ప్రజలను, ముఖ్యంగా, సుమారు 20 కోట్ల ముస్లిం ప్రజానీకాన్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా దిగజార్చే ప్రయత్నం నిరంతరాయంగా చేస్తున్నది. శతాబ్ద కాలంపాటు అనేక ఉద్యమాలు చేసి కార్మికులు సాధించుకున్న అభివృద్ధికర చట్టాలన్నింటినీ రద్దు చేసింది. బాలల విద్య దగ్గర నుంచి విశ్వ విద్యాలయ విద్య వరకు భాషా, సామాజిక శాస్త్ర పాఠ్యాంశాలన్నిటిని భారతీయ సంస్కృతిలోని సంఘ వ్యతిరేక పురాతన(బ్రాహ్మణీయ) పాఠ్యాంశాలతో నింపేసింది. ఆర్థిక రంగాన్ని పూర్తిగా విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల కబంధ కౌగిళ్ళకు అప్పజెప్పింది. ఉపాధి రహిత అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీనివల్ల దేశంలోని తారతమ్యాలు విపరీతంగా పెరిగిపోయాయి. మొత్తం దేశ సంపదలో జనాభాలోని 1% కుబేరుల గుప్పెడుల్లో 40% సంపద మేట వేయగా దిగువ 50% శ్రమజీవుల వద్ద 6.4% సంపద మాత్రమే ఉంది. అయినప్పటికీ, పురాతన సంస్కృతి పేరుతో అసంఖ్యాక సాధారణ హిందూ ప్రజానీకం మనసు, మెదడులపై పట్టు సుస్థిరం చేసుకునే ప్రయత్నాలను బీజేపీ నిరంతరం చేస్తున్నది. కానీ మతాలకు అతీతంగా సెక్యులర్ ప్రజాస్వామ్య విలువలకే అధిక సంఖ్యలో ప్రజలు ఓటు వేస్తూ ఉండటంతో, మోదీ ప్రభుత్వం జేబు సంస్థగా మారిన ఎన్నికల కమిషన్ ద్వారా పార్లమెంటరీ విపక్షాల, విప్లవ ప్రతిపక్షాల యొక్క ఓట్లను SIR ద్వారా తొలగించి శాశ్వతంగాఅధికారంలో పాతుకుపోయే కుట్రలు మొదలు పెట్టింది. ప్రతిఘటన గళాలను పరమ నిరంకుశ చట్టాల ద్వారా ఎలాంటి విచారణ లేకుండా జైలులో బంధిస్తోంది. అడవులను, ఆదివాసి బ్రతుకులను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే కార్పొరేట్ ఆర్థిక విధానాలను సాయుధంగా ప్రతిఘటిస్తున్న శక్తులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో దారుణంగా హత్యలు చేస్తూ ఉంది. వీటన్నింటి వల్ల భారతీయ సమాజం అల్లకల్లోలం అవుతోంది.

1.3. ఈ మట్టికాళ్ల మహా రాక్షసిని దాని మతోన్మాద సిద్ధాంతంతో సహా ఓడించగలిగిన మరియు లౌకిక ప్రజాస్వామ్య సామ్యవాద విధానాలను అమలు చేయగల సిద్ధాంత పటిమ గలవారు కమ్యూనిస్టులు, సాంఘిక సమానత్వం, ధార్మిక స్వేచ్ఛా స్వాతంత్రాలూ ప్రాతిపదికగా పనిచేస్తున్న సంఘాలు, పార్టీలు మాత్రమే అన్న విషయం సుస్పష్టం. వాస్తవానికి, ఈ శక్తుల అనైక్యతే, మరీ ముఖ్యంగా వామపక్షాలు చీలికలు పేలికలు అయిపోవడం మూలంగానే నియోఫాసిస్టు ఆర్ఎస్ఎస్ శక్తులు అధికారంలోకి వచ్చాయని ప్రజాస్వామ్య వాదులందరూ భావిస్తున్నారు. ప్రజలు ఈ పరిస్థితి పట్ల చాలా అసంతృప్తి చెంది ఉన్నారు. ఒక మంచి ప్రత్యామ్నాయం కోసం వారందరూ ఎదురుచూస్తున్నారు. RSS మతతత్వ సిద్ధాంతాన్ని మరియు పరమ నిరంకుశ బీజేపీ/ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడించే ప్రగతిశీల ప్రజాస్వామిక సంఘటన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని 2024 లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయి ! కనుక, బహుళత్వ భారతీయ సమాజాన్ని పరిరక్షించి అభివృద్ధి పరిచే సువర్ణావకాశం మరొకసారి ప్రగతి శీల ప్రజాస్వామ్య శక్తుల ముంగిట నెలకొంది. కానీ, వారంతట వారు అలాంటి ప్రయత్నాలను తగినంత శ్రద్ధాశక్తులతో చేస్తున్న దాఖలాలు కనిపించట్లేదు.

### రెండవ భాగం : ప్రస్తుతం మనం ఏమి చేయాలి ?

**ముందుమాట** : “తత్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ మార్గాల్లో మా త్రమే అర్థం చేసుకున్నారు. ప్రధాన విషయం ఏమిటంటే దానిని మార్చడం” అనే కార్ల్‌మార్క్స్ ప్రసిద్ధ వాక్యం. The Political power is the master key using which you can open all the doors of progress and self-respect అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ వాక్యం శిరోధార్యం కావాలి.

2.1. మన బహుళ విశ్వాసాల సమాజాన్ని విచ్ఛిన్నం చేసే RSS పరమ ప్రమాదకరమైన భావజాలాన్ని ఓడించాలి. ఖండన భండనలతో ఓడించలేము. మన ప్రాచీన సంస్కృతిలోని సజీవ అంశాల ద్వారా ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రచారం చేయాలి. మన సమకాలీన సమాజం కుల-వర్గ సమావేశం. అంటే కులం లో వర్గం ఉంది. వర్గం కులంతో ముడిపడి ఉంది. పాలకులు ప్రజలను కులాల చట్రం, మతాల చట్రంలో బంధిస్తున్నారు. కనుక మనం వర్గ దృక్పథంతో **(మిగతా 40వ పేజీలో)**

# నవంబరు 26 ప్రజల రాజ్యాంగ దినోత్సవం




- డి వి వి యస్ వర్మ

నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం నాడు ముందుగా రాజ్యాంగ పీఠికను మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. 'భారత ప్రజలమైన మనము'తో ప్రారంభమై 'రాజ్యాంగాన్ని మనము మనకు సమర్పించుకుంటున్నాము'తో ముగుస్తుంది. ఈ రాజ్యాంగం మన దేశ ప్రజలందరిది. ఇది మనందరి సొత్తు. ప్రభుత్వాలు రాజ్యాంగ దినోత్సవాన్ని లాంఛనంగా ప్రజల భాగస్వామ్యం లేని తంతుగా నిర్వహిస్తున్నాయి. పాలకులే రాజ్యాంగ భక్షకులైనప్పుడు ప్రజలే దానికి రక్షకులు కావాలి. దీనికోసం అన్ని పౌర సమాజ సంస్థలు 'ప్రజల రాజ్యాంగ దినోత్సవం' నిర్వహించుకోవాలి రాజ్యాంగం రచన కోసం 1946 డిసెంబరు 9 రాజ్యాంగ సభ ఏర్పడింది. ముసాయిదా రచనా కమిటీకి డాక్టర్ అంబేడ్కర్ చైర్మన్‌గా సారథ్యం వహించారు. రాజ్యాంగ ముసాయిదాపై చర్చలు పూర్తి కావడానికి మొత్తం రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. దీనికి తుదిరూపం ఇచ్చి 1949 నవంబరు 26న ఆమోదించారు. 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. స్వతంత్ర భారతం ఆధునిక రిపబ్లిక్‌గా అవతరించింది.

భారతదేశం వివిధ ప్రాంతాలు, భాషలు, వివిధ మతాలు, వేల సంఖ్యలో కులాల దేశం. దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగ రూపకల్పన చేయడం అంత తేలిక కాదు. నేరుగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే లోక్‌సభతోపాటు రాష్ట్రాల శాసనసభలకు ప్రాతినిధ్యం కల్పించే రాజ్యసభను ఏర్పాటు చేశారు. యూనియన్-రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజన చేశారు. మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులను కల్పించే లౌకిక రాజ్యాంగాన్ని తెచ్చారు. అందరికీ ఓటు హక్కుతో అధికారంలో సమానత్వాన్ని కల్పించారు. ఇలా దేశంలో భిన్నత్వాన్ని కాపాడు తూ ఏకత్వాన్ని సాధించే రాజ్యాంగ రచన చేశారు. రాజ్యాంగ లక్ష్యాలను, విలువలను స్పష్టంగా, సంక్షిప్తంగా క్రోడీకరించి ఒక అద్భుతమైన పీఠికను రూపొందించారు. భారతదేశాన్ని సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించాలని పీఠిక ప్రకటించింది. ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందించే హామీని ఇచ్చింది. దేశ సమైక్యతకు ప్రజల మధ్య సౌభ్రాతృత్వం సాధిం చాలని చెప్పింది. వీటిని రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులుగా - ప్రభుత్వాల కర్తవ్యాలను నిర్దేశించే ఆదేశిక సూత్రాలుగా పొందుపరిచారు. "రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేయాల్సిన వారు చెడ్డవారైతే అది చెరుపు చేస్తుం ద"ని నవంబరు 26న రాజ్యాంసభ ముగింపు సమావేశంలో డాక్టర్ అంబేడ్కర్ చేసిన హెచ్చరికను మనం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం మనం అలాంటి స్థితిలో వున్నాం.

రాజ్యాంగబద్ధ పాలనకు చెరుపు చేసేవారు పాలకులయ్యారు. గత పదేళ్లకు పైగా ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నది. పీఠికలోని సామ్యవాద, లౌకిక పదాలను తొలగించాని రచ్చ చేస్తున్నారు. సాధు బృందాల పేరుతో "హిందూ రాష్ట్ర" రాజ్యాంగ ముసాయిదాను విడుదల చేసి మొత్తం రాజ్యాంగాన్ని తుద ముట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు.



తణుకులో పౌరసమాజ సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం

మోదీ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాన్ని తన గుప్పిట లోకి తెచ్చుకుంది. పదవీ విరమణ తర్వాత పదవులను కట్టబెట్టే ప్రలోభాలతో అనుకూలమైన తీర్పులు పొందుతున్నది. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించవలసిన భారత ఎన్నికల సంస్థను తన అధీనంలోకి తెచ్చుకుంది. బీహార్ ఎన్నికల్లో గెలిచింది బీజేపీ కూటమి కాదు, గెలిపించింది ఎన్నికల కమిషన్ అన్నది కాదనలేని వాస్తవం. తమ రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ, ఈడీలను వాడుకోవడం ప్రతిరోజూ చూస్తున్నదే. రాజ్యాంగం దేశ ప్రజలను ఐక్యం చేసే పద్ధతులను రూపొందిస్తే దానికి విరుద్ధంగా ఓట్ల కోసం కుల, మత, ప్రాంతీయ, భాషా పరమైన విద్వేషాల చుట్టూ విభజన రాజకీయం వారు సాగిస్తున్నారు. ఇప్పుడు రాజ్యాంగానికి విరుద్ధమైన రెండు శక్తులు వున్నాయి. ఒకటి దేశాన్ని పాలిస్తున్న బీజేపీ, సంఘ పరివారం. మరొకటి దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులు. ఇవి రెండూ పెనవేసుకుని వున్నాయి. పరస్పర సహకారంతో, ఆదాన ప్రదానాలతో ఒకరు అధికారాన్ని మరొకరు దేశ సంపదను చేజిక్కించుకుంటున్నారు.

మోదీకి వున్న జనాకర్షణ ఆయన పరిపాలనా దక్షత నుంచి వచ్చింది కాదు. ఆయన పాలన ఒక వైఫల్యాల పుట్ట. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ బాదుడు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, మేకిన్ ఇండియా, స్మార్ట్ సిటీలు, రైతుల ఆదాయం రెట్టింపు వగైరా లన్నీ దీనికి అద్దం పడతాయి. 230 లక్షల కోట్లకుపైగా అప్పుల చెయ్యడం, అదానీ, అంబానీలను ప్రపంచంలో అత్యధిక సంపన్నులను చెయ్యడం, కార్పొరేట్ శక్తులకు రుణమాఫీలు, రాయితీలుగా 20 లక్షల కోట్లు ప్రజల సొమ్మును దానం చేయడమే ఆయన సాధించిన విజయాలు. మోదీ తనను తాను హిందూ జాతీయవాదిగా ప్రకటించుకున్నారు. మెజారిటీ మత జాతీయవాద ఉన్మాదాన్ని ప్రేరేపించడానికి హిందూత్వను, హిందూ మతానికి జత చేసి రాజకీయం చేస్తున్నారు. "హిందూత్వ" హిందూ మతం ఒకటి కాదు. హిందూత్వలో మతం లేదు. అది కేవలం "మత రాజకీయం" మాత్రమే. కాని హిందూ మతం ఒక విశ్వాసం. దానికంటూ తనదైన ఒక ప్రత్యేక రాజకీయం లేదు. కాని మోదీ, సంఘ పరివారం ఈ రెంటినీ కలగాపులగం చేసి ఓట్ల కోసం మతపరంగా ప్రజలను విభజించి విద్వేషాన్ని, ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. ఇందులోనే మోదీ జనాకర్షణ శక్తి దాగి వుంది. దీనికితోడుగా ఎన్నికలకు అపారమైన నిధులను అందించగల కార్పొరేట్ శక్తుల మిత్రగణాన్ని పెంచి పోషిస్తున్నారు. దీనికి "గోదీ" మీడియా బాకాలు ఊదుతున్నాయి. మరో పక్క స్వతంత్రం రాజ్యాంగ సంస్థలు తలలు వంచుతున్నాయి. మోదీ జనాకర్షణ సాధన వెనుక ఇన్ని శక్తులున్నాయి. అది ఒక కృత్రిమ సృష్టి నుంచి ఒక ఉన్మాదం నుంచి పుట్టుకొచ్చిన జనాకర్షణ యువత, మధ్యతరగతి వర్గాలు ఈ ఆకర్షణకు లోనౌతున్నారు. వారిలో హిందూత్వకు, హిందూమతానికి వున్న తేడాను గుర్తించలేని భావజాల గందరగోళం వుంది.

మత స్వేచ్ఛ అందరికీ వుండాలి. కాని మనం వేసే ఓటు లక్ష్యం వేరు. దానిని కుల, మతాలకు అతీతంగా మంచి పాలన కోసం వినియోగించాలి అన్న చైతన్యాన్ని "ప్రజల రాజ్యాంగ దినోత్సవం" ప్రచారంలో భాగం చెయ్యాలి. మరొక అంశం హిందువులకు ఒక దేశం వుండాలని సంఘ పరివారం చేస్తున్న ప్రచారానికి కొందరు లోనవుతున్నారు. ఏ మతరాజ్యంలోనైనా రాజ్యాంగం వుండదు. దాని స్థానాన్ని మత గ్రంథాలు ఆక్రమిస్తాయి. పౌరులందరూ సమానం అన్న ప్రజాస్వామ్యం వుండదు. వివక్ష, విద్వేషం రాజ్యం చేస్తాయి. పౌర హక్కులు, స్వేచ్ఛ నామ మాత్రం అవుతాయన్న స్పృహ కలిగించే ప్రచారం జరగాలి. అలాగే భావి తరాలు కానున్న విద్యార్థులకు "రాజ్యాంగ పీఠిక పఠనం – పీఠిక ప్రతిజ్ఞ" వంటి కార్యక్రమాలతో రాజ్యాంగ విలువలను పరిచయం చెయ్యాలి.


మన దేశంలో రకరకాల శ్రమ జీవులే అత్యధిక సంఖ్యలో ఓటర్లుగా వున్నారు. రాజకీయ పరిభాషలో వారు షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర వెనుకపడిన కులాలు, మైనారిటీలు ఇతర పేదల రూపంలో కనిపిస్తారు. పాలక పార్టీల వాగ్దానాల చుట్టూ తిరుగుతూ "లబ్ధిదారుల భావన"తో వున్నారు. కాని రాజ్యాంగం ప్రకారం వారు హక్కుదారులు. రాజ్యాంగం అందరికీ జీవించే హక్కును, ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "గౌరవప్రదమైన జీవితం" ప్రజల ప్రాథమిక హక్కు. అంటే నివాస వసతి, ఆహార భద్రత, వైద్య సేవలు, పిల్లలకు చదువు పాలకుల దయాదాక్షిణ్యాల మీద కాకుండా పొందడం రాజ్యాంగ హక్కు. ఇది జరగాలంటే మోదీ పాలనలతో కార్పొరేట్లు దేశాన్ని దోచుకుని పోగు చేసుకున్న సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సంపద కేంద్రీకరణ జరగకూడదని, సహజ వనరులు ప్రైవేటుపరం కాకూడదని ప్రకటించింది. అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించే లక్ష్యాన్ని ప్రకటించింది. ప్రముఖ ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం వివిధ పన్నుల ద్వారా ఏటా 15 లక్షల కోట్లు శ్రమజీవుల సంక్షేమానికి సమకూరతాయి. వారికి పైహక్కుల అందించడంతోపాటు పేదలకు కనీస ఆదాయ పథకం, రైతులకు చట్టబద్ధంగా మద్దతు ధరలు, యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అందించవచ్చు. సంపద పునఃపంపిణీ నినాదం అత్యధిక సంఖ్యాకులను సమీకరిస్తుంది. మోదీ హిందూత్వని – దాని కుమ్మక్కుదారులైన కార్పొరేట్లను ఓడించగల శక్తి అవుతుంది. ఇలాంటి కార్యక్రమాలతో "ప్రజల రాజ్యాంగ దినోత్సవాన్ని" అర్థవంతంగా నిర్వహించుకోవాలి. ❑

# సమైక్యతా లోపంతో ఫలించని గోర్ఖాలాండ్ ఉద్యమ నేపథ్య నవల 'విఫల'



- శిరంశెట్టి కాంతారావు

పాఠకులకు ఈ నవలా వస్తువైన ప్రత్యేక గోర్ఖాలాండ్ కోసం అక్కడి ప్రజలు సాగించిన ఉద్యమ నేపథ్యాన్ని కొద్దిగానైనా చదివి అర్థం చేసుకుంటే తప్ప ఈ నవల యొక్క స్వారస్యం ఏమిటో పాఠకులకు అర్థం కాదు. ఆ ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న లేఖ్‌నాథ్ ఛత్రీ మొట్ట మొదట నేపాలీ భాషలో వ్రాశాడు. దాన్ని అనురాగ్ బాస్నేత్ ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేశారు. దాన్ని హర్ష యర్రగుంట ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేస్తే, ఛాయా రీసోర్స్ సెంటర్ మోహన్‌బాబు పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు. అందుకు వారికి, వారి సిబ్బందికి, సంస్థకు అభినందనలు. ఒక చారిత్రక నేపథ్యం వున్న నవల మన చేతుల్లోకి రావడం వెనుక ఇంత కథ వుంది. ముఖ్యంగా మనం తెలంగాణ ప్రాంతం వారం. ఈ నవలను చదవడం ద్వారా మన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని మరోసారి పునశ్చరణ చేసుకున్నట్లు అవుతుంది. ఏ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమైనా స్థానిక ప్రజల భాషా సాంస్కృతిక, ఆచార వ్యవహారాల మూలాలను దెబ్బ తీసే విధంగా ఇతర ప్రాంతాల వారు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తే మొదలవుతాయి. అందుకు మరో నిదర్శనం గోర్ఖాలాండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం. పశ్చిమ బెంగాల్లోని కొండ ప్రాంతాలైన డార్జిలింగ్, కలింగ్ పాంగ్, దూర్, జల్పాయిగురి, ఆలీపూర్‌దొర్, కూల్ బిహారీ మొదలైన జిల్లాల్లో నేపాలీ మాతృభాషగా కలిగిన అధిక శాతం ప్రజలు నివశిస్తున్నారు. అధిక సంఖ్యాకులైన బెంగాలీ పాలకులపై ప్రాంతాల్లోని అన్ని పాఠశాలల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోను బెంగాలీ భాషను బలవంతంగా రుద్దాలన్న ప్రయత్నాన్ని అడ్డుకోవడం ఫలితంగానే ప్రత్యేక గోర్ఖాలాండ్ ఉద్యమానికి బీజాలు పడ్డాయి. ఆ బీజాలు బ్రిటిష్ వారి హయాంలో 1909లో మాంటేగ్-ఛేమ్స్ ఫర్డ్ సంస్కరణల్లో భాగంగా మొదటిసారి 'హిల్ మెన్స్ అసోసియేషన్ ఆఫ్ డార్జిలింగ్' పేర ఏర్పడింది. దాని ప్రయత్నాల ఫలితంగా ప్రత్యేక పరిపాలన విభాగం ఏర్పాటు చేశారు. గోర్ఖాలాండ్‌గా పిలువబడే భూభాగం




ప్రచురణ : ఛాయా రిసోర్సెస్ సెంటర్
పేజీలు : 145 - వెల : రూ.175/-
పుస్తకం కోసం సంప్రదించాల్సిన నెంబరు : 70931 65151

7,500 చ.కి.మీ. వైశాల్యం. సిక్కిం, గోవా రాష్ట్రాలకన్నా పెద్ద భూభాగం. ఇక్కడి నివసించే వారు 40 లక్షలుకన్నా ఎక్కువే. ఆ జనాభా మణిపూర్, త్రిపుర రాష్ట్రాల జనాభాకు సమానం. మొత్తం జనాభాలో గోర్ఖాలు 35%, నేపాలీ మాట్లాడే వారు 40%, మిగిలిన వారు రాజబోంగీస్ 25%, ఆదివాసీలు 20%, బెంగాలీలు 15% ఇతరులు 5% వుంటారు. 1907 నుండే గోర్ఖాలాండ్ ఏర్పాటు విషయంలో ఆలోచనలు సాగుతున్న నేపథ్యంలో 1988లో సుభాష్‌షింగ్ ఘీ షింగ్ నాయకత్వంలో గోర్ఖాలాండ్ ఉద్యమం ప్రారంభమై ఉధృతంగా నడిచి చివరికి హింసాత్మకంగా మారి 1200 మంది మరణించారు. దాని ఫలితంగా డార్జిలింగ్ గోర్ఖాహిల్ కౌన్సిల్ (డి.జి.హెచ్.సి.), గోర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(జియన్‌యల్‌యఫ్) ఏర్పడ్డాయి. ఆ సంస్థలన్నీ ప్రత్యేక గోర్ఖాలాండ్ కోసం ఉద్యమించసాగాయి. 2007లో గోర్ఖా జనముక్తి మోర్చ(జిజెయం) ఏర్పడింది. అనేక కారణాల చేత కొన్నాళ్ళపాటు ఘీషింగ్ తెరమరుగయ్యాడు. 2010 మే 21న జి.జె.యమ్. కార్యకర్తలు అఖిల భారతీయ గోర్ఖాలీగ్ నాయకుడు మదన్ తమాంగ్‌ను డార్జిలింగ్‌లో దారుణంగా హత్య చేశారు. తర్వాత అనేక మలుపులు తిరిగిన ఈ ఉద్యమంలో ఏర్పడిన అనైక్యతల కారణంగా ప్రత్యేక రాష్ట్ర సాధన ఇప్పటికి సాకారం కాలేదు. ఇదీ స్థూలంగా ఉద్యమ చరిత్ర.

ఈ పుస్తకం 31 ఖండికలతో 145 పేజీల కూర్చబడినది. ఆ 31 ఖండికలను విడి విడిగా చదివితే దేనికదే ఓ మంచికథ. వాటి శీర్షికలు వినూత్నంగా వుంటాయి. అన్నింటినీ కలిపి ఆలోచిస్తే ఓ అద్భుతమైన, ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని ఎందరు ఎంతెంత దుర్మార్గాలకు? స్వార్థపరత్వాలకు తెగబడతారో!? ఎంత మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతారో ? ఎన్నెన్ని కుటుంబాలు నిలువ నీడలేకుండా కునారిల్లిపోతాయో ? ఎన్ని గుండెలు మోయలేని దుఃఖంతో కనలిపోతాయో ? కళ్ల ముందు దృశ్యమానమై పాఠకులను చికాకు పరుస్తాయి. సంవేదనకు, ఆలోచనకు లోను చేస్తాయి. **(మిగతా 43వ పేజీలో)**

# మద గజాన్ని నిలువరిస్తున్న గడ్డిపోచలు



- అశోక్ కుంబము

ఈ వ్యాసం నవంబరు 2016లో అమెరికన్ ఆదివాసీల చరిత్ర, వాళ్ల జీవితాల గురించి రాసింది. వాళ్ల మీద జరిగిన, జరుగుతున్న హింస, వాళ్ళు భాగమై బతికే ప్రకృతి విధ్వంసం గురించి రాసింది. చరిత్ర పొడువునా వాళ్లు చేసిన పోరాటాల గురించి రాసింది. ముఖ్యంగా "అభివృద్ధి" పేరిట కార్పోరేట్ ప్రయోజనాల కోసం అమెరికన్ రాజ్యం నిర్మించతలపెట్టిన ప్రకృతి విధ్వస ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి సంబంధించింది. "మేము ఈ నేల మూలవాసులం. ప్రకృతిలో ప్రకృతిగా బతికినోళ్లం. ఈ ప్రకృతిని కాపాడుకుంటం. కేవలం మా కోసమే కాదు, మీ కోసం మీ పిల్లల భవిష్యత్ కోసం కూడ మేము పోరాడుతం" అని గడ్డి పోచలు చేతుల్లో పట్టుకుని ప్రమాణం చేస్తూ మదపుటేనుగులాంటి అమెరికన్ రాజ్యంతో తలపడిన చరిత్రను మరోసారి గుర్తుచేసుకోవాలనిపించింది.

బస్తర్లో ఆదివాసీలను చంపుతుంటే పొగబారిన డిల్లీ గేట్ దగ్గర విద్యార్థులు చేసిన నినాదాలు ఈ వ్యాసాన్ని నాకు మళ్ళీ గుర్తు చేశాయి. దేశానికి ఊపిరిత్తుల వంటి మధ్య భారత అడవులను కార్పోరేట్లకు అప్పగించడానికి అక్కడ ఉన్న ప్రకృతి సంరక్షకులను (ఆదివాసులను, విప్లవకారులను) అంతం చెయ్యడానికి పాలక వర్గ పార్టీలు రోజులు లెక్కపెడుతున్నాయి. ప్రతిరోజు హింసను కొనసాగిస్తున్నారు. కాని మైదానానికి, అడవికి మధ్య ఉండే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని (మార్క్స్ మాటలో చెప్పాలంటే metabolic rift మూలంగా) మైదానం గాలి పీల్చలేని పరిస్థితి వచ్చినప్పుడు మొత్తం సమాజం అనివార్యంగా అడవి వైపే చూడాల్సి వస్తుంది. ఈ రోజు నిరసనకారులు ఊపిరాడని పరిస్థితిని ప్రశ్నిస్తే వాళ్ళ గొంతు మీద కాలుబెట్టి రాజ్యం తొక్కుతుండొచ్చు. కాని ఏదో ఒక రోజు తన మనుగడకోసమైనా అడవి, మైదానం ఏకమవుతాయి. ఊపిరాడని వ్యవస్థలో పోరాట రూపం ఏదైనా ప్రకృతి, ప్రజలు విముక్తి మార్గం పట్టాల్సిందే!)

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పండితులు, మేధావులు, మీడియా అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను, జరగబోయే పరిణామాలను విశ్లేషిస్తుంటే అమెరికన్ ఆదివాసులు (Native Americans) మాత్రం ఎవరు గెలిచినా, ఓడినా మాకేంటి అనడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎందుకంటే, వాళ్ళు తరతరాలుగా అమెరికన్ రాజ్య వ్యవస్థతో మోసగించబడి, తిరస్కరించబడి బతుకుతున్నవాళ్ళు. ఇప్పటికీ నిత్య వివక్ష, అణిచివేత అనుభవిస్తున్న వాళ్ళు. మార్టిన్ లూథర్ కింగ్ అన్నట్లు "అమెరికా మారణహోమం నుండి పుట్టిన దేశం." ఆ దేశ నిర్మాణంలో తెగిన తలలన్నీ ఆదివాసులవీ, నల్లజాతి బానిసలవే. అంతేకాదు, వాళ్ళ జీవితాలలో చూసిన ఎంతోమంది కరమైన నరహంతకులతో పోల్చుకుంటే ట్రంప్ ఒక లెక్కా కాదు, సరికొత్త పరిణామం అంతకన్నా కాదు. అలాగని ఎన్నో వర్గాలకి, సమూహాలకి ట్రంప్ గెలుపు తెచ్చిన భయం అర్థరహితమూ కాదు.

చారిత్రాత్మక ఆక్స్‌ఫర్డ్ సమావేశంలో మాల్కం ఎక్స్ అన్నట్లు "ఒకడు దైవదూత రూపంలో వచ్చి దయ్యంలా పడుతాడు. మరొకడు తన దయ్యం రూపాన్ని ముందే ప్రకటించి వస్తాడు." రూపాలు వేరైన సారంలో ఇద్దరూ ఒక్కటే. అందుకే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచినా, హిల్లరీ గెలిచినా వాళ్ళ పరిస్థితి ఏమీ మారదని ఆదివాసులకు స్పష్టత వుంది. అమెరికన్ రాజ్యానికున్న దురాక్రమణ, అణిచివేత, సామ్రాజ్యవాద స్వభావాన్ని మార్చలేని ఏ రాజకీయ ప్రక్రియల మీద వాళ్ళకు నమ్మకం లేదు. ఇది వాళ్ళకు పుస్తక జ్ఞానం కాదు. అనుభవ సారం. వాళ్ళ చరిత్ర నిండా కన్నీళ్లే. వాళ్ళను పలకరిస్తే మాయని గాయాలను తడిమినట్లుంటది. మొత్తం మానవ చరిత్రలోనే మరే జాతి అనుభవించనంత హింసను, నరమేధాలను అనుభవించిన ఈ జాతులు, ఇప్పుడు మళ్ళీ పునర్జీవనం పొంది అమెరికన్ రాజ్యంతో, అది కాపాడే బహుళజాతి సంస్థలతో పోరు చేస్తున్నాయి. గడిచిన ఐదు వందల ఏండ్లలో సర్వం కోల్పోయి సహితం ఇప్పుడు మళ్ళీ పోరాట మార్గం ఎంచుకున్న ఈ ఆదివాసులు, ట్రంప్ ను చూసి భయపడే అన్ని వర్గాలకు ఏమిచేయాలో చేసి చూపిస్తున్నారు.

నార్త్ డకోట రాష్ట్రంలోని చమురు నిక్షేపాలనుండి ముడి చమురును నాలుగు రాష్ట్రాల గుండా ఇలినాయి రాష్ట్రానికి తరలించడానికి Energy Transfer Partners అనే ఆయిల్ కంపనీ దాదాపు 1800 మైళ్ళ దూరం పైప్ లైన్ వేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రోజూ 5.7 లక్షల బ్యారెల్స్ ముడి చమురును సరఫరా చేయవచ్చని అంచనా. దీనికంతటికి కాబోయె వ్యయం 370 కోట్ల డాలర్లు. ఈ ప్రాజెక్ట్‌కు రాజ్యం మద్దతు పలకడంతో అన్ని అనుమతులు వెనువెంటనే వచ్చేసినవి. పైప్ లైన్ పని మొదలయ్యి నార్త్ డకోట కు చేరే సరికి "స్టాండింగ్ రాక్" అనే చిన్న ఊరిలో వుండే లకోట తెగ

ఆదివాసులు (లకోట అంటే సుయన్ భాషలో "స్నేహితులు" అని అర్థం. లకోట వాళ్ళ మండలికం కూడ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దానికి కారణాలు: మొదటిది, ప్రతిపాదిత పైప్ లైన్ ఆదివాసులు "పవిత్ర భూమి"గా పిలుచుకునే వాళ్ళ పూర్వీకుల బొందల గడ్డలు తొవ్వుకుంటూ పోతుంది. ఇది వాళ్ళ చారిత్రిక, సాంస్కృతిక విధ్వంసానికి సంబంధించింది. ముఖ్యంగా చరిత్రలో డాక్యుమెంట్ కాబడిన "వూండెడ్ నీ మారణకాండ" (Wounded Knee Massacre)లో చంపబడిన దాదాపు 300 మంది లకోట ఆదివాసులను పూడ్చి పెట్టిన Wounded Knee అనే ప్రాంతం ఇక్కడే వుంది. (ఈ మారణకాండ ఆధారంగా డీబ్రౌన్ అనే నవలా రచయిత 1970లో Bury My Heart at Wounded Knee అనే పుస్తకాన్ని ప్రచురించిండు. అదే పేరుతో, ఈవ్స్ సిమనోవ్ అనే ఫ్రెంచ్ కనేడియన్ దర్శకుడు 1976 లో సినిమాగా కూడ తీశాడు.) ఇక రెండోది, పైప్ లైన్ వాళ్ళకు తాగునీరు అందించే మిజోరి నది మరియు ఇతర నీటి వనరుల గుండా పోతుంది. ఒకవేళ, నీళ్ళలో పైప్ లైన్ ప్రమాదం జరిగితే లక్షలాది మందికి నీటి సమస్య ఎదురవుతుంది. వాళ్ళు అనుమానిస్తున్నట్లుగా, అలాంటి ప్రమాదాలు ఇప్పటికే చాలా జరిగాయి. వాళ్ళ ప్రాంతంలోనే 2012-2013 సంవత్సరంలో 300లకు పైగా పైప్ లైన్స్ ప్రమాదానికి గురైనవి. అంతేకాదు ఒక్కసారి పైప్ లైన్ వేసిన తరువాత వాటి మీద నిఘా కాని, నియంత్రణ కాని చేసే పటిష్టమైన యంత్రాంగం, విధానం ఏది లేదు.

ఆదివాసులు చెప్పిన అభ్యంతరాలను కాదని, కంపనీ పనులు మొదలు పెట్టింది. దానికి వ్యతిరేకంగా, ఆదివాసులు గత అగస్ట్ లో ప్రత్యక్ష పోరాటంలోకి దిగిండ్రు. వాళ్ళు ప్రేమకి, శక్తికి, ఆధ్యాత్మతకి చిహ్నంగా భావించే గడ్డిపోచలను (sweetgrass) చేతపట్టుకొని ఒంటరయి పోయి ఇంకా మిగిలివున్న 300 తెగలు ఏకమై ఐక్యపోరాటం మొదలుపెట్టిండ్రు. కంపనీ తన ప్రైవేట్ సైన్యంతో అణిచివేత కొనసాగించింది. కుక్కలతో దాడి చేయించింది. (ఆదివాసులపై, నల్లజాతి వాళ్ళపై కుక్కలతొ దాడి కొత్తేమి కాదు). గుర్రాలతో తొక్కించింది. రాజ్యం కంపనీలకు సాయంగా వందల సంఖ్యలో సాయుధ బలగాలను పంపింది. వందలాది ఆదివాసులను నిర్భందించారు. "డెమొక్రసీ నౌ" వంటి ప్రత్యామ్నాయ మీడియా ఆ "కుక్కల" దాడిని చిత్రించి సెప్టెంబర్ 3న ప్రపంచానికి చెప్పేవరకు, ప్రధాన స్రవంతి మీడియాలో ఎలాంటి చలనం కలగలేదు. ఎంత హింస ప్రయోగిస్తున్నా, ఆదివాసులు వెనకడుగు వేయకుండా పోరాడుతున్నారు. దాదాపు వందకు పైగా పెద్దలు, పిల్లలు పైప్ లైన్ కు అడ్డంగా టెంట్లతో క్యాంప్ వేసుకొని అక్కడే వుంటున్నారు. ఎముకులు కొరికే చలిలో (దాదాపు జీరో డిగ్రీస్ సెంటిగ్రేడ్స్) ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతుంటే, వాళ్ళు గడ్డ కట్టుకు పోయేలా పోలీస్ బలగాలు అతిచల్ల నీళ్ళను నీటి ఫిరంగులతో కొడుతున్నారు. దీని మూలంగా హైపోతెర్మియా (అంటే శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోయి ప్రాణాంతక పరిస్థితి రావడం) వచ్చి క్యాంప్ ఖాళీ చేసి పోతారని ఒక ప్రయత్నం చేస్తున్నారు. దీనికితోడు, రబ్బర్ బుల్లెట్లు, పెప్పర్ స్ప్రేలు, చివరికి హ్యాండ్ గ్రనేడ్లు ప్రయోగిస్తున్నారు. నిమోనియా వంటి వ్యాధులు రావడానికి రాత్రుళ్ళు హెలిక్యాప్టర్స్ ద్వారా కొన్ని రసాయనాలను చల్లుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వాళ్లు అక్కడి నుండి కదలడం లేదు. ఇప్పటి వరకు జరిగిన విధ్వంసం ఇక సాగనియ్యమని తెగేసి నిలబడ్డారు. Enough is enough అని నినదిస్తున్నారు. వాళ్ళకు ప్రజాస్వామిక శక్తులు, పర్యావరణ కార్యకర్తలు అండగా నిలుస్తున్నారు.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి, ఆశ్చర్యంగా 2000 మంది మాజీ సైనికులు ఆదివాసులకు రక్షణ కవచంగా నిలబడుతమని స్టాండింగ్ రాక్‌కు బయలుదేరి పోతుండ్రు. అది ఇప్పుడు కేవలం ఆదివాసి అస్తిత్వ పోరాటమే కాదు. మనిషిని ప్రకృతిని ఏకం చేసే పెట్టుబడిదారి వ్యతిరేక పోరాటమయ్యింది. ఆదివాసులు "నీటి రక్షకులుగా" మారారు. వాళ్ళు కేవలం ఈ భూమి మాది, నది మాది అనడంలేదు. మేము ఈ నదికి, భూమికి చెందినోళ్ళము. మమ్ముల ప్రకృతి నుండి వేరు చేయవద్దని అంటున్నారు. ఈ పోరాటం చేయడం అంటే "మా గాయాలను మేమే నయం చేసుకోవడం" అంటుండ్రు. నిజమే, ఆ గాయాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. కొలంబస్ వాళ్ళను "కనిపెట్టి"నప్పటి నుండే ఆ చరిత్ర మొదలయ్యింది.

ఈస్ట్ ఇండియాకు పోవాలని బయలుదేరిన కొలంబస్ సముద్ర మార్గంలో దారితప్పి చివరికి 1492లో అమెరికన్ ఆదివాసుల "కొత్త ప్రపంచం"లోకి అడుగుపెట్టిండు. అక్కడున్న ఆదివాసులు ఇండియన్లను పోలివున్నారని వాళ్ళకు "రెడ్ ఇండియన్ల"ని పేరు పెట్టిండు. అక్కడున్న బంగారు గనులు కొల్లగొట్టడానికి తనతో తీసికెళ్ళిన మందిని, మందుగుండును, గుర్రాలను, వేటకుక్కలను ఉపయోగించి ఆదివాసులను బానిసలుగ మార్చుకున్నడు. (కొలంబస్ వారసులు ఇవే అణిచివేత పద్ధతులు ఇప్పటికి వాడుతుండ్రు!) ఆదివాసుల అమాయకత్వం, మంచితనం గురించి యూరప్‌లో ప్రచారం కావడంతో అక్కడి నుండి వలసలు మొదలయినవి. యూరప్‌లో కొన్ని మత విశ్వాసాల మీద దాడి జరిగినప్పుడు, రాజకీయ అభద్రత పరిస్థితి వచ్చిన ప్రతి చారిత్రిక సందర్భంలోనూ, అమెరికన్ ఆదివాసుల "కొత్త ప్రపంచమే" యురోపియన్లకు సురక్షిత ప్రాంతమయ్యింది. (ఈ వలసల కాలంలోనే refuge, refugee అనే పదాలు బాగ వాడుకలోకి వచ్చాయి. సరిగ్గ అదే కారణాలతో ఇప్పుడు రావాలనుకునే refugeesను రానివ్వనని ట్రంప్ శపథం చేస్తుండు).

అలా మొదలయిన వలసలు సమూహాలుగా సమీకృతమై రాజ్యాలను నిర్మాణం చేసుకోవడం మొదలుపెట్టారు. 1607లో వర్జీనీయాలో మొదటి వలస రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక అది మొదలు, వలస రాజ్యాల సంఖ్య పెరుగుతూ పోయింది. ఇదే క్రమంలో వలసదారులు వాళ్ళ ఉత్పత్తి అవసరాల కోసం, బానిసల కోసం ఆఫ్రికా నుండి నల్లజాతి వాళ్ళను బలవంతంగా తీసుకొచ్చారు. బ్రిటిష్ రాచరిక పెత్తనం దాని 13 వలస రాజ్యాలపై పెరగటంతో, దానికి వ్యతిరేకంగా వలసవాదులు తిరుగుబాటు చేశారు. అదే అమెరికన్ విప్లవం. పేరులో విప్లవం వుంది కాని అందులో ఎలాంటి సామాజిక న్యాయం లేదు. ఎందుకంటే అది కేవలం వలస రాజ్యాల అధిపతుల స్వేచ్ఛ కోసమే. వాళ్ళందరూ బానిస యజమానులే. వందలాది బానిసలను సొంత ఆస్తిగా కల్గివుండి, వాళ్ళనే వ్యాపార వస్తువుగా చేసినవాళ్ళు. అందుకే ఆ తిరుగుబాటులో ఆదివాసులను, నల్ల బానిసలను కూడా సైనికులుగా వాడుకున్నరు. "విప్లవం" తర్వాత వాళ్ళకు విముక్తి కల్పిస్తమని నమ్మించి మోసం చేసిండ్రు. చివరగా, 1776లో 13 వలస రాజ్యాలు కలిసి కొత్తగా అమెరికా రాజ్యం పుట్టుకొచ్చింది. స్వాతంత్ర్య ప్రకటన రాసిన (మూడవ అమెరిక అధ్యక్షుడు) థామస్ జెఫర్సన్ "మానవులంతా సమానంగా సృష్టించబడ్డారు" అని ప్రకటించాడు. కాని ఆదివాసులు, నల్ల జాతీయులు కూడ మానవులే అని మరిచిపోయిండు. ఆ ప్రకటన చేసేనాటికే ఆయన 175 మంది బానిసలకు యజమాని.

అయితే 17వ శతాబ్దం నుండే వలస రాజ్యాలు ఆదివాసులతో అనేక ఒప్పందాలు చేసుకున్నాయి. వాళ్ళు నివసించే భూభాగంపై వాళ్ళకే హక్కులు ఇవ్వబడ్డాయి. కాని, ఆ ఒప్పందాలను తుంగలో తొక్కి వాళ్ళ కాళ్ళకింది భూమిని లాగే ప్రయత్నం మొదటినుండి జరుగుతూనే వచ్చింది. ముఖ్యంగా ఏడవ అమెరికన్ అధ్యక్షుడు (డెమొక్రాటిక్ పార్టీ వ్యవస్థాపకుడు కూడ అయిన) ఆండ్ర్యూ జాక్సన్ 1830లో తెచ్చిన "ద ఇండియన్ రిమూవల్ ఆక్ట్" మూలంగా భూమిని గుంజుకునే ప్రయత్నం చట్టబద్ధమయ్యింది. అతను సాగించిన నరమేధానికి వలసవాదులు అతనిని "పదునైన కత్తి" అని పొగిడితే, ఆదివాసులు మాత్రం "ఇండియన్ కిల్లర్" గానే గుర్తుపెట్టుకున్నారు. ఈ కొత్త చట్టంతో 80 వేల మంది ఆదివాసులను వాళ్ళ విశాల భూభాగం నుండి తొలగించి కొన్ని నిర్దేశిత "ఇండియన్ ప్రాంతాలకు" (వాటినే రిజర్వేషన్స్ అంటారు) బలవంతంగా నెట్టివేశారు. ఈ ఒక్క చట్టం ద్వారానే 1.5 కోట్ల ఎకరాల భూమిని వలసవాదులు తమ ప్రాంతంలో కలుపుకున్నారు. ఆండ్ర్యూ జాక్సన్ కొనసాగించిన మారణహోమాన్ని మరవని ఆదివాసులు అమెరికన్ 20 డాలర్ నోట్ పై వున్న అతని బొమ్మని తొలిగించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. (చివరిగా, 2020 నుండి ఆండ్ర్యూ జాక్సన్ బొమ్మ తొలిగించి బానిస తిరుగుబాటు నాయకురాలు హార్రియత్ టబ్మన్ (1820–1913) బొమ్మను ముద్రిస్తమని ఒబామ ప్రభుత్వం ప్రకటించింది. హార్రియత్ టబ్మన్ బానిసత్వం నుండి తప్పించుకొని వందలాది బానిసల విముక్తికై పోరాటం చేసింది. నేరమయమైన రాజ్యాన్ని సాయుధంగానే ఎదిరించాలని ప్రతిపాదించి, ఆచరించిన జాన్ బ్రౌన్ తో కలిసి పనిచేసింది. బ్రౌన్ ను రాజ్యం డిసెంబర్ 02, 1859 లో ఉరి తీసినప్పుడు అతను అమరుడని కీర్తించింది. మరో బానిస తిరుగుబాటు నాయకుడు ఫ్రెడెరిక్ డగ్లస్‌తో కూడ కలిసి పనిచేసిన చరిత్ర టబ్మన్‌కు వుంది.)

ఆండ్ర్యూ జాక్సన్ తెచ్చిన చట్టానికి కొనసాగింపుగా, 1851లో "ఇండియన్ అప్రోప్రియేషన్స్ ఆక్ట్" ను తీసుకొచ్చి ఆదివాసులను రిజర్వేషన్లకు పరిమితం చేసి, వాళ్ళు అనుమతి లేకుండా తెల్లవాళ్ల భూభాగంలోకి అడుగు కూడా పెట్టవద్దనే నిబంధనలు విధించిండ్రు. అంతటితో ఆగకుండా 1887లో "ది జెనెరల్ అలాట్మెంట్ ఆక్ట్"ని తీసుకొచ్చిండ్రు. దాని ముఖ్య ఉద్దేశం సామూహిక జీవనం చేసే ఆదివాసి జీవితాలలోకి వ్యక్తిగత ఆస్తిని ప్రవేశపెట్టి, వివిధ తెగల సంస్కృతిని, అస్తిత్వాన్ని, ఐక్యతను దెబ్బతీయడం. అందులో భాగంగానే వాళ్ళ రిజర్వేషన్ భూములను చిన్న చిన్న పార్సల్స్‌గా చేసి తెగ సభ్యులను హక్కుదార్లు చేసిండ్రు. సభ్యులు ఆ భూమిని 25 ఏండ్ల తరువాత ఎవరికైన అమ్ముకోవచ్చు. ఈ దుర్మార్గ చట్టాల మూలంగా 1776 నుండి 1887 నాటికి, 150 కోట్ల ఎకరాల భూమి ఆదివాసుల చేతుల నుండి వెళ్ళిపోయింది. ప్రతి చట్టం ఆదివాసుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూనే వచ్చాయి. హక్కుల కోసం పోరాడిన ప్రతిసారి మారణకాండ జరుగుతూనే వచ్చింది. గొప్ప ప్రజాస్వామికవాదని లోకమంతా పొగిడే అబ్రహం లింకన్ 1862లో తమ హక్కుల కోసం డకోట యుద్ధంలో వీరోచితంగా పోరాడిన వందలాది ఆదివాసులను నిర్బంధించి, మొత్తం అమెరికా చరిత్రలోనే ఎప్పుడూ జరుగని విధంగా ఒకేసారి 38 మంది ఆదివాసులను తెల్లప్రజల హర్షధ్వానాల మధ్య బహిరంగంగా ఉరితీయించిండు.

అలాగే ఇప్పుడు బడిపిల్లల పుస్తకాలలో 'టెడ్డీ బేర్'గా పిలువబడే తియొడోర్ రూజ్వెల్ట్ తన అధ్యక్ష పదవీ కాలంలో (1901–1909) ఒకవైపు సామ్రాజ్యవాద విస్తరణ చేస్తూనే మరోవైపు ఆదివాసుల అన్ని హక్కులూ అణచివేసిండు. "చనిపోయిన ఇండియన్స్ మాత్రమే మంచి ఇండియన్స్" అని ఆదివాసి జాతిని అంతరింపచేసే తన కోరికను ప్రకటించిండు. అంతేకాదు, మేలైన మానవజాతే (అంటే తెల్లజాతే) మిగలాలని లక్షలాది ఆదివాసులకు సంతానోత్పత్తి కలగకుండా బలవంతపు శస్త్ర చికిత్సలు చేయించిండు. (సరిగ్గా హిట్లర్ కూడా ఇదే

జాత్యహంకార యుజెనిక్స్ పద్ధతులు వాడాడు). కోట్లాది ఎకరాల ఆదివాసి భూములను దురాక్రమణ చేసి వాటిని నేషనల్ పార్కులుగా మార్చి గొప్ప "ప్రకృతి సంరక్షకుడిగా" పేరు తెచ్చుకుండు. అందుకే, మౌంట్ రష్మోర్ నేషనల్ పార్క్‌లో గ్రనైట్ కొండపై చెక్కిన "జాతిపితలలో" రూజ్వెల్ట్ ఒకడయ్యాడు. ఆశ్చర్యంగానే, ఆ నెత్తురంటిన చేతులతోనే 1906 నోబెల్ శాంతి పురష్కారం కూడ అందుకున్నాడు.

వీటన్నింటికి పరాకాష్ట 1953లో తెచ్చిన "ది ఇండియన్ టెర్మినేషన్ పాలసి." దీనితో ఆదివాసి రిజర్వేషన్లకు ఇవ్వబడిన నామమాత్రపు స్వయంప్రతిపత్తి కూడ రద్దు చేయబడి, వాళ్ళను "అమెరికనైజ్" చేయాలని ఒక సాంస్కృతిక విధ్వంసం కొనసాగించింద్రు. ఆదివాసి ఆచార సాంప్రదాయాలను, జీవిత విధానాలను అనాగరికమని వ్యతిరేకించింద్రు. "వాళ్ళలో వున్న అనాగరికతను చంపి, నాగరిక మానవుడిని నిలబెట్టాలని" వందలాది పిల్లలను బలవంతంగా బోర్డింగ్ స్కూల్స్ లోకి నెట్టివేసింద్రు. వాళ్ళ భాషను, అలవాట్లను, తినేతిండిని, కట్టేబట్టను పూర్తిగా మార్చేసింద్రు. ఆ పిల్లలను తమ సాంస్కృతిక సంపదకి దూరం చేసి తమ సమూహాల మధ్యే ఒంటరి అయ్యేలా చేసింద్రు. వాళ్ల గతమంతా చెరిపేసి, భవిష్యత్తంతా తెల్ల వాళ్ళతో ఎలా బ్రతకాలో బలవంతంగానైనా నేర్పించాలనుకున్నరు.

ఓ వైపున రాజ్యం నరమేధం చేసుకుంటూ పోతుంటే, మరోవైపు మిషనరీలు మిగిలివున్న ఆదివాసులను క్రైస్తవీకరించే పనిలోపడ్డవి. ఆదివాసుల జీవితాలలో వ్యక్తిగత ఆస్తి, వ్యవస్థీకృత రాజ్యము, కట్టుబాట్ల కంచె వేసే మతము ఎప్పుడూ లేవు. కాని చివరికి అవే వాళ్ళ కుతికలకు బిగుసుకున్నవి. ఆదివాసుల పోరాటాల ఫలితంగా, 1975లో "టెర్మినేషన్" పాలసీని రద్దుచేసి రిజర్వేషన్లకు కొంత స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికీ, సాంస్కృతిక సామ్రాజ్యవాదం చేసిన గాయం తరాలు దాటినా ఇంకా సలుపుతూనే వుంది. వందల ఏండ్లుగా ఇంతటి హింస కొనసాగుతుంది కాబట్టే చేగువేరా "అమెరికా మానవ జాతికే శత్రువని" ప్రకటించిండు.

మొత్తంగా అమెరికన్ రాజ్యం ఆదివాసులతో చేసుకున్న దాదాపు 700 ఒప్పందాలలో దేనికీ కట్టుబడి వుండలేదని చరిత్ర, వర్తమానం చెప్తూనేవున్నాయి. ఇప్పుడు చేపట్టిన పైప్ లైన్ ప్రాజెక్ట్ కూడా ఆ ఉల్లంగనలో భాగమే. దానిని వ్యతిరేకిస్తే రాజ్యము, పెట్టుబడి హింసను ప్రయోగిస్తాయని తెలిసి కూడా, ఆదివాసులు పోరులో నిలబడి వున్నారు. "మేము ఈ నేల మూలవాసులం. ప్రకృతిలో ప్రకృతిగా బతికినోళ్ళం. ఈ ప్రకృతిని కాపాడుకుంటం. కేవలం మా కోసమే కాదు, మీ కోసం మీ పిల్లల భవిష్యత్ కోసం కూడ మేము పోరాడుతం" అని గడ్డిపోచలు చేతుల్లో పట్టుకుని ప్రమాణం చేస్తుంద్రు. అంతరించి పోతుందనుకున్న జాతి చూపుతున్న తెగువ పోరాడే శక్తులన్నింటికి సంక్షోభ సందర్భంలో ప్రాణవాయువుగా మారనుంది. గెలుపూ, ఓటముల అంచనాలు ఏవైనా, రాజ్యం అండతో తెగబలిసిన కార్పొరేట్ మద గజాన్ని ఇప్పుడు నిలువరిస్తున్నది ఏకమైన గడ్డిపోచలే! ❑

# సమతా శక్తుల కూటమి కోసం

**(32వ పేజీ తరువాయి)**

అన్ని కులాల్లోని, ముఖ్యంగా మనువాద సంస్కృతి వలన ఈ నాటికీ వివక్షతకు, అధికంగా దోపిడీకి లోనవుతున్న కులాల్లోని శ్రామికులను ఐక్యం చేయగలిగే సాహిత్యం అవసరం.

2.2. అదే సరిపోదు ! మనువాద మతోన్మాద కార్పోరేట్ నయాఫాసిస్టు బీజేపీని అధికారం నుంచి దించాలి.

2.3. అందుకోసం చెదిరిపోయి ఉన్న వామపక్ష, సామాజిక ప్రజాస్వామ్య (social justice) మరియు లౌకిక శక్తులన్నీ సత్వరమే ఒక రాజకీయ కూటమిగా ఏర్పాటు కావడం కోసం ఉత్ప్రేరకంగా కృషి చేయాలనే ఆలోచనతో ఈ గ్రూపును ఏర్పాటు చేయడం జరిగింది. అలా ఏర్పడే కూటమి ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మిస్తూ 2029లో జరిగే సాధారణ ఎన్నికలలో స్వయంగానో లేదా NDAకి ప్రత్యామ్నాయంగా ఏర్పడిన ఇండియా (INDIA) కూటమితో జతకట్టో అధికారంలోకి వచ్చి secular, non-corporate democratic sovereign welfare రాజ్యాన్ని ఏర్పాటు చేయటం తక్షణ కర్తవ్యం. అందుకోసం, ఆన్‌లైన్, భౌతిక సమావేశాలు నిర్వహించుకుని, ఒక కామన్ మినిమం ప్రోగ్రాం రూపొందిద్దాం. ఆ ప్రోగ్రాంను వామపక్షాలకు, సోషల్ జస్టిస్ ఫోర్సెస్‌కు, లౌకిక శక్తులకు ఇచ్చి ఒక రాజకీయ కూటమిగా ఏర్పడమని విజ్ఞప్తి చేద్దాం. ఈ థీమ్ ను వివిధ పద్ధతుల్లో సమాజంలో ప్రచారం చేద్దాం. కనీసం తెలుగు రాష్ట్రాలలోనైనా ఇలాంటి కూటమి త్వరగా ఏర్పడేటట్లు తెలుగు ప్రజల్లో బౌద్ధిక భౌతిక రంగాల్లో వేగంగా, నిర్దిష్టంగా కృషిచేద్దాం. తద్వారా, బహుళత్వ లౌకిక ప్రజాస్వామ్య సమాజాన్ని విచ్ఛిన్నం చేసే RSS పరమ ప్రమాదకరమైన పురాతన భావజాలాన్ని బలహీన పరిచేందుకు, 2029 లో (లేదా అంతకు ముందో) జరిగే సాధారణ ఎన్నికల తర్వాత మళ్లీ బీజేపీ కాషాయ కార్పోరేట్ నియోఫాసిస్టు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు కాకుండా కృషి చేద్దాం. ఈ గ్రూపు సభ్యులు ఈ లక్ష్యానికి ఉపయోగపడే విషయాలను మాత్రమే ఈ గ్రూపులో పోస్టు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ❑

**అభివందనాలతో..**

**అడ్మిన్ల బృందం, 'సమతా శక్తుల కూటమి కోసం'**

# భూసేకరణ చట్టం : ఏపీ, తెలంగాణలు ఎలా మార్చేశాయి?

- పృథ్వీరాజ్

భూసేకరణ చట్టంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సవరణలు చేస్తున్నాయి. ఈ సవరణలు చట్టస్ఫూర్తికి భిన్నంగా ఉన్నాయని విమర్శకులు అంటున్నారు. ప్రభుత్వాలు మాత్రం వివిధ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ఇవి అవసరమే అంటున్నాయి. ఆ వరుసలో గుజరాత్ ముందు నిలువగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అదే బాటలో నడుస్తున్నాయి. భూసేకరణ చట్టం 2013లో ఏ నిబంధనలు సవరిస్తున్నారు ? ఎలా సవరిస్తున్నారు? ఎందుకు సవరిస్తున్నారు?

## ఏమిటి 2013 భూసేకరణ చట్టం?

1894లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో మొదటిసారి భూసేకరణ చట్టం తెచ్చింది. దీని ఆధారంగా 120 ఏళ్లపాటు మన దేశంలో ప్రభుత్వాలు భూసేకరణ చేశాయి. భూములను బలవంతంగా తీసుకోవడానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో ఆందోళనలు తలెత్తాయి. పశ్చిమ బెంగాల్‌లో సింగూరు, నందిగ్రామ్‌లలో రైతుల ఆందోళన హింసాత్మకంగా మారింది. దీంతో భూసేకరణ విధానాలపై నిరసనలు ఉధృతమయ్యాయి. పాత చట్టాన్ని మార్చాలన్న డిమాండ్లు బలపడటంతో యూపీఏ-2 ప్రభుత్వం 'భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం-2013' చేసింది. 2014 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టంలో అనేక అంశాలను పొందుపరిచింది. 107 సెక్షన్ ప్రకారం ఈ చట్టం కింద చెల్లించగల పరిహారంకన్నా అధికంగా పరిహారం చెల్లించేందుకు లేదా పునరావాసం, పునర్నిర్మాణం ప్రయోజనాలకన్నా మెరుగైన ప్రయోజనాలను అందించేందుకు ఈ చట్టాన్ని మెరుగు పరచడం లేదా మరిన్ని అంశాలను చేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయవచ్చు. ఈ సెక్షన్ కింద గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అసలు చట్టంలోని కీలక అంశాలను నిర్వీర్యం చేస్తూ తమకు అనుకూలంగా భూసేకరణ చట్టాలను రూపొందించాయి.

## అసలు చట్టంలోని ముఖ్యాంశాలు

ప్రభావిత ప్రాంతంలో భూసేకరణ వల్ల కలిగే సామాజిక ప్రభావంపై సర్వే చేయాలి. పునరావాస, పునర్నిర్మాణ ప్రణాళికను రూపొందించాలి. ప్రజాభిప్రాయం సేకరించి నివేదికలో పొందుపరచాలి. గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్ ఆమోదం పొందాలి. బహుళపంటలు పండే భూమిని అనివార్యమైతే చివరి దారిగా తప్పితే ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. ఒకవేళ సేకరించాల్సి వస్తే ఆ పంట భూమికి బదులుగా ప్రత్యామ్నాయ భూమికి నీటి సౌకర్యం కల్పించి, దానిని అభివృద్ధి చేసి ఆహార ధాన్యాల కొరత రాకుండా చూడాలి.

ప్రభుత్వ, ప్రభుత్వ - ప్రయివేటు ప్రాజెక్టుల కోసం భూమిని తీసుకుంటే 70 శాతం, ప్రయివేటు సంస్థల కోసం తీసుకుంటే 80 శాతం ప్రభావిత కుటుంబాలు సమ్మతి తెలిపితేనే భూసేకరణ మొదలుపెట్టాలి. షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజన భూములైతే ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. సేకరించే భూమి మార్కెట్ విలువ ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు రెట్ల వరకూ, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్ల వరకూ అదనపు నష్టపరిహారం ఇవ్వాలి.

పట్టణాభివృద్ధికి సేకరిస్తే.. ఆ భూమిని అభివృద్ధి చేసి యజమానులకు 20 శాతం భూమి ఇవ్వాలి. పరిశ్రమల్లో 25 శాతం వాటా ఇవ్వాలి. ఇళ్లు కోల్పోతే ఇందిరా ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. పట్టణ ప్రాంతాలలోనైతే 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. దీనికి బాధితులు ఆమోదించకపోతే ఒకేసారి రూ.1.50 లక్షలకు తగ్గకుండా ఎక్కువ ఎంతైనా ఇవ్వవచ్చు.

సాగు నీటి ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన చిన్నస్థాయి రైతు కుటుంబానికి కనీసం ఎకరం భూమి ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకైతే కోల్పోయిన భూమికి సమానంగా మరోచోట భూమి ఇవ్వాలి. ఇళ్లు పోతే ఇంటి నిర్మాణ ఖర్చు అంచనా కట్టి అంతే మొత్తంలో చెల్లించాలి. సేకరించే భూమిపై ఆధారపడ్డ కూలీలు, కౌలుదారులు, వృత్తిదారులు ఎవరైనా సరే భూసేకరణకు ముందు మూడేళ్లపాటు సదరు భూమిపై ఆధారపడి ఉన్నట్లయితే వారందరూ పరిహారానికి అర్హులవుతారు. వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, చిరు వ్యాపారులు, ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబానికీ ఒకరికి శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇవ్వాలి. లేదా ఒకేసారి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలి లేదా 20 ఏళ్లపాటు నెలకు రూ.2,000 చొప్పున చెల్లించాలి. సేకరించిన భూమిలో ఐదేళ్లలోపు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోతే ఆ భూమిని దాని పూర్వపు యజమానులకు గాని, వారి వారసులకు గాని తిరిగి ఇవ్వాలి. పరిహారం, పునరావాసం, పునర్నిర్మాణానికి సంబంధించి ఏ అంశాలనైనా ప్రభుత్వ అధికారులు, కంపెనీలు ఉల్లంఘిస్తే సదరు వ్యక్తులకు కనీసం ఆరు నెలలు, గరిష్టంగా మూడేళ్లు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

### ఈ చట్టం మీద ప్రతిస్పందనలు ఏమిటి?

2013 భూసేకరణ చట్టంలో పొందుపరిచిన పునరావాసం, పునర్నిర్మాణం, నష్ట పరిహారం, యజమానుల అంగీకారం వంటి అంశాలు సానుకూలంగా ఉన్నాయని సామాజిక సంస్థలు, రైతు సంఘాలు ఆహ్వానించాయి. అయితే 'ప్రభుత్వ అవసరం' అనే దానికి నిర్వచనంలో అస్పష్టత, కౌలు రైతులకు పరిహారం వంటి అంశాలపై నిర్దిష్టత లోపించాయని అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు పారిశ్రామిక వర్గాల నుంచి ఈ చట్టం మీద తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సామాజిక సర్వే, పునరావాసం, పునర్నిర్మాణం తదితర నిబంధనలు సంక్లిష్టంగా ఉన్నాయని.. భూయజమానుల్లో 80 శాతం మంది ఆమోదం వంటి నియమాల వల్ల భూసేకరణ కష్టమవుతుందని పేర్కొన్నాయి. ఈ నిబంధనల వల్ల భూసేకరణ ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరుగుతుందని, ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దేశంలో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపి, భూముల రేట్లు పెరిగిపోతాయని చెప్పాయి.

### మోదీ సర్కారు సవరణలు ఏమిటి ?

2014 మే చివర్లో కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చింది. నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తామని చెప్పిన బీజేపీ.. పారిశ్రామిక వర్గాల ఆందోళనను పరిష్కరించడానికి 2013 భూసేకరణ చట్టానికి సవరణలు ప్రతిపాదించింది. భూయజమానుల అంగీకారం తప్పనిసరి అన్న నిబంధనను సడలించటం.. సామాజిక ప్రభావ సర్వే తప్పనిసరి అనే నిబంధనను తొలగించటం.. బహుళ పంటలు పండే భూములను సేకరించటం.. 'ప్రజా అవసరాల'లో ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు విద్యా సంస్థలను చేర్చటం.. 'ప్రైవేటు కంపెనీ' పదాన్ని 'ప్రైవేటు ఎంటిటీ' అని మార్చటం.. భూమిని ఐదేళ్లపాటు వినియోగించకపోతే తిరిగి ఇచ్చేయాలన్న నిబంధనను సడలించటం వంటి సవరణలు అందులో ఉన్నాయి. వీటిని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు వివిధ పౌర సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ చట్టాన్ని ఆమోదించినపుడు బీజేపీ మద్దతు తెలిపిందని కాంగ్రెస్ గుర్తు చేసింది. లోక్‌సభలో ప్రభుత్వానికి మెజారిటీ ఉన్నప్పటికీ రాజ్యసభలో అవసరమైనంత మద్దతు లేకపోవడంతో ఈ సవరణలపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలను ఒప్పించడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో 2014 డిసెంబర్ 31న ఈ సవరణలను ఆర్డినెన్స్ రూపంలో అమలులోకి తెచ్చింది. ఆ తర్వాత 2015 మే 30 వరకూ మరో రెండుసార్లు ఇదే ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఆ తర్వాత బిహార్, దిల్లీ తదితర రాష్ట్రాల ఎన్నికలు ఉండటంతో ఆర్డినెన్స్ కాలం ముగిశాక అలా వదిలేసింది. లోక్‌సభలో ఆమోదం పొందిన సవరణ బిల్లు రాజ్యసభలో ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

### గుజరాత్ ఏం చేసింది?

2013 భూసేకరణ చట్టానికి సవరణలు చేస్తూ గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం 2016 ఏప్రిల్‌లో శాసనసభలో బిల్లు ఆమోదించింది. 'ప్రజా అవసరాలు', 'పారిశ్రామిక కారిడార్ల' కోసం చేపట్టే భూసేకరణకు సామాజిక ప్రభావ సర్వే, భూయజమానుల అంగీకారం నిబంధనలను తొలగించింది. రక్షణ రంగం, రోడ్లు, కాలువలు, స్కూళ్లు, అందుబాటు ధరలో గృహ నిర్మాణం వంటి సామాజిక మౌలిక వసతులను ప్రజా అవసరాలుగా పేర్కొన్నారు. దీనికి రాష్ట్రపతి ఆగస్టులో ఆమోదం తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని సవరిస్తూ జారీచేసిన ఆర్డినెన్స్‌లో పొందుపరచిన మార్పులన్నీ గుజరాత్ చట్టంలో ఉన్నాయి. 2013 భూసేకరణ చట్టం వల్ల భూసేకరణ ప్రక్రియ సుదీర్ఘంగా కష్టంగా మారింది కాబట్టి అందులో కఠినమైన నిబంధనలను సడలించాల్సిన అవసరముందని గుజరాత్ ప్రభుత్వం పేర్కొంది.

### తెలంగాణ ప్రభుత్వం ఎలా మార్చింది?

తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ కోసం 2015 జూలై 30న జీవో 123 జారీచేసింది. దాని ప్రకారం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో 'భూసేకరణ కమిటీ'లను ఏర్పాటు చేసి.. 'సుముఖంగా ఉన్న భూయజమానుల నుంచి ప్రజా అవసరాల కోసం' భూమిని సేకరిస్తారు. ఆ భూమికి మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తారు. భూములను తహసీల్దారు పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారు. ప్రభుత్వంతో ఒకసారి ఒప్పందం చేసుకుంటే ఆ భూమి/ఇల్లుపై యజమాని పూర్తిగా హక్కులు కోల్పోతారు. ఆ జీవో చెల్లదని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు 2016 ఆగస్టులో కొట్టివేసింది. 2013 భూసేకరణ చట్టం నిర్దేశించిన అనేక అంశాలను ఈ జీవో విస్మరించిందని తప్పు పట్టింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ చట్టానికి సవరణలు చేస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం లభించడంతో 2017 మేలో సవరించిన భూసేకరణ చట్టాన్ని నోటిఫై చేసింది. 2013 భూసేకరణ చట్టంలో నిర్దేశించిన.. సామాజిక ప్రభావ సర్వే, 70 లేదా 80 శాతం మంది యజమానుల అంగీకారం, మార్కెట్ విలువకు నాలుగురెట్ల వరకూ పరిహారం, పునరావాసం, పునర్నిర్మాణం, భూమిపై ఆధారపడ్డ వారికి పరిహారం వంటి నియమ నిబంధనలు చాలా వరకూ వర్తించకుండా చేసింది. బహుళ పంటలు పండే భూములను అత్యవసరమైనపుడు తప్పనిసరి పరిస్థితుల్లో మినహా సేకరించరాదన్న నిబంధన 'ప్రజా అవసరాల కోసం భూసేకరణ'కు వర్తించకుండా సవరించింది. 'ప్రజా అవసరాల' కింద.. ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులు, మౌలిక వసతుల నిర్మాణం, పారిశ్రామిక కారిడార్లు వంటివన్నీ చేర్చింది. పునరావాసం, పునర్నిర్మాణానికి బదులుగా ఒకేసారి ఏకమొత్తం పరిహారం చెల్లించేలా నిబంధనల్లో మార్పు

చేసింది. 2013 భూసేకరణ చట్టం అమలులోకి వచ్చిన 2014 జనవరి 1వ తేదీ నుంచి ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొంది.

**ఆంధ్రప్రదేశ్ సర్కారు చేసిన మార్పులేమిటి..?**

ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని నిర్మాణం కోసం 'భూసమీకరణ' పేరుతో వినూత్న విధానాన్ని అమలుచేసింది. రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్టును 2013 భూసేకరణ చట్టం నుంచి మినహాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 'ఆంధ్రప్రదేశ్ రాజధాని అభివృద్ధి సంస్థ చట్టం 2014'లో ఇందుకు సంబంధించిన విధి విధానాలను చేర్చింది. 2013 భూసేకరణ చట్టంలో పేర్కొన్న సామాజిక ప్రభావం సర్వే, బహుళ పంటల భూములకు మినహాయింపు, మార్కెట్ విలువకు నాలుగు రెట్ల వరకూ పరిహారం, పునరావాసం, పునర్నిర్మాణం వంటి నియమ నిబంధనల ఊసులేదు. భూ యజమానులు 'స్వచ్ఛందంగా' అప్పగించే భూములను ప్రభుత్వ సంస్థ సమీకరిస్తుంది. వాటిని అభివృద్ధి చేసిన తర్వాత అందులో భూమి, యాజమాన్యం వర్గీకరణను బట్టి ఎకరాకు 50 చదరపు గజాల నుంచి 1,000 వెయ్యి చదరపు గజాల వరకూ ప్లాట్లను యజమానులకు అప్పగిస్తారు. పదేళ్లపాటు ఏటా ఎకరాకు రూ. 30,000 నుంచి రూ.50,000 వరకూ చెల్లిస్తారు. సదరు వ్యవసాయ భూములపై ఆధారపడ్డ మిగతా వారందరికీ పదేళ్ల పాటు నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్ చెల్లిస్తారు. ఈ భూసమీకరణ విధానాన్ని పలు ఇతర ప్రాజెక్టులకు అమలు చేసింది. భూసమీకరణలో భూమిని ఇవ్వడానికి ఒప్పుకోని వారి నుంచి భూసేకరణ చేసేందుకు గుజరాత్, తెలంగాణల బాట లోనే 2013 భూసేకరణ చట్టానికి సవరణ చేస్తూ 2017 మార్చి లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభలో బిల్లును ఆమోదించింది. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు సవరించిన విధంగానే.. కీలకమైన సామాజిక ప్రభావ సర్వే, భూయజమానుల అంగీకారం, నష్టపరిహారం, పునరావాసం, పునర్నిర్మాణం వంటి నిబంధనలన్నిటినీ సడలించింది. కేంద్ర భూసేకరణ చట్టానికి 'సబ్ క్లాజ్ 10ఏ'ని చేర్చుతూ.. దేశ రక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, విద్యుదీకరణ ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వం నెలకొల్పే పారిశ్రామిక కారిడార్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టులు తదితరాలను పేర్కొంది.

ఈ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భారీగా భూమిని సేకరించాలనుకున్నప్పుడు బహుళ పంటలు పండే భూములకు మినహాయింపు, సామాజిక ప్రభావం అంచనా, భూయజమానుల అంగీకారం, గ్రామసభల ఆమోదం, రెట్టింపు పరిహారం వంటి నిబంధనలు ఈ ప్రాజెక్టులకు వర్తించవని నిర్దేశించారు. మార్చిలో బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించిన బిల్లుకు మరిన్ని మార్పులు చేస్తూ తాజాగా శాసనసభ శీతాకాల సమావేశాల్లో నవంబరు చివరిలో తాజా బిల్లును ఆమోదించింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం లభిస్తే చట్టంగా మారుతుంది. ❑

# గోర్ఖాలాండ్ ఉద్యమ నేపథ్య నవల 'విఫల'

**(35వ పేజీ తరువాయి)**

నవలలో తమకున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ, ఓ గుడిసెలో పడి వుండే బాస్నేత్, బాస్నేత్ని వృద్ధ దంపతులు వారి కుమారుడు ఝుప్సాయ్, అతని ప్రియురాలు నిమ్మా ప్రధాన పాత్రధారులు. వృద్ధులిద్దరూ శ్రమజీవులు. ఝుప్సాయ్ మాత్రం మిత్రుడితో కలిసి చుట్టు పక్కల గ్రామాల్లో అవారాగా తిరుగుతూ చిల్లర దొంగతనాలు చేస్తుంటాడు. నవల పొడవునా చిల్లర చిల్లరగానే తిరుగుతూ కనిపించే ఝుప్సాయ్ పాత్ర, చివరికి వచ్చేసరికి ఒక విషయం తనకు వ్యతిరేకంగా మారితే వెంటనే ఎంతకైనా తెగించి, ఆఖరికి ఉద్యమ ద్రోహిగా మారిపోయే వారికి ప్రతినిధిగా కన్పిస్తాడు. తనను చిన్నప్పటి నుంచి ప్రేమించిన నిమ్మాకు అన్యాయం చేస్తాడు. ఛ్యాతర్ అనే మరో పరమ స్వార్థపరుడు, తాగుబోతు, స్త్రీలోలుడు వంటి ఎన్నో అవలక్షణాలతో కూడి వున్నప్పటికీ గ్రామాల్లో నాయకుడుగా చలామణి అవుతూ సామాన్యులను ఏ విధంగా దోచుకుంటాడో ? ఎంత హింసకు తలపడతాడో? కళ్లకు కట్టినట్టు చిత్రిస్తాడు రచయిత లేఖ్ నాథ్ ఛత్రి. ఈ రచయిత 1907 నుండి 2012 వరకు తమ స్వరాష్ట్రం కోసం జరిగిన అనేక వాంఛనీయ, అవాంఛనీయ అంశాలను, ఉద్యమంలో అమరులైన 1200 మంది ఉద్యమకారుల జీవితాలను మనసులో నిక్షిప్తించుకుని, ఉద్యమంతో పరోక్షంగానో, ప్రత్యక్షంగానో తనకున్న అనుభవాల రీత్యా ఆ ఘటనలకు ప్రతిరూపంగా ఈ నవల రాశాడు. అతని మాదిరిగానే రాయగల వారందరూ ఉద్యమంలో మరణించిన ఆ 1200 మంది అమరుల కుటుంబాల నేపథ్యాలను, ఉద్యమంలో వారి త్యాగాలను సేకరించి రాసినట్లైతే!? 1200 నవలలే అయ్యేవి కదా!? చరిత్ర పుటల్లో కనుమరుగైపోయిన వారందరి జీవితాలు ప్రజల కళ్ల ముందు కనబడుతూ నిరంతరం వారి చేతిలోని కరదీపికలై నూతన ఉద్యమ మార్గాలను ప్రజలకు చూపించేవి కదా !? అన్పిస్తుంది.


ఈ పుస్తకం చదివిన తరువాత ఏ ఉద్యమంలోనైనా ఇటువంటి పొరపాట్లు జరగకుండా ఉద్యమకారుల్లోనే రాయగలిగిన వారితో ఆ ఉద్యమ కాలంలో జరిగిన ఘటనలన్నింటినీ అక్షరబద్ధం చేయించినట్లైతే? ఎంత సాహితీ సృజన జరిగి వుండేదో? ఎంతమంది అజ్ఞాత వీరుల త్యాగాలు వెలుగు చూసేవో కదా? ఇటీవలి చరిత్రతో కూడిన అరుదైన నవలను అందించిన 'ఛాయా' వారికి అభినందనలు. ❑




మీడియా డై..వర్షన్..




డాలర్ ముందు..!




ఊహించిందే..!

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 4 - Issue No : 3 Online Edition December 2025

# కొత్త పుస్తకాల స్వీకారం

